ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

site.singidinews.com

గురువారం 12 నవంబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 146 | పేజీలు 12 | వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

విదేశీ పౌరులకు వీసా ప్రక్రియ

మరింత సరళతరం

వీసా ప్రక్రియలో కేంద్రం కీలక మార్పులు



2



మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు

తీవ్ర అస్వస్థత

ఆసుపత్రికి తరలింపు

2

తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా

విద్యా సంస్కరణలు

పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్య

కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి భట్టి విక్రమార్క శంకుస్థాపన

సుమారు రూ.11 కోట్ల వ్యయంతో అందుబాటులోకి రానున్న నూతన పాఠశాల భవనం

2

తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని విద్యానగర్‌లో నూతన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.

కాజీపేట, నవంబర్ 11 (సింగిడి)



గ్రేటర్ హైదరాబాద్‌కు స్వచ్ఛ సిటీ పురస్కారం

తెలంగాణలోనే తొలి స్వచ్ఛ నగరంగా గ్రేటర్ హైదరాబాద్‌కు గుర్తింపు

తెలంగాణలోనే మొట్టమొదటి స్వచ్ఛ నగరంగా రికార్డు సృష్టించిన భాగ్యనగరం

ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ కింద కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన 'స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26' సర్వేలో తెలంగాణ రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌కు అరుదైన జాతీయ గుర్తింపు దక్కింది. రాష్ట్రంలోనే మొట్టమొదటి 'స్వచ్ఛ నగరం' (స్వచ్ఛ సిటీ)గా హైదరాబాద్ అవార్డును కైవసం చేసుకుంది. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో హైదరాబాద్ అత్యుత్తమ పనితీరు కనబరిచి ఈ ఘనత సాధించింది.

హైదరాబాద్, నవంబర్ 11 (సింగిడి) 2





విద్యా వ్యవస్థలో

భారీ మార్పులు

వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!

అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు ప్రాధాన్యం

12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా మౌలిక వసతులు

2

రాష్ట్ర విద్యా వ్యవస్థలో భారీ మార్పులకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పాఠశాల విద్యలో 10+2 విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని మార్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సంస్కరణల అమలులో ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా పరిగణించి విద్యార్థులకు ప్రత్యేక విద్య అందించాలని సూచించారు. విద్యార్థులకు 12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ (స్కిల్లింగ్) అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

హైదరాబాద్, నవంబర్ 11 (సింగిడి)

చెరువుల ఆక్రమణలతో

నగరానికి ముప్పు

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : సీఎం రేవంత్ రెడ్డి



మూసీకి పునరుజ్జీవం కల్పిస్తాం..

ఆక్రమణల చెర నుంచి చెరువులను విడిపిస్తాం

తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవంలో సీఎం కీలక వ్యాఖ్యలు

హీరో అక్కినేని నాగార్జునపై ప్రశంసల వర్షం

2

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రకృతి వనరులను పరిరక్షించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని తమ్మిడి కుంట చెరువు అభివృద్ధి పనుల అనంతరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రకృతి వనరులను పరిరక్షించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని తమ్మిడికుంట చెరువు అభివృద్ధి పనుల అనంతరం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రకృతి వనరులను పరిరక్షించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నగరంలోని తమ్మిడి కుంట చెరువు అభివృద్ధి పనుల అనంతరం నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొన్ని కుటుంబాలకు ఇబ్బందులు ఎదురైనా.. రాబోయే తరాలకు మంచి భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతోనే చెరువును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఒకప్పుడు 14 ఎకరాలకు కుంచించుకు పోయిన తమ్మిడికుంటను తిరిగి 30 ఎకరాలకు విస్తరించామని వెల్లడించారు. ఈ అభివృద్ధి కోసం ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున ముందుకొచ్చి రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అందించడం అభినందనీయమన్నారు. సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలోనూ నాగార్జున హీరోగా నిలిచారని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్, నవంబర్ 11 (సింగిడి)

రైతులకు రూ.62,370 కోట్ల

ఎరువుల సబ్సిడీ

ముద్రా, స్టాండ్‌అప్ ఇండియా పథకాలకు మరో ఐదేళ్ల పొడిగింపు

యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు

నోయిడా-గ్రేటర్ నోయిడా మెట్రోకు రూ.2,390 కోట్ల కేటాయింపు

మరో 2.5 లక్షల మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రుణాలు



2

రబీ సీజన్‌లో ఎరువుల కోసం రూ.62,370 కోట్ల సబ్సిడీకి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. అలాగే నార్ట్, సౌత్ బ్లాక్‌లను మ్యూజియంగా మార్చేందుకు అనుగుణంగా యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు కేటాయించేందుకు నిర్ణయించింది. నోయిడా సెక్టార్ 51 నుంచి గ్రేటర్ నోయిడా సెక్టార్ 4 వరకు రూ.2,390 కోట్లతో మెట్రో రైలు మార్గం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. స్టాండ్-అప్ ఇండియా పథకానికి, అలాగే ముద్రా యోజన కింద సూక్ష్మ యూనిట్లకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్‌ను 5 సంవత్సరాలపాటు కొనసాగించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం వెల్లడించారు.

- న్యూఢిల్లీ, నవంబర్ 11 (సింగిడి)

ఏపీలో విజయసాయిరెడ్డి కొత్త

రాజకీయ పార్టీ

'పరివర్తన రాజనీతి పార్టీ'ని ప్రకటించిన మాజీ ఎంపీ

2

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. మాజీ రాజ్యసభ సభ్యుడు వి. విజయసాయిరెడ్డి 'పరివర్తన రాజనీతి పార్టీ' పేరుతో నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. విజయవాడలోని ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఉదయం 11 గంటల 11 నిమిషాలకు నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ పేరు, జెండా, అజెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర రాజకీయాల్లో కుటుంబ ఆధారిత రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా తమ పార్టీ పని చేస్తుందని ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి ప్రకటించారు.

విజయవాడ, నవంబర్ 11 (సింగిడి)





EAGLE

'ఈగల్'.. 'ఫాలో ద మనీ'తో

రూ.100 కోట్ల ఆస్తుల జప్తు

మత్తు ముఠాల వెన్నులో వణుకు

2

తెలంగాణ ఈగల్ ఫోర్స్ వరుస దాడులతో మత్తు ముఠాలను హడలెత్తిస్తోంది. గ్రాము మత్తు పదార్థం దొరికినా సరే అవి ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరు సప్లై చేశారు? అమ్మేదెవరు? కొనేదెవరు? అసలిలా అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తూ నిందితులకు ఊపిరి ఆడకుండా చేస్తోంది. దిల్లీ, ముంబయి, ఒడిశా, గోవా, బెంగళూరు తదితర రాష్ట్రాలు, నగరాల్లో వరుసగా ఆపరేషన్లు నిర్వహిస్తూ నిందితుల్ని వేగంగా అరెస్టు చేస్తోంది.

హైదరాబాద్, నవంబర్ 11 (సింగిడి)



హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు

హైకోర్టు షాక్

రంగనాథ్‌ను కోర్టులో హాజరుపర్చాలని డీజీపీకి ఆదేశం

వ్యక్తిగత హాజరు మినహాయింపు పిటిషన్లు కొట్టివేత

2

'ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు?'

కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు!

నిర్మల్ రైతు గర్జన సభలో కాంగ్రెస్, బీజేపీలపై కేటీఆర్ నిప్పులు

రైతు భరోసా బకాయిలు, రుణమాఫీ పూర్తి చేయాలి..

కూలీలకు రూ.36 వేల సాయం అందించాలి

రైతుల కోసం రాజీలేని పోరాటం: కేటీఆర్

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలకు కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. "ఇది దేవుడిచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు. ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. పాలకుల వికృతి తెచ్చిన కరువు" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బుధవారం నిర్వహించిన 'రైతు గర్జన' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల సంక్షేమం కంటే రాజకీయాలే ముఖ్యమయ్యాయని విమర్శించారు.

నిర్మల్, నవంబర్ 11 (సింగిడి) 2



ఏపీలో పారిశ్రామిక రాయితీలకు

ఎస్క్రో ఖాతా విధానం

యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు జపాన్ సుముఖత

2026 డిసెంబరు నాటికి శ్రీసిటీలో అమార్వస్ మెటల్ తయారీ

విశాఖలో నూతన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు

కాకినాడ నుంచి జపాన్‌కు భారీగా గ్రీన్ అమ్మోనియా సరఫరా

జపాన్ రాయబారితో సీఎం చంద్రబాబు భేటీ

2



జనరల్ న్యూస్ సింగిడి

విద్యా వ్యవస్థలో భారీ మార్పులు

ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని సీఎం స్పష్టం చేశారు.
రాష్ట్రంలో పదో తరగతి తర్వాత సగటున 40 శాతం మంది విద్యార్థులు చదువును మధ్యలోనే మానేస్తున్నారని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో అత్యధికులు బాలికలతో పాటు దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన పేద విద్యార్థులే ఉంటున్నారని గుర్తుచేశారు. అయితే 12వ తరగతి వరకు కొనసాగింపుగా ఉన్న కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో డ్రాపౌట్స్ చాలా స్వల్పంగా ఉన్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 18 రాష్ట్రాల్లో 12వ తరగతి విధానమే విజయవంతంగా అమలవుతోందని సీఎం వివరించారు.

లెక్చరర్ల సర్వీసులకు పూర్తి రక్షణ

12వ తరగతి విధానం అమల్లోకి వస్తే తమ పరిస్థితి ఏమిటనే అంశంపై జూనియర్ కళాశాలల లెక్చరర్లు



ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం భరోసా ఇచ్చారు. జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది సర్వీస్ రూల్స్, ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ బెనిఫిట్లకు ఎటువంటి భంగం కలగకుండా పూర్తి రక్షణ కల్పిస్తామని తేల్చిచెప్పారు.

అద్దె భవనాలకు స్వస్తి.. యంగ్ ఇండియా స్కూల్స్ వేగవంతం

రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని సీఎం గట్టిగా ఆదేశించారు. ఆధునిక వసతులతో సొంత భవనాలను నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేస్తుందని చెప్పారు. పాఠశాలలు, హాస్టళ్లలో టాయిలెట్ల నిర్మాణం, రన్నింగ్ వాటర్ సౌకర్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. మరోవైపు ప్రతిష్టాత్మక 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' పనులను వేగవంతం చేయాలని, డిజిటల్ తరగతులు, ల్యాండ్‌స్కేపింగ్, స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్ ఎంపికలో రాజీపడకుండా ఉత్తమ ప్రమాణాలు పాటించాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు.

వర్సిటీల్లో ప్రొఫెసర్ల నియామకం.. పాలిటెక్నిక్‌ల ఆధునీకరణ

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని వైస్ ఛాన్సలర్లు, ఉన్నత విద్యామండలికి సీఎం సూచించారు. ఇప్పటికే ఐటీఐలను 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు'గా మార్చడం వల్ల విద్యార్థులకు పెద్దఎత్తున ఉద్యోగాలు దక్కాయని, అదే తరహాలో పాలిటెక్నిక్ కళాశాలల ఆధునీకరణకు నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కే కేశవరావు, పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు.



రైతులకు రూ.62,370 కోట్ల
ఎరువుల సబ్సిడీ

రబీ సీజన్‌లో ఎరువుల కోసం రూ.62,370 కోట్ల సబ్సిడీకి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. అలాగే నార్త్, సౌత్ బ్లాక్‌లను మ్యూజియంగా మార్చేందుకు అనుగుణంగా యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు కేటాయించేందుకు నిర్ణయించింది. నోయిడా సెక్టార్ 51 నుంచి గ్రేటర్ నోటియా సెక్టార్ 4 వరకు రూ.2,390 కోట్లతో మెట్రో రైలు మార్గం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. స్టాండ్-అప్ ఇండియా పథకానికి, అలాగే ముద్రా యోజన కింద సూక్ష్మ యూనిట్లకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్‌ను 5 సంవత్సరాలపాటు కొనసాగించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం వెల్లడించారు. వాటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

ముద్రా రుణాలు

సూక్ష్మ పరిశ్రమల కోసం ఉద్దేశించిన 'క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్ ' (సీజీఎఫ్ఎంయూ) పథకాన్ని కేంద్ర కేబినెట్ మరో 5ఏళ్లపాటు పొడిగించింది. అంటే 2031 మార్చి వరకు ఈ పథకం అందుబాటులో ఉంటుంది. పీఎం ముద్ర యోజన ప్రారంభమైనప్పటి నుంచి 2026 సెప్టెంబర్ వరకు బ్యాంకులు, రుణ సంస్థలు ఏకంగా 60.36 కోట్లకుపైగా రుణాలు మంజూరు చేశాయి. వాటి మొత్తం విలువ రూ.43.34 లక్షల కోట్లు ఉంటుంది. బ్యాంకులు లేదా రుణ సంస్థలు ఇచ్చే ఈ రుణాలకు డిఫాల్ట్ (రుణాలు తిరిగి చెల్లించలేకపోవడం) రిస్క్ లేకుండా సీజీఎఫ్ ఎంయూ పథకం రక్షణ లభిస్తుంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశంలో దీనికి రూ.5వేల కోట్ల మేర నిధులు కేటాయించేందుకు ఆమోదం లభించింది. దీని ద్వారా రూ.12.6 లక్షల కోట్ల విలువైన ముద్రాయోజన రుణాలకు ఊతం లభిస్తుంది. 2016 జనవరిలో ప్రారంభమైన ఈ సీజీఎఫ్ఎంయూ అనేది ముద్ర యోజన రుణాల వృద్ధిని వేగవంతం చేయడంలో ఒక ప్రధాన ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

విదేశీ పౌరులకు వీసా ప్రక్రియ
మరింత సరళతరం

న్యూఢిల్లీ, నవంబర్ 11 (సింగిడి)

విదేశీ పౌరులకు వీసా ప్రక్రియను మరింత సరళతరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. వీసా విధానంలో సమూల మార్పులు చేపట్టింది. ప్రధాన వీసా కేటగిరీల సంఖ్యను 13 నుంచి తొమ్మిదికి, ఉప కేటగిరీల సంఖ్యను 49 నుంచి 23కి తగ్గించింది. అదేవిధంగా వీసా దరఖాస్తుల్లో నింపాల్సిన వివరాల (ఫీల్డ్స్) సంఖ్యను 65-70 శాతం మేర కుదించింది. వీసా విధానాన్ని మరింత సమగ్రంగా, పారదర్శకంగా మార్చడంతోపాటు భారత్‌ను సందర్శించే విదేశీ పౌరుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ఈ మార్పుల ఉద్దేశమని కేంద్ర హోం శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.
''భారత వీసా విధానాన్ని మరింత సరళీకరించే క్రమంలో.. అభివృద్ధి చెందిన దేశాల వీసా వ్యవస్థలను, ప్రపంచ ప్రమాణాలను అధ్యయనం చేశాం. ఈ మార్పుల వల్ల వీసా దరఖాస్తును పూర్తి చేయడానికి పట్టే సమయం, శ్రమ తగ్గుతాయి. వీసా ఫారంలను మరింత నిశితంగా పరిశీలించి, ప్రాసెస్ చేయడానికి వీలవుతుంది. తద్వారా వీసాల జారీ సామర్థ్యం కూడా పెరుగుతుంది'' అని కేంద్ర హోంశాఖ పేర్కొంది. ఈ మార్పులకు అనుగుణంగా ఐటీ వ్యవస్థలను అప్‌డేట్ చేస్తున్నామని తెలిపింది. కొత్త మార్పుల కింద.. ఈ ఏడాది చివరినాటికి వీసాలు మంజూరు చేస్తామని వెల్లడించింది.
తొమ్మిది ప్రధాన వీసా కేటగిరీల్లో.. బిజినెస్, డిప్లమాటిక్, వర్క్, జర్నలిస్ట్, మెడికల్, అఫిషియల్, స్టూడెంట్, విజిటర్, ఇతర ఉన్నాయి.
గతంలో టూరిస్ట్ వీసాగా ఉన్న పేరును విజిటర్ వీసా గా మార్చారు. సాంప్రదాయ పర్యాటక రంగం కంటే విస్తృత ప్రయోజనాలను ఇది కవర్ చేస్తుంది. దీనిని వీ-1, వీ-2 అనే ఉప కేటగిరీలుగా విభజించారు.
స్టూడెంట్ వీసా కేటగిరీని ఎస్-1 (స్కూల్, గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్య), ఎస్-2 (పీహెచ్‌డీ, రీసెర్చ్, విజిటింగ్ ఫ్యాకల్టీ, ఇంటర్న్‌షిపలు మొదలైనవి) అనే ఉప విభాగాలుగా ఏకీకృతం చేశారు.
బిజినెస్ వీసాను బీ-1 (దీర్ఘకాలిక, లైసెన్స్ ఆధారిత వ్యాపార కార్యకలాపాలు), బీ-2 (స్వల్పకాలిక, కాంట్రాక్ట్ ఆధారిత వ్యాపార కార్యకలాపాలు) అనే ఉప విభాగాలుగా ఏకీకృతం చేశారు.



తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా
విద్యా సంస్కరణలు

స్థానిక బీసీ వెల్ఫేర్ బాలుర వసతిగృహం ప్రాంగణంలో సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్', 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలోని పది అగ్రదేశాలతో తెలంగాణ విద్యార్థులు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ పటిష్ఠపరుస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే సెమీ రెసిడెన్షియల్ విధానంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. ఈ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు డిజిటల్ బోధన అందించడంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. మరోవైపు, ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హనుమకొండలో ముందస్తు చర్యగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు.

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు షాక్

హైదరాబాద్, నవంబర్ 11 (సింగిడి)

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను వచ్చే మంగళవారం కోర్టులో హాజరుపర్చాలని డీజీపీని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. కోర్టు సమన్లు జారీ చేసినా విచారణకు హాజరు కాకపోవడంపై ఉన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రంగనాథ్, శంషాబాద్ తహసీల్దార్ పిటిషన్లను కొట్టివేసింది. శంషాబాద్ తహసీల్దా ర్‌ను కోర్టులో హాజరుపర్చాలని సైబరాబాద్ సీపీని ఆదేశించింది.

చెరువుల ఆక్రమణలతో నగరానికి ముప్పు

హైదరాబాద్‌ను ఒకప్పుడు రాక్స్ అండ్ లేక్స్ సిటీగా పిలిచేవారని సీఎం గుర్తుచేశారు. నగరంలో 1,372 చెరువులు ఉండగా.. వివిధ కారణాలతో వాటిలో సగానికిపైగా కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల ఆక్రమణల కారణంగా వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై నీరు నిలవడం, కాలనీలు జలమయం కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. చెరువులను కాపాడుకోవడం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో పర్యావరణ సమతుల్యతను కాపాడటంతోపాటు భవిష్యత్తు తరాలకు సహజ వనరులను అందించేందుకు చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

మూసీకి పునరుజ్జీవం కల్పిస్తాం

మూసీ నది ప్రక్షాళనపై సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో మూసీ వరదల నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు నిజాం ప్రభుత్వం ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నిర్మించిందని గుర్తుచేశారు. వికారాబాద్ ప్రాంతంలో ప్రారంభమయ్యే మూచుకుంద నది, మూసా, ఈసా నదులు కలిసే ప్రాంతంలో మూసీగా మారుతుందని వివరించారు. ప్రపంచంలోని అనేక నాగరికతలు నదుల ఆధారంగానే అభివృద్ధి చెందాయని, ఈ విషయాన్ని వందేళ్ల క్రితమే గుర్తించిన పాలకులు మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతం మూసీ తీవ్ర కాలుష్యానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. నది కాలుష్యం కారణంగా నల్లగొండ జిల్లా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు. అందుకే మూసీకి పునరుజ్జీవం కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మూసీ సుందరీకరణ మాత్రమే తమ ఉద్దేశం కాదని, నదిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి పునరుజ్జీవం కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలోనే తొలి దశ పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ ప్రక్రియలో ఎవరికీ నష్టం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, ప్రజలు ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు.

తమ్మిడికుంటతో లేక్ ఎకానమీకి ఊతం

తమ్మిడికుంటను అభివృద్ధి చేయడం ద్వారా నగర ప్రజలకు మరో ఆహ్లాదకరమైన ప్రదేశం అందుబాటులోకి వచ్చిందని సీఎం అన్నారు. నిన్నటి వరకు శిల్పారామం గురించి మాట్లాడుకున్న ప్రజలు.. ఇకపై తమ్మిడికుంట గురించి కూడా మాట్లాడుకుంటారని వ్యాఖ్యానించారు. ఇక నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ మాత్రమే కాదు.. వర్క్ ఫ్రమ్ తమ్మిడికుంట అనేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. చెరువు పరిసరాల్లో భద్రత కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఇక్కడ లేక్ ఎకానమీని అభివృద్ధి చేయాలని సూచించారు. చెరువు ఆవరణలో జమ్మి చెట్టు నాటాలని అధికారులకు సూచించారు. అలా చేస్తే భవిష్యత్తులో దసరా వేడుకలకు చెరువులు వేదికలుగా మారతాయని, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో చెరువులు, నదుల పరిరక్షణకు కీలక స్థానం ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



ఏపీలో విజయసాయిరెడ్డి కొత్త
రాజకీయ పార్టీ

పరివర్తన రాజనీతి పార్టీ జెండాను తెలుపు, కాషాయ రంగులతో రూపొందించారు. జెండా మధ్యలో ధర్మచక్రాన్ని ఏర్పాటు చేశారు. పార్టీని సంక్షిప్తంగా పిఆర్‌పిగా పిలవనున్నట్లు విజయసాయిరెడ్డి వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమం తమ పార్టీ ప్రధాన లక్ష్యాలని వివరించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న కుటుంబ రాజకీయాలకు తమ పార్టీ ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని విజయసాయిరెడ్డి తెలిపారు. రాజకీయాల్లో యువతకు 60 శాతం అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. యువతకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తూ.. రాజకీయాల్లో కొత్త తరానికి ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. విద్య, ఉపాధి, వ్యవసాయం, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి తమ పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అందించడం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, ప్రజల ఆదాయాలు మెరుగుపరిచే చర్యలు తమ అజెండాలో కీలక అంశాలని వివరించారు. రాయలసీమ పౌరుషం, ఆత్మగౌరవాన్ని కాపాడుతూనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

యువతలోనే నాయకుడిని గుర్తించి ముఖ్యమంత్రిని చేస్తా

తన రాజకీయ లక్ష్యాలపై విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష లేదని స్పష్టం చేశారు. శక్తి, సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాలు ఉన్న యువతలో సమర్థుడైన నాయకుడిని గుర్తించి ముఖ్యమంత్రిని చేస్తానని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌ను రెండు కుటుంబాలే పరిపాలించాలా? అని ప్రశ్నించారు. మంచి పని చేస్తే ఎవరైనా అభినందించాల్సిందేనని, తప్పు చేస్తే ఆధారాలతో ప్రశ్నించాల్సిందేనని విజయసాయిరెడ్డి అన్నారు. తాను చేసినా, చంద్రబాబు నాయుడు చేసినా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసినా తప్పును తప్పుగానే ప్రశ్నించాలని పేర్కొన్నారు.

'ఈగల్'.. 'ఫాలో ద మనీ'తో
రూ.100 కోట్ల ఆస్తుల జప్తు

తాజాగా ఫతేనగర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఓ వృద్ధురాలిని అరెస్టు చేసింది. ఆమె దగ్గర గంజాయి కొనుగోలు చేస్తున్న 70 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది దాదాపు 800 మంది మత్తు పదార్థాలు వినియోగించినట్లు గుర్తించారు. బాలానగర్‌లో 10 గ్రాముల గంజాయితో ఒకరు పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ముగ్గురిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి దగ్గర కొంటున్న 230 మంది పైన పలు సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేశారు. గంజాయి ఒడిశా నుంచి వస్తున్నట్లు విషయం బయటపడింది. ఈగల్ స్పెషల్ టీం అక్కడికి వెళ్లి ఐదుగురిని అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. చిన్న మొత్తంలో స్వాధీనం చేసుకున్న గంజాయి ఆధారంగా 240 మందిపై ఈగల్ అధికారులు కేసు నమోదు చేయడం గమనార్హం.

రాజధాని హైదరాబాద్‌పై ప్రధాన దృష్టి

హైదరాబాద్ కేంద్రంగా డ్రగ్స్ తయారీ, రవాణా జరుగుతున్నట్లు ఈగల్ దర్యాప్తులో బయటపడింది. నిందితులు హైదరాబాద్ నగరంలోని ఖాయిలాపడ్డ ఫ్యాక్టరీల్లో గుట్టుగా డ్రగ్స్ తయారు చేస్తున్నారు. ఇటీవల బీబీనగర్ కేసు దీనికి ఉదాహరణగా చూడొచ్చు. బీబీనగర్‌లో 27.2 కిలోల మెఫిడ్రిన్, 56.98 కిలోల అసిటిన్ లభించడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. దీనిపై దర్యాప్తు ప్రారంభించగా కొండమడుగులోని వేటుకూరి ల్యాబ్స్, మౌలాలిలోని ఎస్ఎం ల్యాబ్స్‌లలో డ్రగ్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించి వాటిని మూసేశారు.

ఆస్తులపైనా నజర్

మత్తు పదార్థాల కేసుల్లో నిందితులు జైలు నుంచి బయటకొచ్చాక మళ్లీ అదే దందా మొదలు పెడుతున్నారు. ఇటీవల వరుసగా డ్రగ్స్ కేసుల్లో పట్టుబడే నిందితుల ఆర్థిక మూలాలను ఈగల్ మెల్లిమెల్లిగా దెబ్బతీస్తోంది. ఇందుకోసం 'ఫాలో ది మనీ' అనే విధానాన్ని అనుసరిస్తోంది. నిందితులు సంపాదించిన ఆస్తుల వివరాలను సేకరించి సఫేమా చట్టం కింద జప్తు చేస్తోంది. 2024 నుంచి ఇప్పటివరకూ రూ.100 కోట్ల ఆస్తుల్ని జప్తు చేసినట్లు ఈగల్ అధికారులు తెలిపారు. 171 మంది నిందితుల ఆస్తుల వివరాలు సేకరించాలని ఈగల్ అధికారులు పోలీస్ శాఖలోని పలు యూనిట్లకు లేఖలు పంపారు.

'ఆంధ్రాకు నీళ్లు..
తెలంగాణకు ఎక్కిళ్లు?'

కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతును రాజులా చూసుకున్నామని, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీరు, రైతుబంధు అందించామని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రస్తుతం యూరియా కోసం రైతులు రోజుల తరబడి క్యూలైన్లలో చెప్పులు, పాస్‌పుస్తకాలు పెట్టుకుని ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రైతు ఫోన్ చేస్తే ఎరువుల బస్తాలు పొలాల వద్దకే చేరేవని, ఇప్పుడు యాప్‌ల పేరుతో సర్వర్లు పనిచేయక రైతులకు అరకొరగా యూరియా ఇస్తున్నారని మండిపడ్డారు. రైతుబంధు, రైతుభరోసా చెల్లింపుల్లో జాప్యం చేస్తూ రైతులను అప్పులపాలు చేస్తున్నారని ఆరోపించారు. నిర్మల్‌లో గులాబీ దళం కదం తొక్కి రైతు గర్జన సభ విజయవంతం కావడం చూస్తుంటే కాంగ్రెస్ వణకడం ఖాయమని అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నట్టేట ముంచిందని విమర్శించారు.

నిర్మల్‌తో తెలంగాణ ఉద్యమానికి అనుబంధం..

నిర్మల్ ప్రాంతానికి తెలంగాణ ఉద్యమంతో ప్రత్యేక అనుబంధం ఉందని కేటీఆర్ గుర్తుచేశారు. ''ఇది మామూలు జిల్లా కాదు.. చదువుల తల్లి సరస్వతి దేవి కొలువున్న పుణ్యభూమి. ప్రపంచ ప్రసిద్ధి పొందిన నిర్మల్ పెయింటింగ్స్, బొమ్మలు తయారుచేసే అద్భుతమైన కళాకారులు వర్ధిల్లే ధన్యభూమి'' అని అన్నారు.
1996లో నిర్మల్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వచ్చిన సమయంలో కేసీఆర్ మంత్రిగా ఉండి ఇక్కడ ఎన్నికల బాధ్యతలు నిర్వహించారని చెప్పారు. ఆ సమయంలో పోచంపాడు ప్రాజెక్టును సందర్శించిన కేసీఆర్.. నిర్వహణ లేక తుప్పుపట్టిన గేట్లు, నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టును చూసి ఆవేదన చెందారని వివరించారు. ''మన ప్రాజెక్టులు శివాలయాల మాదిరిగా ఉన్నాయి. కింది ఆంధ్రాకు నీళ్లు తీసుకుపోయే ప్రాజెక్టులు వైష్ణవ ఆలయాల మాదిరిగా కలకలలాడుతున్నాయి. మన ప్రాజెక్టులకు మళ్లీ మంచి రోజులు రావాలంటే అవసరమైతే నేనే ఉద్యమానికి శ్రీకారం చుడతా.. తెలంగాణను తీసుకొస్తా'' అని అప్పట్లో కేసీఆర్ చెప్పినట్లు కేటీఆర్ గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి తొలి అడుగులు పడిన ప్రాంతాల్లో నిర్మల్ కూడా ఒకటని పేర్కొన్నారు.
కేసీఆర్ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా 46 వేల చెరువులను పునరుద్ధరించామని, కాళేశ్వరం సహా పలు ప్రాజెక్టుల నిర్మాణంతో భూగర్భ జలాలు పెరిగాయని కేటీఆర్ అన్నారు. ఆదిలాబాద్ ప్రాంతంలోని గూడేలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతో పాటు 4.5 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చామని తెలిపారు. ప్రతి గ్రామానికి ట్రాక్టర్ సమకూర్చామని, వాటికి డీజిల్ పోయించే పరిస్థితి కూడా ప్రస్తుత ప్రభుత్వంలో లేదని విమర్శించారు. రైతుబంధు కింద 11 విడతల్లో సుమారు రూ.73 వేల కోట్లు పంపిణీ చేశామని, రైతుబీమా ద్వారా రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పించామని గుర్తుచేశారు. కరోనా సమయంలోనూ రైతుల నుంచి ప్రతి గింజను కొనుగోలు చేశామని అన్నారు.
కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అందుబాటులో ఉన్న నీటిని వినియోగించకుండా దిగువకు వదిలేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ''కృష్ణా, గోదావరి నదుల్లో వెయ్యి టీఎంసీల నీళ్లు రేవంత్‌రెడ్డి ఎత్తిపోకుండా కిందికి వదిలిపెట్టారు. పట్టిసీమ దగ్గర ఏపీ నీళ్లు ఎత్తిపోస్తుంటే.. ఇక్కడ కన్నెపల్లి, దేవాదుల దగ్గర పంపులు ఎందుకు ప్రారంభించడం లేదు? ఆంధ్రా ప్రాజెక్టులు ఎందుకు నిండుతున్నాయి? మన ప్రాజెక్టులు ఎందుకు ఎండిపోతున్నాయి? ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకు?'' అని ప్రశ్నించారు.
గోదావరి నది ప్రవహించే నిర్మల్ జిల్లాలో తొమ్మిది మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. కడెం, సదర్మాట్, స్వర్ణ, సుద్దవాగు వంటి ప్రాజెక్టుల నుంచి సాగునీరు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం పంపులు ప్రారంభించి నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. పట్టిసీమ నుంచి ఏపీ నీటిని వినియోగించుకుంటుంటే, తెలంగాణలో మాత్రం అందుబాటులో ఉన్న నీటిని కూడా వాడుకోవడం లేదని విమర్శించారు.
మేడిగడ్డ వద్ద ప్రస్తుతం రోజూ సుమారు 22 వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నా కన్నెపల్లి పంపులు ప్రారంభించి ఎత్తిపోయడం లేదని అన్నారు. వర్షాకాలంలో రోజుకు 10 నుంచి 11 టీఎంసీల నీరు వృథాగా వెళ్లిపోయిందని, తాము అసెంబ్లీలో, బయటా ఎంత మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పునర్జీవ పథకంలో భాగంగా కేసీఆర్ నిర్మించిన రివర్స్ పంపింగ్ వ్యవస్థ సిద్ధంగా ఉన్నప్పటికీ వినియోగించడం లేదన్నారు. వర్షాకాలంలోని 90 రోజుల్లో రోజుకు ఒక టీఎంసీ చొప్పున 90 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీకి ఎత్తిపోయవచ్చని, అలా చేసి ఉంటే కాకతీయ, సరస్వతి కాల్వల ఆయకట్టుతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ ఆధారిత చెరువులకు నీరందేదని పేర్కొన్నారు.
మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లకు ఏర్పడిన పగుళ్లను మూడేళ్లుగా మరమ్మతు చేయకుండా వదిలేశారని కేటీఆర్ విమర్శించారు. ''కేసీఆర్‌కు ఎక్కడ మంచి పేరు వస్తుందోననే అక్కసుతోనే మరమ్మతులు చేయడం లేదు. ఇప్పుడు ప్రజల దృష్టి మళ్లించేందుకు తమ్మిడిహట్టి పేరుతో కొత్త డ్రామాలు మొదలుపెట్టారు'' అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం నుంచి నిజాంసాగర్‌కు నీటిని ఎత్తిపోసి ఉంటే ఎల్‌నినో ప్రభావం ఉన్నా రైతులకు ఇన్ని ఇబ్బందులు వచ్చేవి కాదన్నారు. దాదాపు 90 శాతం పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు.



ర్యాగింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి)

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏ హెచ్ టి యు బృందం ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.సిరిసిల్ల పట్టణ పరిధిలోని సహస్ర జూనియర్ కళాశాలలో షీ టీమ్, ఏ హెచ్ టి యు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు , మానవ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలపాలని అధికారులు సూచించారు.బాలికల ,విద్యార్థుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా, వేధింపులకు గురిచేసినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేధింపులకు గురైన విద్యార్థినులు భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీమ్ కి ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ అవసరమైన రక్షణ, సహాయం అందిస్తామని భరోసా కల్పించారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వివిధ రూపాల్లో జరుగుతున్నాయని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, సోషల్ మీడియా పరిచయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకింగ్ సమాచారం ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో షీ టీం ఏ ఎస్.ఐ ప్రమీల , షీ టీం సిబ్బంది, ఏ హెచ్ టి యు సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుతడి పంటల సాగుతో నీటి ఆదా

ఆయిల్ పామ్ సాగుతో దీర్ఘకాలిక లాభాలు.. రైతులకు అధికారుల సూచన

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 11, (సింగిడి):

దుబ్బాక: రైతులు నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ పంటల మార్పిడికి ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయ అధికారులు సూచించారు. బుధవారం దుబ్బాక మండలం చెల్లాపూర్ గ్రామ రైతు వేదికలో సాగు భూమి సంరక్షణ, ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. యాసంగిలో భూగర్భ జలాలు తగ్గడం, విద్యుత్తు సమస్యలు, చెరువులు, కాలువల్లో నీటి లభ్యత లేకపోవడంతో వరి సాగు ఇబ్బందిగా మారే అవకాశం ఉందన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, పెసర, బొబ్బర్లు వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. వరి పొలాల్లో దుక్కి దున్నకుండానే జీరో టిల్లేజ్ విధానంలో మొక్కజొన్న



సాగు చేసే పద్ధతిని వివరించారు.ఉద్యానశాఖ అధికారి డి.రమేష్ మాట్లాడుతూ.. ఉద్యాన పంటల సాగుతో అధిక దిగుబడులు, ఆదాయం పొందవచ్చన్నారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో మూడు ఎకరాల వరకు కూరగాయలు సాగు చేయవచ్చని తెలిపారు. రైతులు పండ్ల తోటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఎండ తీవ్రత నుంచి పంటలను కాపాడుకునే విధానాలతో పాటు ఉద్యానశాఖ అందించే సబ్సిడీలను వివరించారు.ఆయిల్‌పామ్ సాగుపై మాట్లాడుతూ.. ఈ పంట 30 ఏళ్ల వరకు దిగుబడినిస్తుందని తెలిపారు. ఉద్యానశాఖ ద్వారా మొక్కలు, డ్రిప్ పరికరాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. మొదటి నాలుగేళ్లు అంతర పంటలు సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అంతర పంటలు, ఎరువుల కోసం ఎకరానికి ఏడాదికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు ప్రోత్సాహకం అందిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పామ్ గెలల ధర రూ.22 వేలుగా ఉందని తెలిపారు. నాలుగో సంవత్సరం తర్వాత తోటల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ప్రవీణ్, ఉద్యానశాఖ అధికారి డి.రమేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు అనూష, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ అరవింద్, ఏఎంసీ డైరెక్టర్ కిషన్‌రెడ్డి, మల్లారెడ్డి, జీవన్‌రెడ్డి, నర్సింలు, రైతులు పాల్గొన్నారు.

చదువే విద్యార్థి ప్రగతికి ఆధారం

విద్యార్థి దశ నుంచే ప్రణాళిక ప్రకారం అభ్యసించాలి..ఆదర్శమూర్తులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి)

విద్యార్థి ప్రగతికి చదువే ఆధారంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 20 పాఠశాలల్లో హెచ్ డీ ఎఫ్ సీ బ్యాంక్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సీఎస్ఆర్ ఇటీవల స్మార్ట్ క్లాస్ రూమ్ లు ఏర్పాటు చేయగా , సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ ఎం పీ హెచ్ ఎస్ లో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్ ను ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ బుధవారం హాజరై ప్రారంభించారు. జిల్లాలోని 20 పాఠశాలల్లో ఆయా పాఠశాలల్లో ఒక గదికి రంగులు వేసి..నాలుగు ఫ్యాన్లు, లైట్లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, పది డెస్క్ లు, యూపీఎస్ లు కూడా ఏర్పాటు చేయించారు. జిల్లాలోని సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రాజీవ్ నగర్ ఎంపీ హెచ్ఎస్, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని తారాక రామ నగర్ ఎంపీపీఎస్, తంగళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ , తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఆర్టీసన్ కాలనీ ఎంపీపీఎస్, తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, గంభీరావుపేట మండలం లింగన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల, గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట ఎంపీపీఎస్, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ ఎంపీపీఎస్, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఎంపీపీఎస్, చందుర్తి మండలం మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాల, చందుర్తి మండలం సనుగుల ఎంపీపీఎస్, వేములవాడ మండలం రుద్రవరం జడ్పీ ఉన్నత పాఠశాల, వేములవాడ పట్టణంలోని ఎంపీపీఎస్, వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి ఎంపీపీఎస్, కోనరావుపేట మండలం నిజామాబాద్ ఎంపీపీఎస్, రుద్రంగి ఎంపీపీఎస్ లో ఆయా సౌకర్యాలు కల్పించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ, శ్రద్ధతో సౌకర్యాలుజిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవ, శ్రద్ధతో జిల్లాలోని ప్రభుత్వ విద్యా సంస్థలు, హాస్పిటల్ లలో సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. పలు బ్యాంకుల ఆధ్వర్యంలో సీ ఎస్ ఆర్ కింద వసతులు కల్పిస్తున్నారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సీ ఎస్ ఆర్ కింద 22 లక్షల రూపాయలతో విద్యార్థుల సౌకర్యార్థం 145 బెడ్స్, పరుపులు ఏర్పాటు చేయించారు. హెచ్ డీ ఎఫ్ సీ బ్యాంక్ ఆధ్వర్యంలో కోటి రూపాయలతో స్మార్ట్ క్లాస్ రూమ్ లు ఏర్పాటు చేయించారు. త్వరలో జిల్లాలోని పలు ఆసుపత్రులు, అంగన్వాడీల్లో సీ ఎస్ ఆర్ కింద వసతుల కల్పన పనులు మొదలు కానున్నాయి. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వ్యక్తి వికాసం, అభివృద్ధికి చదువు



ఒక ఆయుధంగా ఉపయోగ పడుతుందని వివరించారు. ఎందరో ఆదర్శ వ్యక్తులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగారని గుర్తు చేశారు. బీఆర్ అంబేద్కర్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఏపీజే అబ్దుల్ కలాం వారి విద్యాభ్యాస కాలంలో ఎన్నో కష్టాలు పడి ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారని, దేశ నిర్మాణంలో విశేష సేవలు అందించారని కొనియాడారు. అలాగే ఇన్ఫోసిస్ చైర్మన్ నారాయణమూర్తి భార్య సుధా మూర్తి విద్యాభ్యాసం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆదర్శమూర్తుల ఉన్నతమైన విలువలు, దేశానికి, సమాజానికి అందించిన సేవలను ప్రతి విద్యార్థి స్ఫూర్తిదాయకంగా తీసుకొని ప్రణాళిక ప్రకారం చదవాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి తాము పుట్టిన ప్రాంతం, మాట్లాడే భాష, ఆర్థిక పరిస్థితి, కుటుంబ నేపథ్యం ఏవీ కూడా ఉన్నత విద్యాభ్యాసానికి అడ్డు రావని, ప్రతిభ చూపేందుకు అడ్డంకులు కావని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించి మంచిగా చదివి తాము అనుకున్న ఉన్నత ఉద్యోగాలు, స్వయం ఉపాధి, వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. విద్యార్థితో మార్పు సాధ్యమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ్ సాగర్, తహసీల్దార్ మహేశ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజీవ్ కుమార్, హెచ్ డీ ఎఫ్ సీ బాధ్యులు శ్రావణ్ కుమార్, నాగేశ్వరరావు, కమలాకర్, మండల విద్యాధికారి దూస రఘుపతి, కాంప్లెక్స్ హెచ్ ఎం మోతిలాల్, ఏఏపీసీ ఛైర్ పర్సన్ తిప్పవరం సుధ, హెచ్ఎం చక్రవర్తుల రమాదేవి, వార్డు కౌన్సిలర్ లింగంపల్లి భాగ్యలక్ష్మి , దొంతినేని కళ్యాణి తదితరులు ఉన్నారు.



చందాపూర్‌లో సీసీ కెమెరాల ప్రారంభం

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 11, (సింగిడి):

తొగుట: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని సీఐ శ్రీనివాస్ అన్నారు. తొగుట మండలం చందాపూర్‌లో గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ (అమర్) రెడ్డి, ఎస్ఐ నవీన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన చోటుచేసుకుంటే నిందితులను గుర్తించేందుకు కెమెరాల్లో నమోదైన దృశ్యాలు ఆధారంగా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజల భద్రత కోసం గ్రామస్థులు ముందుకొచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి గ్రామంలో ఇలాంటి చర్యలు చేపట్టాలని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి చందా లావణ్య స్వామి, ఉపసర్పంచి ఆత్మకూరు శ్రీకాంత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొంగరి నర్సింలు, డైరెక్టర్ చందా సత్తయ్య, బుచ్చాగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ నారాయణరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంది రాజు, నాయకులు కొండల్‌రెడ్డి, భాస్కర్, రమేష్‌గౌడ్, రాములు, అనుముల స్వామి, ఫిషర్మెన్ జిల్లా డైరెక్టర్ అక్కారం సత్తయ్య, వెంకటేశం, మహేందర్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేపై రైతులకు అవగాహన



ఆరుతడి పంటలను సాగు చేయాలి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి)

జిల్లాలో గంధరావుపేట భూముల రీసర్వే పై రైతులు కనీస అవగాహన పెంచుకోవాలని, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణ సమయంలో అధికారులకు సహకరించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. గంభీరావుపేట మండలం కుర్దులింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ బుధవారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ సర్వే ప్రక్రియ చేపడుతున్న బృందం భూముల వివరాలను ఖచ్చితత్వంతో సేకరించాలని, రైతులకు భూముల రీ సర్వేపై అవగాహన కల్పించాలని అన్నారు. పారదర్శకంగా, రైతుల సమక్షంలో భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు.రైతులు భూముల రీ సర్వే పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఎల్ నినో నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలు, అధికారుల సూచనలు రైతులు ఖచ్చితంగా పాటించాలని, వరికి బదులుగా ఇతర ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. జిల్లాలో ఆయిల్ పామ్, ఇతర కూరగాయల పంటలను సాగు చేస్తూ లాభాలు పొందుతున్న రైతుల అనుభవాలను తెలుసుకొని పంటలు సాగు చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ మారుతి రెడ్డి, సర్వేయర్, తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ కు నివాళి



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి)

స్వాతంత్ర సమర యోధుడు, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ విద్యా వ్యవస్థ నిర్మాణంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు.ఇక్కడ జిల్లా రెవెన్యూ శాఖ అధికారి, ఇంచార్జి మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి జయశ్రీ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి.. దుబ్బాక రైతుల గోడు వినండి!

మల్లన్నసాగర్ కాలువల పనులు పూర్తి చేయాలి
ఎనిమిది మండలాలకు సాగునీరు అందించాలి
దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 11, (సింగిడి):

ఈ నెల 19న సిద్దిపేట జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గ రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజిపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి ఆయన మాట్లాడారు..మల్లన్నసాగర్ ప్రాజెక్టు ద్వారా మంజూరైన కాలువల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.భూసేకరణ, కోర్టు కేసులు, కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తదితర కారణాలతో పలు కాలువల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ప్రధాన కాలువలతో పాటు పిల్ల కాలువల నిర్మాణం కూడా పూర్తికాకపోవడంతో ఎనిమిది మండలాల రైతులకు సాగునీరు అందడం లేదు.కాలువల నిర్మాణం పూర్తయితే తమ పొలాలకు సాగునీరు అందుతుందని ఆశించిన



రైతులకు నిరాశే మిగులుతోంది. ఏళ్లుగా పనులు పెండింగ్‌లో ఉండటంతో సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ఈ సమస్యను దృష్టికి తీసుకుని, పెండింగ్ కాలువల పనుల పూర్తికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అవసరమైన నిధులు విడుదల చేసి, భూసేకరణ సమస్యలు పరిష్కరించి, ప్రధాన, పిల్ల కాలువల నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దుబ్బాక రైతుల సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు వార్డు సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.





రేపు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి)

సిరిసిల్ల పట్టణంలోని కబ్జాకు గురైన కొత్తచెరువు నాలాల కాలువలను పునరుద్ధరించాలని కబ్జాదారులనుంచి కాపాడాలని అనేక సంవత్సరాలుగా ఫిర్యాదు చేస్తున్న అధికారుల్లో చలనం లేనందున హైదరాబాదులోని జలవిహార్ లో గల నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ సచివాలయంలోని నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి కి ఫిర్యాదు చేయడం అలాగే పలుమార్లు జిల్లా కలెక్టర్ కలిసి ఫిర్యాదు చేయడం వలన నిన్నటి రోజు ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు రాగా రెవెన్యూ శాఖ నుంచి రావలసిన సర్వేయర్ వచ్చి వెళ్లిపోవడం వలన సర్వేయర్ వచ్చిన తర్వాతనే సర్వే చేస్తామని వచ్చిన అధికారులు కూడా తిరిగి వెళ్లిపోవడం జరిగింది ఇలా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తూ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న పట్టించుకోకపోవడం వలన రేపు ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నాకు పిలుపు ఇవ్వడం జరిగింది . గతంలో ఏదైతే కొత్త చేరువు నీరు



వాటి సహజ నాలాల ద్వారా సర్వేనెంబర్ 39 రోడ్డం ద్వారా మానేరు వాగులో కలిసేది ఆ నీరు అలా ప్రవహించినప్పుడు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేది ప్రస్తుతం కొత్తచెరువు నీటిని పై భాగంలో ఉన్నటువంటి శ్రీనగర్ కాలనీ నుంచి కచ్చా కాలువ ద్వారా తుమ్మలకుంటకు తరలించడం జరుగుతుంది . పైకి నీరు ప్రవహించలేక కాలువ గండ్లు పడి ఇళ్లలోకి నీరు చేరి కాలనీ అంతా తుంగమడుగులతో నిండి విషపురుగులు పాములతో మోకాలు లోతు నీరు ఇళ్ల ముందర చేరడం వలన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు చిన్నపిల్లలు బయటకు రాలేని పరిస్థితి నెలకొని ఉన్న అధికారులు రాజకీయ నాయకులు ఓట్ల కోసం హామీలే ఇద్దరు తప్ప క్షేత్రస్థాయిలో పనిచేయరని కళ్ళ ముందు ప్రత్యక్షంగా కనబడుతూ ఉన్నది అధికారుల్లో చలనం వచ్చి పూర్వపు నాళాలు ఎలా ఉండెను అలా పునరుద్ధరించేంతవరకు ఏఐఎఫ్టీయూ న్యూ పక్షాన ఇక్కడి ప్రజల కోసం రోజువారి పోరాటాలు కొనసాగిస్తామని చెప్పి రేపటి ధర్నాను విజయవంతం చేయగలరని పిలుపునిస్తూ ఉన్నాం . ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్టియును రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం నాయకులు, కొండ శ్యామ్, గుజ్జే దేవదాస్, పంతం సుజాత, కొనవేని భారత, గాజుల కళావతి, తడిగొప్పుల వజ్రవ్వ ఇంకా వరద బాధిత మహిళలు తదితరులు పాల్గొన్నారు

సీఎం సభ ఏర్పాట్లపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 11, (సింగిడి):

ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట పర్యటన నేపథ్యంలో బహిరంగ సభ ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. సభ నిర్వహణకు ఎంపిక చేసిన నాగదేవత ఆలయం నుంచి రింగ్‌రోడ్డు ప్రాంతం వరకు చేపడుతున్న పనులను బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ కె. హైమావతి, పోలీస్ కమిషనర్ రెష్మీ పెరుమాళ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సభా ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు



చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సదానందం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌తో పాటు పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ పునఃసర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలి

కామారెడ్డి, నవంబర్ 11:(సింగిడి)

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూ సరిహద్దులపై స్పష్టత తీసుకువచ్చి, భవిష్యత్తులో వివాదాలకు తావులేకుండా ఖచ్చితమైన భూ రికార్డులు రూపొందించడమే లక్ష్యంగా చేపట్టిన భూ పునఃసర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్లు అధికారులను ఆదేశించారు.కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పోతారం గ్రామంలో బుధవారం భూ పునఃసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి హాజరై గ్రామ సరిహద్దుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ.. భూ పునఃసర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.సర్వే అధికారులు సమాచారం అందించిన వెంటనే రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఇతర భూ సంబంధిత పత్రాలతో నిర్దిష్ట సమయంలో హాజరై సర్వే బృందాలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. రైతులందరి భాగస్వామ్యం ఉంటే పునఃసర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయడం సాధ్యమవుతుందని తెలిపారు.భూముల సరిహద్దులపై స్పష్టత తీసుకురావడం, భూ రికార్డుల్లో కచ్చితత్వాన్ని పెంపొందించడం, భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చూడటమే ఈ పునఃసర్వే ప్రధాన ఉద్దేశమని అదనపు కలెక్టర్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాల్వంచ తహసీల్దార్, మండల సర్వేయర్, గ్రామ పంచాయతీ అధికారి (జీపీఓ), పోతారం, భవానీపేట గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

కామారెడ్డి కలెక్టరేట్‌లో ఘనంగా జాతీయ మైనారిటీ దినోత్సవ వేడుకలు

కామారెడ్డి, నవంబర్ 11:(సింగిడి)

భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ మైనారిటీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జరిగిన ఈ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ వి. విక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వేడుకలను ప్రారంభించారు.

ఎడిటోరియల్

Editorial

టెక్నాలజీ మానవ జీవితాలను సులభతరం చేయాలి !

(12 నవంబర్ "ప్రపంచ ఉపయోగ్యత దినోత్సవం" సందర్భంగా)



మన దైనందిన జీవితంలో టెక్నాలజీ ఉపయోగం, దాని ప్రాధాన్యత అత్యంత కీలకం. నేడు మానవాళితో టెక్నాలజీ విడదీయరాని సంబంధం కలిగి ఉంది. టెక్నాలజీ లేని జీవితాలను ఊహించడం కష్టం అయిపోయింది. కమ్యూనికేషన్, విద్య, వైద్యం, వ్యాపారం, వ్యవసాయం, రవాణా లాంటి ప్రధాన రంగాలు టెక్నాలజీని విరివిగా, తేలికగా ఉపయోగించడం చూస్తున్నాం. సాధారణ ప్రజలు ఉపయోగించి అనేక పౌర సేవలు, సాంకేతికత, వెబ్‌సైట్లు, యాప్‌లు అందరికీ సులభంగా, స్పష్టంగా, సౌకర్యవంతంగా ఉండేలా (యూజర్-సెంటర్డ్ డిజైన్లు) రూపొందించడాల్ని అవసరాన్ని అవగాహన కల్పించటానికి ప్రతి ఏటా నవంబర్ 2వ గురువారం, అనగా 12 నవంబర్ 2026 రోజున ప్రపంచవ్యాప్తంగా మానవాళి "ప్రపంచ ఉపయోగ్యత దినోత్సవం (వరల్డ్ యూజబులిటీ డే)" పాటించడం ప్రారంభమైంది. ప్రపంచ ఉపయోగ్యత దినోత్సవం-2026 ఇతివృత్తంగా "నైతిక కృత్రిమ మేధతో సుస్థిర భవిష్యత్తు తీర్చిదిద్దడం" అనే అంశాన్ని తీసుకొని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 140కి పైగా దేశాల్లో 2. 5 లక్షల మంది ఉపయోగ్యత ప్రయోజనాలను 'వరల్డ్ యూజబులిటీ ఇనిషియేటివ్' వేదికగా వివరించడం జరుగుతున్నది.

మానవాళి సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు :

మానవ సృజన, తెలివైన సాంకేతికత కలయిక ద్వారా మెరుగైన ప్రపంచాన్ని నిర్మించాలనే ధ్యేయంతో 2005లో ఉపయోగ్యత వయత్తి నిపుణుల సంఘం ఏర్పాటు చేసిన ప్రపంచ ఉపయోగ్యత దినోత్సవం ప్రచారంలో భాగంగా డిజిటల్ యుగపు ప్రతి టెక్నాలజీ సాధారణ పౌరుల సమస్యల పరిష్కారానికి సరళంగా, ఉపయుక్తంగా ఉండాలనే భావనను ఈ వేదికలు అవగాహన పర్చుతాయి. పలు సవాళ్ల నడుమ నడుస్తున్న మానవాళికి సమస్యలను అధిగమించే అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత టెక్నాలజీ రూపకర్తలదే అని గుర్తు చేయడం జరుగుతుంది. భూగోళంపై నెలకొన్న చిక్కుముడులను విప్పడానికి నేటి సైన్స్ అండ్ టెక్నాలజీ నడుం బిగించాలి. స్మార్ట్ ఫోన్ ఆధారిత ప్రస్తుత ప్రపంచంలో అంతర్జాలం, వెబ్‌సైట్లు, వివిధ యాప్‌లు మనిషి భవిష్యత్తును మార్చుతున్న తరుణంలో వాటి ఉపయోగం సులభంగా ఉండే విధంగా రూపొందించాలి. వినూత్న టెక్నాలజీ రావడం ఓ నిరంతర అనివార్య ప్రక్రియ. ఈ అత్యాధునిక టెక్నాలజీ వినియోగదారులను తేలికగా ఉపయోగపడాలి. ప్రతి ఒక్కరు ఈ టెక్నాలజీని వినియోగించే విధంగా యూజర్-సెంటర్డ్, యూజర్-ప్రెండ్లీగా రూపొందించాల్సిన అవసరం ఉందని టెక్నోక్రాట్లు గుర్తుంచుకోవాలి. సామాన్యుడికి అందుబాటులో లేని సాంకేతికత ఎంత గొప్పదైనా, దానికి గుర్తింపు రావడం అసాధ్యం. నేటి ఏఐ టెక్నాలజీ ఉపయోగంతో అందరికీ మేలు చేసే నమ్మకమైన పర్యావరణ హిత పరిష్కారాలు చూపడం తక్షణ అవసరం.

టెక్నాలజీ మానవ శ్రమను తగ్గించాలి. సమయాన్ని ఆదా చేయాలి. దుష్ప్రభావాలకు దూరంగా ఉండాలి. సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు చైతన్య పరచాలి. టెక్నాలజీ కత్తికి రెండు వైపులా పదును ఉందని గమనించాలి. టెక్నాలజీ వరంగా మాత్రమే ఉపయోగపడాలని, అది శాపంగా మారరాదని గుర్తుంచుకోవాలి.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

అజరామర పాటల 'సిరివెన్నెల'



'చేంబోలు సీతారామశాస్త్రి'.. ఈ పేరు వినగానే అసలెవరో మీరు అనుకోవచ్చు..
అదే 'సిరివెన్నెల' సీతరామశాస్త్రి అంటే మాత్రం గొప్ప సినీ గేయ రచయితగా
తెలుగునాట ఆయన సుపరిచితులు. సినిమా పేరునే తన ఇంటి పేరుగా మార్చుకున్న
కవి ఆయన. యువత, ప్రజలకు మంచి విషయాలను చెప్పేందుకు ఎప్పుడూ పరితపించిన
వ్యక్తి సిరివెన్నెల. "క్లాస్‌రూమ్‌లో తపస్సు చేయుట వేస్ట్ గురు.. బయట
ఉన్నది ప్రపంచమన్నది చూడర గురు.." అంటూ ఓ మిత్రుడిగా, శ్రేయోభిలాషిగా
సూచిస్తాడు. నిరాశావాదంలో ఆశావాదాన్ని చిగురింపజేస్తూనే, వాస్తవాన్ని
గుర్తించాలని చెబుతాడు.. "బరువు అనుకుంటే బరువు/సులువు అనుకుంటే
సులువు.. ఎప్పుడూ ఏదో కరువు. అందుకే కమ్మని కలలో సరిచూసుకో" అని
అంటాడు.
చీటికి మాటికి గొడవ పడుతూ, ఎప్పుడూ ఏదో మూడీగా ఉండే వారిని ఉద్దేశించి
"ఎండలను దండిస్తామా.. వానలను నిందిస్తామా.. చలిని ఎటో తరిమేస్తామా.. ఛీ
పొమ్మని.. కస్సుమని కలహిస్తామా.. ఉస్సుమని విలపిస్తామా.. రోజులతో రాజీ
పడమా సర్లెమ్మనీ.. సాటి మనుషులతో మాత్రం సాగనని ఎందుకు పంతం.."
అని ఇంటి
యజమాని., పెద్ద మనిషి స్థానంలో నిలబడి సున్నితంగా మందలిస్తాడు. గమనాన్నే
గమ్యంగా భావించి ప్రతి విషయాన్నీ నిలిచి నిదానంగా ఆలోచించాలని,
పరిశీలించాలని, విశ్లేషించాలని గురువులా సలహా ఇస్తారు. "ఎంత వరకు ఎందు
కొరకు.. ఇంత పరుగు అని అడక్కు/గమనమే నీ గమ్యమైతే బాటలోనే బతుకు దొరుకు/
ప్రశ్నలోనే బదులు ఉంది గుర్తు పట్టే గుండెనడుగు"అని "గమ్యం"
చేరుకునేందుకు అనునయనంగా దిశానిర్దేశం చేస్తారు. "తరలిరాద తనే వసంతం తన
దరికి రాని వనాల కోసం" అని పర్యావరణాన్ని పలుకరిస్తాడు. వసంత కోకిల గానం
కోసం 'రుద్రవీణ' మోగిస్తాడు. "చేసేదేదో చేసేముందే.. ఆలోచిస్తే
తప్పుందా.. తోచిందేదో చేసేస్తుంటే/తొందరపాటే కాదా.. ఆచితూచి
అడుగెయ్యొద్దా../ఈతే తెలియాలి/నది ఎదురైతే/పూర్తై తీరాలి/కథ మొదలె డితే
/గెలుపే పొందాలి/ తగువుకు దిగితే/పడినా లేవాలి/ఏ పూటైనా ఏ
చోటైనా/నిలవని పయనం సాగాలి/రాళ్లే ఉన్నా.. ముళ్లే ఉన్నా..
దారైతైనాగానీ.. గమ్యం చూపించాలి" అని ప్రేరేపిస్తాడు యువతను తమ లక్ష్యాల
దిశగా పరుగెత్తమని.. "నొప్పి లేని నిమిషముందా..?" అని ప్రశ్నించి,
నిరంతరం ప్రయత్నముంటే నిరాశకే నిరాశ పుట్టదా అని తెలుపుతాడు. "సడే లేని
అలజడి ఏదో ఎలా మదికి వినిపించిందో/ స్వరం లేని రాగంతో చెలిమికెలా
స్వాగతమందో" అంటూ.., "గాలి వాలుగా ఓ గులాబీ వాలీ గాయమైనదీ నా గుండెకు
తగిలి/తపించిపోనా ప్రతీ క్షణం ఇలాగ నీ కోసం/తరించిపోనా చెలీ ఇలా
దొరికితే నీ స్నేహం", 'కుర్ర కళ్లు చీర గల్లలో దారే లేక తిరుగుతున్నవి'
అని చిలిపి ఊహలకు తెర తీయగలడు. ఆయన పాట అనుభవాలసారం,
దిశానిర్దేశం చేయగల
సాధనం. "అర్ధశతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్రమందామా?" అని
ప్రశ్నించగలడు.
సమాజాన్ని నిగ్గదీసి, నిప్పులాంటి కడగలడు. ఆయన పాటలను సునిశితంగా
గమనించగలిగితే ప్రతి పాటా ఓ వజ్రాయుధం అని అవగతమవుతుంది. యువ భారతాన్ని
కదపగల సామర్థ్యమున్న ఈ కవి మన తెలుగువారవడం భారత ప్రభుత్వం ఆయనను
పద్మశ్రీతో గౌరవించడం మనందరికీ గర్వకారణం. భౌతికంగా ఆయన లేకపోయినా నిత్యం
ఆయన గీతాలు మనలో చైతన్యాన్ని కలిగిస్తూ అజరామర గీతాలుగా నిలుస్తాయని
చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

- అంబీర్ శ్రీకాంత్,
సీనియర్ జర్నలిస్టు,
సెల్: 81859 68059.



భక్తి ఆడంబరంలో కాదు... ఆచరణలో కనిపించాలి!

దీపావళి వెళ్లిపోయింది. కార్తీక మాసం వచ్చింది. అయ్యప్ప మాలధారణలు మొదలయ్యాయి. ఆలయాల్లో పూజలు, అభిషేకాలు, భజనలు, బ్రహ్మోత్సవాలతో ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. ఇళ్ల ముందు దీపాలు వెలుగుతున్నాయి. దేవాలయాలు భక్తులతో కళకళలాడు తున్నాయి. ఇదంతా మన సంస్కృతిలో భాగం. మన సంప్రదాయాలకు ప్రతీక. కానీ ఈ సందడిలో మనల్ని మనం ఒక్కసారి ప్రశ్నించుకోవాలి. దీపావళి దీపాలు ఇళ్లలో వెలిగాయి... మరి మనిషి మనసులో వెలుగు నిండిందా? కార్తీక దీపాలు వెలిగిస్తున్నాం... మనలోని అహంకారం, అసూయ, ద్వేషం అనే చీకట్లను తొలగించగలిగామా? ఇదే నేటి సమాజం ముందున్న అసలైన ప్రశ్న!

భక్తి అంటే ఆడంబరమా? ఆచరణా?

రోడ్డుపక్కన ఆకలితో ఒక మనిషి కనిపిస్తే పట్టించుకోకుండా వెళ్లిపోతాం. అదే సమయంలో దేవుడి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిలబడతాం. దేవుడికి వంద కొబ్బరికాయలు కొడతాం. వేల రూపాయల కానుకలు సమర్పిస్తాం. కానీ పక్కింట్లో కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఒక్క రూపాయి సాయం చేయడానికి మాత్రం వెనుకాడతాం. దేవుడికి సమర్పించే నైవేద్యం కంటే ఆకలితో ఉన్నవారికి పెట్టే అన్నం విలువైనది కాదా? గుడిలో వెలిగించే దీపం కంటే నిరాశలో ఉన్న మనిషి జీవితంలో వెలుగు నింపడం గొప్పది కాదా? దేవుడు ఎక్కడున్నాడనే దానిపై మనకు ఎన్నో విశ్వాసాలు ఉండవచ్చు. కానీ బాధలో ఉన్న మనిషికి అండగా నిలబడటంలోనే మానవత్వానికి నిజమైన అర్థం కనిపిస్తుంది. నిజమైన భక్తి గుడి గోడల మధ్యనే ఉండకూడదు అది మన గుండెల్లో ఉండాలి. మన ప్రవర్తనలో కనిపించాలి. మన చేతల్లో ప్రతిఫలించాలి.

సమాజంలో తగ్గుతున్న మానవ సంబంధాలు!

ఈరోజు మనిషి ఎంతో అభివృద్ధి చెందాడు. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. ప్రపంచం అరచేతిలోకి వచ్చింది. సాంకేతికత పెరిగింది. సంపాదన పెరిగింది. సౌకర్యాలు పెరిగాయి. కానీ మనుషుల మధ్య ఆత్మీయత మాత్రం తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. పక్కింట్లో ఏం జరుగుతుందో తెలియదు. ఎదురింటి మనిషి కష్టాల్లో ఉన్నా పలకరించే తీరిక లేదు. ఒకే కుటుంబంలో ఉన్నవారికి కూడా మనసు విప్పి మాట్లాడుకునే సమయం దొరకడం లేదు. సోషల్ మీడియాలో వందలాది మందికి శుభాకాంక్షలు చెబుతున్నాం. కానీ ఎదురుగా కనిపించే మనిషిని చిరునవ్వుతో పలకరించలేకపో తున్నాం. ఇదే మన సమాజం ఆలోచించాల్సిన అంశం.

డబ్బు సంపాదించడం తప్పు కాదు. అభివృద్ధి సాధించడం అవసరమే. కానీ ఆ ప్రయాణంలో మనిషిని, మనసును, మానవ సంబంధాలను కోల్పోతే ఆ అభివృద్ధికి అర్థం ఏముంటుంది?

మూలధారణతో పాటు మనసులోనూ మార్పు రావాలి!

అయ్యప్ప దీక్ష అనేది కేవలం నల్లని వస్త్రాలు ధరించడం, మాల వేసుకోవడం, నియమాలు పాటించడం మాత్రమే కాదు. అది క్రమశిక్షణకు, సహనానికి, సమానత్వానికి, ఆత్మనిగ్రహానికి ప్రతీక.
దీక్షలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరినీ స్వామి అని పిలుస్తాం. కులం, మతం, ఆర్థిక స్థితి అనే మారడం కూడా అంతే ముఖ్యం. ప్రతి సమస్యకు ప్రభుత్వం మాత్రమే పరిష్కారం చూపాలని ఎదురుచూడకుండా, మన పరిధిలో మనం చేయగలిగిన మంచిని ప్రారంభించాలి.

చివరగా ఒక్కమాట...

పండగలు ప్రతి సంవత్సరం వస్తాయి. దీపాలు ప్రతి కార్తీకంలో వెలుగుతాయి. మాలధారణలు ప్రతి ఏడాది జరుగుతాయి. పూజలు, వ్రతాలు, దీక్షలు మన సంప్రదాయంలో కొనసాగుతూనే ఉంటాయి. కానీ వీటన్నింటి వల్ల మనిషిలో మంచితనం పెరుగుతోందా? ఎదుటివారి బాధను అర్థం చేసుకునే హృదయం ఏర్పడుతోందా? అన్నదే అసలైన కొలమానం. గుడికి వెళ్లడం మానేయమని కాదు. పూజలు చేయవద్దని కాదు. భక్తిని



తగ్గించమని అసలే కాదు. భక్తికి మానవత్వాన్ని జోడించమని మాత్రమే ఈ సమాజానికి విజ్ఞప్తి!

దేవుడికి పూలు సమర్పించే చేతులతోనే కష్టాల్లో ఉన్నవారికి చేయూతనిద్దాం.

దేవుడి ముందు తలవంచే మనసుతోనే ఎదుటివారి బాధను గౌరవిద్దాం.
ఎందుకంటే...
దీపం వెలిగించడం ఒక ఆచారం...
మనిషి జీవితంలో వెలుగు నింపడం ఒక బాధ్యత!
మాల మెడలో ఉండటం దీక్ష...
మానవత్వం మనసులో ఉండటం సంస్కారం!
దేవుడిని ఆరాధించడం భక్తి...
దేవుడి సృష్టిని ప్రేమించడం మానవత్వం!
ఈ కార్తీక మాసంలో మనమంతా ఒక చిన్న సంకల్పం చేద్దాం. ఒకరికి ఒకరం అండగా నిలుద్దాం. మనిషిని మనిషిగా గౌరవిద్దాం. మనలోని స్వార్థాన్ని తగ్గించుకుందాం. సమాజంలో ప్రేమ, దయ, సహనం, సేవాభావం పెంపొందిద్దాం. అప్పుడే పండగకు పరిపూర్ణత. అప్పుడే దీక్షకు సార్థకత. అప్పుడే మనిషిగా పుట్టినందుకు నిజమైన అర్థం!
స్వామియే శరణం అయ్యప్ప!

ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9440287170.

న్యుమోనియా అదుపుకు అవగాహనే ఔషధం

(12 నవంబర్ "ప్రపంచ న్యుమోనియా దినం" సందర్భంగా)

2021లో న్యుమోనియా అంటువ్యాధితో 2. 2 మిలియన్లు మరణించగా అందులో 5. 02 లక్షల మంది పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల లోపు వయసున్న పిల్లల అధిక మరణాలకు కారణమైన వ్యాధి న్యుమోనియా. కోవిడ్-19 కారణంతో మరో 10 మిలియన్లు కూడా అదనంగా మరణించినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అధిక ప్రాణాలను తీస్తున్న వ్యాధుల్లో న్సుమోనియా ప్రధానమైనదని తేలింది. వాతావరణ ప్రతికూల మార్పులు, గాలి కాలుష్యం కోరలు చాచడంతో శ్వాస వ్యవస్థ, ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నం కావడం, న్యుమోనియా మహా విపత్తు వస్తుందనే భయం కూడా ఉందని, మిలియన్ల జనులు న్యుమోనియా సోకే ప్రమాదపు అంచున ఉన్నారని వైద్యులు అంచనా వేస్తున్నారు. న్యుమోనియా వ్యాధి ఐదేండ్ల లోపు పిల్లలకు, వృద్ధులకు వస్తుంది. టీకాలు వేయించుకోని వారు, పోషకాహారలోపాలు, ఇంట్లో వంట చెరుకు వాడే వారు, కలుషిత గాలి పీల్చే పెద్దలు, పొర త్రాగే దురలవాటు ఉన్న వారు అధికంగా న్యుమోనియా బారిన పడే ప్రమాదం ఉంటుంది.

ప్రపంచ న్యుమోనియా దినం-2026 ఇతివృత్తం::

న్యుమోనియా వ్యాధి తీవ్రత, ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం 2009 నుంచి ప్రతి ఏట 12 నవంబర్ రోజున "ప్రపంచ న్యుమోనియా దినం" పాటిస్తూ ఆ వ్యాప్తి పట్ల కనీస అవగాహన కల్పించడం జరుగుతోంది. బ్యాక్టీరియా, వైరస్ లేదా ఫంగీ సంక్రమణ కారణంగా తాపజనక శ్వాస రుగ్మత (ఇన్ఫ్లమేటరీ రెస్పిరేటరీ డిసార్డర్) లేదా న్యుమోనియా వ్యాధి అంటుకుంటుంది. ఈ సూక్ష్మజీవులు ఊపిరితిత్తుల్లో చేరి "ఎల్వియోలి" అనే భాగంపై ప్రభావాన్ని చూపి న్యుమోనియాకు దారి తీస్తుంది. దీని వల్ల ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. బలహీన వ్యాధినిరోధకశక్తి కలిగిన పిల్లలు, వృద్ధులకు న్యుమోనియా సోకి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. ప్రపంచ న్యుమోనియా దినం -2026 ఇతివృత్తంగా "న్యుమోనియా అదుపులో కొత్త శకం



(ఏ న్యూ ఏరా ఆఫ్ న్యుమోనియా కంట్రోల్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

న్యుమోనియాలో రకాలు:

న్యుమోనియా నివారించదగిన అంటు వ్యాధి. వ్యాధిగ్రస్థుల తుమ్మడం, దగ్గడం, ముక్కు చీదడం లాంటి సందర్భాల్లో మరొకరికి సంక్రమిస్తుందని తెలుసుకోవాలి. పిల్లల్లో బ్యాక్టీరియా కారణ స్ట్రెప్టోకోకల్ న్యుమోనియా అతి ప్రధానమైనది. దాని తర్వాత హిమోఫిలస్ ఇన్ఫ్లుయెంజా రెండవ ప్రధానమైనది. న్యుమోనియాలో రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ వ్యాధి వైరస్ వర్గంలో ముఖ్యమైనది. న్యుమోనియా వ్యాధికి చికిత్స కూడా అందుబాటులో ఉన్నది. ప్రపంచ న్యుమోనియా దినం వేదికగా ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్య శాఖ, ఎన్‌జిఓలు, ఇతర సంస్థలు కలిసి న్యుమోనియా పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, రోగగ్రస్థులకప చికిత్సా పద్ధతులు వివరించడం మంచి ఫలితాలను ఇస్తాయి. న్యుమోనియాను తొలిదశలో గుర్తించడం, చికిత్స తీసుకోవడం, నివారణ మార్గాలను తెలుసుకోవడం లాంటి అంశాలను గుర్తుంచుకోవాలి.

న్యుమోనియా సోకడానికి కారణాలు:

ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ప్రతి ఏట 14 లక్షల పిల్లలు న్యుమోనియా సోకి చనిపోవడం, పిల్లల మరణాల్లో 18 శాతం వరకు న్యుమోనియా కారణం కావడం గమనార్హం. యూనిసెఫ్ వివరాల ప్రకారం ప్రతి 39 సెకన్లకు ఒక పిల్లవాడు న్యుమోనియాతో మరణిస్తున్నాడు. వృద్ధుల్లో న్యుమోకోకల్ న్యుమోనియా అధికంగా సోకుతుంది. న్యుమోసిస్టిక్ జిరోవెస్సీ వ్యాధి ఫంగస్ సోకడంతో వస్తుంది. గాలి కాలుష్యం, స్మోకింగ్ వల్ల 16 లక్షల వృద్ధులు మరణిస్తున్నారు. డబ్ల్యూహెచ్ఓ, యూనిసెఫ్‌లు సంయుక్తంగా న్యుమోనియా, డయేరియా వ్యాధుల కట్టడికి గ్లోబల్ ఆక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు, 65 ఏండ్లు దాటిన వృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్న రోగులు, పర్యావరణ కాలుష్య ప్రాంతాల్లో నివసిస్తున్న జనులు, హెచ్ఐవి/క్యాన్సర్ లాంటివి సోకిన వ్యాధిగ్రస్థులు న్యుమోనియా ప్రమాదంలో పడే అవకాశాలే ఎక్కువ.

నివారణ మార్గాలు:

టీకాలు వేయించడం, పోషకాహారం అందించడం, గాలి కాలుష్యాన్ని తగ్గించడం వల్ల న్యుమోనియా వ్యాధి తీవ్రత తగ్గుతుంది. ఆంటీబ్యాక్టీరియల్, అంటీ వైరల్, ఆంటీ ఫంగల్ ఔషధాలతో న్యుమోనియా కట్టడి జరుగుతుంది. భౌతిక దూరాలు పాటించడం, మాస్కులు ధరించడం, పబ్లిక్ పిరజేశాల్లో ఉమ్మి వేయకుండా ఉండడం, దగ్గినపుడు లేదా తుమ్మినపుడు కండువా కప్పుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, నదుల్ని కలుషితం కాకుండా చూసుకోవడం లాంటి పలు దాగ్రత్తలు న్యుమోనియా కేసులను తగ్గిస్తాయి.

పిల్లలకు, పెద్దలకు అతి ప్రమాదకరమైన అంటు వ్యాధిగా నిలిచిన న్యుమోనియా పట్ల సరైన అవగాహన పెంచుకొని అలాంటి ప్రాణాంతక రుగ్మతకు చరమగీతం పాడదాం, న్యుమోనియా కానరాని భారతాన్ని నిర్మించుకుందాం.

- **డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

మహా పాదయాత్ర విజయవంతానికి బీజేపీ సమావేశం

మానకొండూర్, నవంబర్11,(సింగిడి)

మండల కేంద్రంలోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి అధ్యక్షతన మహా పాదయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఈ నెల 18న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా పాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నవీన్ హాజరుకానున్న నేపథ్యంలో,మానకొండూరు మండలం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చి పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జన సమీకరణ, రవాణా ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించి, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫిలిం బోర్డ్ మెంబర్ ఉప సర్పంచ్ రాపాక ప్రవీణ్, శంషాబాద్ ఉప సర్పంచ్ డొల్ల సతీష్, జిల్లా నాయకులు రావుల శంకర చారి మండల ప్రధాన కార్యదర్శిలు భాషబోయిన ప్రదీప్ యాదవ్, శీలం



కుమార్, సీనియర్ నాయకులు సోన్నకుల శ్రీనివాస్, జిల్లెల్ల రాజమౌళి, ముద్దసాని రాజిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు పోచంపల్లి శ్రీనివాస్, మీస రమణయ్య, కార్యదర్శులు కోల శ్రీనివాస్, రావుల తిరుపతి యాళ్ల రాజగోపాల్ రెడ్డి, ఆరపెల్లి సునంద్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అడప రవి, గాడిచర్ల భూమయ్య, బూత్ అధ్యక్షులు మాదాసు కుమార్, శాతరాజు శ్రీనివాస్, మిరాల శ్రీనివాస్, నగునూరి ప్రవీణ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల, వికలాంగుల ప్రత్యేక వైద్య శిబిరం



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి)

మానసిక దివ్యాంగుల వికలాంగుల ప్రత్యేక వైద్య శిబిరం జిల్లా కలెక్టర్ గరీమా అగ్రవాల్, ఆదేశాల మేరకు, మానసిక దివ్యాంగుల, వికలాంగుల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని కోనరావుపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జెడ్పి హెచ్ఎస్ లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో మానసిక దివ్యాంగులైన విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, శారీరక మానసిక ఆరోగ్య పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటరమణ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. సైకాలజిస్ట్ డాక్టర్ అనూష విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిస్థితులను అంచనా వేసి, అవసరమైన కౌన్సెలింగ్, సూచనలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ మాట్లాడుతూ, మానసిక దివ్యాంగులైన పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారికి అవసరమైన వైద్య సేవలు, చికిత్సలు నిరంతరం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులలో గుర్తించిన ఆరోగ్య సమస్యలకు తగిన వైద్యం అందించడంతో పాటు, ఆరోగ్య పరిరక్షణకు సంబంధిత శాఖల సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచి కాశి రామ్ ఎంపీడీవో శ్రీమతి స్నిగ్ధ రెడ్డి, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటరమణ, సైకాలజిస్ట్ డాక్టర్ అనూష, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సంపత్ కుమార్, వైద్యాధికారి డాక్టర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మై భారత్..మేరా యువ భారత్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి)



జిల్లా స్థాయి 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ లో భాగంగా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026-27' కార్యక్రమం నవంబర్ 11 2026 న అత్యంత వైభవంగా నిర్వహించ బడింది. నాశ ముక్త్ యువ డ్రగ్ ఫ్రీ ఇండియా " అనే కీలక అంశంపై జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని, సమకాలీన రాజకీయ, సామాజిక అంశాలపై తమ ఆలోచనలను, ప్రసంగాల ద్వారా తెలిపారు. బి. జె. ఆర్ అగ్రికల్చర్ కళాశాల డీన్ డాక్టర్ ఉపేందర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల, దేశ పురోగతి పట్ల అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఇలాంటి యూత్ పార్లమెంట్ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ సామర్థ్యాలను, వక్తృత్వ నైపుణ్యాలను వెలికితీసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ 2047' స్వప్నాన్ని సాకారం చేయడంలో యువత పాత్ర అత్యంత కీలకమని పునరుద్ఘాటించారు. అత్యంత ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు:– మొదటి బహుమతి దీప్తి రాయ్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల రాజన్న సిరిసిల్ల – రెండో బహుమతి: ఎస్. కె రామిజ్ రాజా ప్రభుత్వ మెడికల్ కళాశాల రాజన్న సిరిసిల్ల ఫైనల్ ఇయర్ – మూడో బహుమతి: సి హెచ్ అవినాష్ రెడ్డి రాజన్న సిరిసిల్ల. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా యువజన అధికారి గోలీ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి పోటీలలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఈ విజేతలు రాష్ట్ర స్థాయి . పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన విజేతలకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే అరుదైన అవకాశం లభిస్తుందని ఆయన వివరించారు. రాజన్న సిరిసిల్ల మైభారత్ కార్యక్రమ అధికారి జి కిరణ్ కుమార్, కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ రజియా తెలంగాణ యునివర్సిటీ కామారెడ్డి ప్రొఫెసర్ డాక్టర్ అంజయ్య, నర్సింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ చైతన్య, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల లెక్చరర్ నవ్య, సైకజీస్ట్ పున్నం చందర్, మై భారత్ ప్రతినిధులు పెల్లి రాజు, అక్కేమ్ నాగరాజు, సాయి అక్షయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

సిద్దిపేట, నవంబర్ 11:



ప్రభుత్వాలు మారుతున్నా ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతుల బతుకులు మారడం లేదని పలు ప్రాజెక్టుల భూ నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన నష్టపరిహారం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు వెంటనే అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్, అంతగిరి, గౌరవెల్లి ప్రాజెక్టుల భూ నిర్వాసితులు మాట్లాడారు. 2016లో నిర్వహించిన దీక్షలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న రేవంత్‌రెడ్డి తమ సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో ఉన్న ఆయన తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.గత ప్రభుత్వ హయాంలో జీవో నంబర్ 123 ద్వారా తమ భూములను బలవంతంగా తీసుకున్నారని, ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిహారం అందలేదని వాపోయారు. ప్రాజెక్టులు పూర్తయి ఏళ్లు గడుస్తున్నా అనేకమంది నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు కూడా అందలేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించడంతో పాటు కోర్టులను ఆశ్రయించినా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయ పలుకుబడి ఉన్నవారికి భూములు, ఇళ్లు కేటాయించి, అర్హులైన కొంతమంది భూ నిర్వాసితులను విస్మరించారని ఆరోపించారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేట జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో, ఆలోపే తమకు రావాల్సిన నష్టపరిహారం చెల్లించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ కుటుంబాలతో కలిసి పాదయాత్రగా ముఖ్యమంత్రి ఇంటికి చేరుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో భూ నిర్వాసితులు ఎండీ హయతుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, పోచయ్య, ప్రవీణ్, బాబు, ప్రభాకర్, ఎల్లారెడ్డి, ఉమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్వన్నపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యే చొరవ

రూ.13.55 లక్షలతో పాఠశాల భవనం.. రూ.30 లక్షలతో సీసీ రోడ్లు 33 ఇందిరమ్మ ఇళ్లు.. రూ.30 లక్షలతో ధాన్యం గోదాం 40 ఏళ్ల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంపై దృష్టి

కామారెడ్డి ప్రతినిధి నవంబర్ 11(సింగిడి)



రాజంపేట: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రూ.13.55 లక్షలుగ్రామంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే, నూతన భవన నిర్మాణం కోసం ఇప్పటికే రూ.13.55 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యకు అనుకూల వాతావరణం కల్పించడమే లక్ష్యమన్నారు.33 ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు సొంతింటి భరోసాగత మూడేళ్లలో గ్రామానికి 33 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రూ.30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రూ.30 లక్షలతో సీసీ రోడ్ల పనులు చేపట్టి విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు. అలాగే రైతుల సౌకర్యార్థం రూ.30 లక్షలతో ధాన్యం నిల్వ గోదాం మంజూరు కాగా, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.40 ఏళ్ల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంపై దృష్టిబస్వన్నపల్లి ప్రజలు గత నాలుగు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. సమస్య పరిష్కారానికి కొత్త బోర్‌వెల్ తవ్వించాలా? లేక కొత్త బావి నిర్మించాలా? అనే అంశాలపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. మరోవైపు పైప్‌లైన్ ద్వారా గ్రామానికి నీటిని సరఫరా చేసేందుకు సుమారు రూ.40 లక్షలతో అధికారులు అంచనాలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.ఈ నేపథ్యంలో గ్రామ ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్న ఎమ్మెల్యే, బోర్‌వెల్ లేదా బావి నిర్మాణంపై గ్రామస్తులే నిర్ణయం తీసుకుని తెలియజేయాలని సూచించారు. ప్రజల నిర్ణయం మేరకు తదుపరి చర్యలు చేపట్టి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.200 కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ఆదేశాలుగ్రామంలో విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యతో పాటు పాత విద్యుత్ స్తంభాల కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సుమారు 200 కొత్త విద్యుత్ స్తంభాలు అవసరమని వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత విద్యుత్ శాఖ డీఈతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మహిళా సంఘాలకు రూ.10 లక్షలతో భవనంగ్రామ మహిళా సంఘాల సభ్యులకు ఇచ్చిన హామీ మేరకు రూ.10 లక్షల వ్యయంతో స్వయం సహాయక సంఘాల భవనాన్ని మంజూరు చేయించారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు కొనసాగుతుండగా, స్లాబ్ పనులు జరుగుతున్నాయి.అభివృద్ధి పనులతో గ్రామానికి కొత్త దిశవిద్య, గృహ నిర్మాణం, రహదారులు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్, మహిళా సంఘాల అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ బస్వన్నపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయి. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ, అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కార మార్గాలను అన్వేషించడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొంటున్నారు.మాటలకే పరిమితం కాకుండా అభివృద్ధి పనుల ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ ముందుకు సాగుతున్నారనే అభిప్రాయం గ్రామంలో వ్యక్తమవుతోంది.

రైతులకు అండగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్, నవంబర్ 11,(సింగిడి)



రైతులకు అండగా నిలుస్తూ, వారు పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్, దేవంపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊటూరు పీఏసీఎస్ లక్ష్మీపూర్‌లో, దేవంపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో దేవంపల్లి, పచ్చునూరు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో ఊటూరు, దేవంపల్లి, మానకొండూర్ పీఏసీఎస్ చైర్మన్లు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, రొంటాల లక్ష్మారెడ్డి, నాగిశెట్టి రాజయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్లు బొంగోని కనకయ్య, వర హోలచారి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, పార్టీ నాయకులు మర్రి ఓదెలు యాదవ్, రామిడి తిరుమల్ రెడ్డి, బుర్ర శ్రీధర్, ఎర్ర శ్రీధర్, కనకం అశోక్, తమిశెట్టి రాజేష్, అంజిరెడ్డి, గుడాల మహేందర్, మంద బక్కారెడ్డి, దాసరి శ్రీనివాస్, గుడాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూపునారాయణపేట-విలాసాగర్ హైలెవల్ బ్రిడ్జి పనులు పునఃప్రారంభం

80 కోట్ల అంచనా వ్యయం ఓదెల, జమ్మికుంట మధ్య తగ్గనున్న ప్రయాణ దూరం ప్రభుత్వ విప్ విజయరమణ రావు

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 11 (సింగిడి):



పెద్దపల్లి నియోజకవర్గం ఓదెల మండలం రూపునారాయణపేట సమీపంలోని మానేరు వాగుపై నిర్మిస్తున్న హై లెవల్ వంతెన పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ఓదెల మండలం రూపునారాయణపేట నుండి కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామం వరకు రూ. 80 కోట్ల నిధులతో నిర్మించనున్న ఈ వంతెన పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు బుధవారం పునఃప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కష్టాలను తీర్చేందుకు రూ. 80 కోట్ల భారీ నిధులను మంజూరు చేశారని తెలిపారు. గతంలో పనులు ప్రారంభించినప్పటికీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఆలస్యమయ్యాయని, అందుకే వేరే కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించి పనులను పునఃప్రారంభించినట్లు వివరించారు.

వ్రయాణ సమయం, దూరం భారం తగ్గుతుంది

ఈ వంతెన నిర్మాణం పూర్తి కావడం వల్ల ఓదెల, కాల్వ శ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలాల ప్రజలు జమ్మికుంట, హుజూరాబాద్, వరంగల్ ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రయాణ దూరం మరియు సమయం గణనీయంగా తగ్గుతుందని ఆయన తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత వ్యవధిలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రివర్గ సహకారంతో పెద్దపల్లి నియోజకవర్గానికి పెద్ద ఎత్తున అభివృద్ధి నిధులు తీసుకువస్తున్నట్లు ఈ సందర్భంగా గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సింగిల్ విండో చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు ...తెలంగాణ రక్షణ సేనలో చేరండి

మానకొండూర్,నవంబర్11(సింగిడి)



ఇల్లంతకుంట మండలంలోని వైశ్యభవన్‌లో తెలంగాణ రక్షణ సేన పార్టీ మండల అధ్యక్షులు పొళ్ళాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమల్ల చైతన్య హాజరయ్యారు.ఈ సందర్భంగా చెన్నమల్ల చైతన్య మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీలోకి యువత పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. కవితక్క ప్రవేశపెట్టిన పంచజన్య సూత్రాలు, ప్రజా సంక్షేమ విధానాలకు ఆకర్షితులై అనేక మంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దని, దేశానికి యువతే పట్టుకొమ్మలని, సమాజ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని సూచించారు.రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఇల్లంతకుంట మండలానికి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. పెద్ద లింగాపల్లిలో సాగునీరు అందించకపోవడంపై ప్రశ్నించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు తరలిస్తున్నారే తప్ప తెలంగాణ రైతులకు సాగునీరు అందించడంపై తగిన శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు.కవితక్క తెలంగాణ ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించడమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కవితక్కను ముఖ్యమంత్రిగా చూడటమే తమ లక్ష్యమని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండలం సెక్రటరీ దాసరి కిషోర్, మండల మైనారిటీ అధ్యక్షులు ఎండి. సమాద్,తూర్పటి రవీందర్,తాళ్ల పల్లి సాహిల్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ పట్టణ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

అధికారులతో సమీక్షించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రతి వార్డులో నిత్యం పారిశుధ్య పనులుపర్యవేక్షించాలి..మున్సిపల్ అధికారులు, సిబ్బందికి చైర్మన్ ఆదేశాలు

వేములవాడ, ప్రతినిధి నవంబర్ 11(సింగిడి)



పట్టణ పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగు పరిచి, వేములవాడను పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు అధికారులు, జవాన్లతో కలిసి పట్టణ పారిశుధ్య నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రతిరోజూ చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రోడ్లు, మురికి కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో అపరిశుభ్రత లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, పారిశుధ్య సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. ముఖ్యంగా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ స్వచ్ఛ ఆటోలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణ పరిశుభ్రత కేవలం మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు.ప్రజల సహకారంతోనే పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దగలమని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ సమావేశంలో శానిటరీ ఇన్స్పెక్టర్ సుకుమార్, మున్సిపల్ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ కు డిజిటల్ బోర్డు బెంచీలు ఫ్యాన్స్ విరాళం



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి)

జిల్లాలోని వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామ హైస్కూల్ కు,హెచ్ డి ఎఫ్ సిబ్యాంక్ వారు,పద వ తరగతి విద్యార్థులకు కూర్చోవటానికి, బెంచీలు, ఫ్యాన్స్, డిజిటల్ బోర్డు, ఇవ్వటం జరిగింది, ఇట్టి కార్యక్రమంలో, సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి,స్కూల్ చేర్మెన్ రాధారపు లావణ్య,వార్డు సభ్యులు, తునికి స్వరూప నరేష్, గుండెల్లి శ్రీనివాస్, వంకయల మహేశ్వర్, సింగల్ విండో చేర్మెన్ పిల్లి కనుకయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కత్తి కనుకయ్య, మాజీ సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, హై స్కూల్ హెచ్ఎం,మాధవి లత, యుపిఎస్ హెచ్ఎం. వంకయల లక్షి రాజాం &టీచర్స్, పాల్గొన్నారు.

రాజరాజేశ్వర స్వామి అన్నదాన ట్రస్టుకు ₹1,00,001 విరాళం



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి):

జిల్లాలో వేములవాడ ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు వరంగల్‌కు చెందిన వేముల సువర్ణ – నాగరాజు దంపతులు లక్ష ఒక రూపాయి నగదును విరాళంగా అందించారు.బుధవారం ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో పిఆర్ఓ పెరిక శ్రీనివాస్‌కు వారు ఈ విరాళం నగదు రూపంలో అందజేశారు.అనంతరం స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కును చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు దంపతులకు వేదాశీర్వచనం తో పాటు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రమాద బాధితుడికి బండి పరామర్శ

కరీంనగర్, నవంబర్ 11(సింగిడి)

రోడ్డు ప్రమాదంలో గాయపడిన గంగిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంబటి తిరుపతి రాజును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. గంగిపల్లి నుంచి కరీంనగర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మానకొండూర్ చెరువు కట్ట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తిరుపతి రాజు గాయపడ్డారు.విషయం తెలుసుకున్న బండి సంజయ్ తొలుత ఫోన్‌లో ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తన అధికారిక కార్యక్రమాలు ముగించుకుని తిరుపతి రాజు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆయన వెంట ఉన్నారు.



బూడిద రవాణాలో వసూళ్ల పర్వం



లారీకి రూ.500 వసూలు
కుందనపల్లి వద్ద ఏం జరుగుతున్నది..?
కలెక్టర్, ఎమ్మెల్యే సమాధానం చెప్పాలి
మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



పెద్దపల్లి ప్రతినిధి,(సింగిడి):
కుందనపల్లి ఎన్టీపీసీ బూడిద రవాణా లారీల నుంచి గత మూడేళ్లుగా ఒక్కో ట్రిప్పునకు రూ.500 చొప్పున వసూళ్లు జరిగాయన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా, జిల్లా కలెక్టర్ ఆదేశాలు లేకుండానే లారీల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ మూడేళ్లలో మొత్తం ఎంత సొమ్ము వసూలు చేశారు? ఆ డబ్బు ఎవరికి చేరింది? అనే ప్రశ్నలను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ లేవనెత్తారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లిలోని ఎన్టీపీసీ బూడిద చెరువు నుంచి అనుమతులు పొందిన కాంట్రాక్టర్లు లారీల ద్వారా బూడిదను రవాణా చేస్తున్నారు. అయితే ఈ రవాణా మార్గంలో కంటైనర్ ఏర్పాటు చేసి, స్థానిక రెవెన్యూ సిబ్బంది పేరుతో ఒక్కో లారీ ట్రిప్పుకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ప్రశ్నలు తలెత్తిన నేపథ్యంలో ప్రస్తుతం వసూళ్ల కంటైనర్‌ను తాత్కాలికంగా తొలగించినట్లు చర్చ జరుగుతోంది. ఒక్కో లారీకి రూ.500 చొప్పున వసూలు చేస్తూ మూడేళ్లపాటు ఈ వ్యవహారం కొనసాగితే ఇప్పటివరకు ఎంత మొత్తం చేతులు మారి ఉంటుందనే అంశంపై చందర్ ప్రశ్నలు సంధించారు. రోజుకు ఎన్ని లారీలు రాకపోకలు సాగించాయి? మొత్తం ఎన్ని ట్రిప్పులు జరిగాయి? మూడు సంవత్సరాల్లో ఎంత డబ్బు వసూలైంది? ఈ సొమ్ము ఎవరి ఖాతాల్లోకి వెళ్లింది? అనే వివరాలను అధికార యంత్రాంగం బయటపెట్టాలని చందర్ కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు లేకుండా, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కాకుండా లారీ రవాణాపై డబ్బులు వసూలు చేసే అధికారం ఎవరిచ్చారు? ప్రభుత్వ అనుమతి లేకుండా మూడేళ్లుగా ఈ వసూళ్లు జరిగితే సంబంధిత అధికారులు ఇంతకాలం ఏం చేస్తున్నట్లు? ఈ వ్యవహారానికి బాధ్యులైన వారిని గుర్తించి ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.కలెక్టర్, ఎమ్మెల్యే సమాధానం చెప్పాలిఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్ స్పందించాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. ఈ వసూళ్లకు బాధ్యులెవరు? మూడేళ్లలో ఎంత వసూలు చేశారు? ఆ సొమ్ము ఎవరికి చేరింది? అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సీబీఐ, డీఓపీటీ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ కోరుతానని చందర్ స్పష్టం చేశారు. కంటైనర్ తొలగింపుతో ఈ వ్యవహారాన్ని మరుగున పడనీయకుండా, మూడేళ్ల వసూళ్ల పూర్తి లెక్కలు ప్రజల ముందుంచి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చందర్ డిమాండ్ చేస్తున్నారు.

పెద్దపల్లి ప్రజలు శివానుగ్రహంతో సంతోషంగా ఉండాలి



పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దాసరి మమతారెడ్డి

పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 11(సింగిడి):
పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు ఆ పరమ శివుని అనుగ్రహంతో సంతోషంగా సుఖశాంతులతో ఉండాలని పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ దాసరి మమతారెడ్డి ఆకాంక్షించారు. కార్తీక మాస శుభ సందర్భంగా ఎలిగేడు మండలం ర్యాకల్దేవ్ పల్లిలో కొలువై ఉన్న శ్రీ నాగ లింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజక వర్గ ప్రజలు భక్తి భావంతో ఉండి ఆ శివుని అనుగ్రహంతో అందరూ పాడిపంటలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. రానున్న ప్రభుత్వం బీఆర్ఎస్ అని ఎమ్మెల్యేగా దాసరి మనోహర్ రెడ్డి గెలుపు ఖాయమని టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆలయాలను మరింత అభివృద్ధి చేసుకుందామని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలిగేడు మాజీ ఎంపీపీ తానిపర్తి ప్రవంతి, జిల్లా నాయకులు తానిపర్తి మోహన్ రావు, మండల అధ్యక్షుడు బైరెడ్డి రామ్ రెడ్డి, సుల్తాన్ పూర్ సర్పంచ్ కవంపల్లి బాపయ్య ఉప సర్పంచ్ రమేష్ రావు, వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కోమల్ రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం.. ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి

మేయర్ మధుకర్



మంచిర్యాల, నవంబరు 11 (సింగిడి):
రైతు కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాలి.. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించాలి.. దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు చేరాలి.. ఇదే లక్ష్యంతో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్నా మధుకర్ పేర్కొన్నారు. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ సీతారాంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.రైతులు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పంటలు సాగు చేస్తున్నారని, పంట చేతికొచ్చే సమయంలో గిట్టుబాటు ధర లభించకపోతే తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంటుందని మేయర్ పేర్కొన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.రానున్న వేసవిలో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని, వర్షపాతం, నీటి లభ్యతపై ప్రభావం పడే పరిస్థితులను ముందుగానే అంచనా వేసుకోవాల్సిన అవసరం ఉందని మేయర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు సూచనల మేరకు కార్పొరేషన్ పరిధిలోని విలీన గ్రామాల రైతులు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించాలని కోరారు.నీటి లభ్యత తగ్గే పరిస్థితులు ఎదురైతే వరి సాగు రైతులకు భారంగా మారే అవకాశం ఉందని, అందువల్ల తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకొని నేల స్వభావం, నీటి వసతి, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా లాభదాయకమైన పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ముందస్తు ప్రణాళికతో సాగు చేపడితే పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు పంట నష్టాల ముప్పును కూడా కొంతవరకు నివారించవచ్చని పేర్కొన్నారు.ఒకవైపు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడం.. మరోవైపు భవిష్యత్తులో నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని పంటల మార్పిడిపై అవగాహన కల్పించడం.. ఈ రెండు అంశాలు వ్యవసాయ రంగంలో కీలకంగా మారుతున్నాయి. కొనుగోలు కేంద్రాల నిర్వహణ తోపాటు రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సురిమిల్ల సౌమ్య, కార్పొరేటర్ రాచకొండ గోపాల్ రావు, పీడీ మెప్మా సుభాష్, టీఎంసీ, ఐకేపీ కేంద్రం ఇన్‌ఛార్జి వర్ష, వ్యవసాయ శాఖ ఏఈ మహేందర్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లింగయ్య, దర్ని మల్లేష్, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కొయ్యాల కొమురయ్య, తీగలహార్ మాజీ సర్పంచి తెలేటి కిష్టయ్య, కాంగ్రెస్ పార్టీ సీతారాంపల్లి ఇన్‌ఛార్జి కొక్కిరాల మోహన్ రావు, మాజీ వార్డు సభ్యుడు గౌస్, స్థానిక రైతులు, మహిళలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భూ రీసర్వేలో పారదర్శకతకు పెద్దపీట వేయాలి

ప్రజలకు మేలు జరిగేలా సర్వే పూర్తి చేయాలి
నవంబర్ నెలాఖరులోగా తొలి విడత రీసర్వే లక్ష్యం పూర్తి చేయాలి
అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులు
: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి, నవంబర్ 11 : (సింగిడి)
రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను ప్రజలకు మేలు జరిగేలా, పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రీసర్వేలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, తొందరపాటుతో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నవంబర్ నెలాఖరులోగా ప్రతి జిల్లాలో తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.బుధవారం హైదరాబాద్ నుంచి రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భూముల రీసర్వే పురోగతిపై సమీక్షించారు. కామారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి జిల్లా అదనపు కలెక్టర్ వికర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియలో క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించే నివేదికలు రూపొందించాలని, ఉన్నతాధికారులను సంతృప్తిపరిచే నివేదికలకే పరిమితం కాకూడదని సూచించారు. రీసర్వేకు రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ)ను పక్కాగా అమలు చేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి అవసరమైన మార్పులు చేపట్టాలని ఆదేశించారు.మండలాల వారీగా ప్రత్యేక సర్వే బృందాలురీసర్వే పనులను వేగవంతం చేసేందుకు ప్రతి మండలంలో ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. అందుబాటులో ఉన్న లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, అవసరమైతే బృందాల సంఖ్యను పెంచాలని తెలిపారు. రాబోయే ఏడాదిన్నర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని వెల్లడించారు.రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలిరీసర్వే చేపట్టే గ్రామాల రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, నోటీసులు జారీ చేసి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సర్వే నివేదికలపై అభ్యంతరాలు ఎక్కడ, ఎలా సమర్పించాలి, వాటిని ఏ విధంగా పరిష్కరిస్తారనే విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో దండోరా వేయించి వివరాలను ప్రజలకు తెలియజేయడంతో పాటు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించాలని సూచించారు.రీసర్వే పూర్తయిన ప్రాంతాల్లో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను క్యూఆర్ కోడ్‌తో అందించనున్న నేపథ్యంలో భూముల వివరాలు, రికార్డులు కచ్చితంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.అసైన్డ్ భూములపై సమగ్ర పరిశీలనఅసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలు అసలైనవా, నకిలీవా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. పట్టా పొందిన వ్యక్తులే ప్రస్తుతం భూమిని అనుభవిస్తున్నారా? వేరే వ్యక్తులు ఆధీనంలో ఉంటే వారు నిబంధనల ప్రకారం అర్హులా? అనే విషయాలను నిర్ధారించాలన్నారు. పట్టాలో ఉన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణానికి మధ్య తేడాలు ఉంటే వాటిని గుర్తించి సరిచేయాలని సూచించారు.సాగునీటి చెరువులు, రహదారులు, కుంటలు, ఇతర అభివృద్ధి పనుల కోసం గతంలో సేకరించిన భూములకు సంబంధించిన సర్వే నంబర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు.అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ కేసులుభూముల రీసర్వేలో ఏ అధికారి అయినా అక్రమాలకు, అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. బాధ్యులపై సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతతో కూడిన రీసర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు రవీందర్, ప్రభాకర్, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్‌పై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

కరీంనగర్, నవంబర్11(సింగిడి)
ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం నల్లొండ గ్రామంలో మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్ఐఆర్‌పై అనవసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. ప్రజలు, యువత భాగస్వామ్యంతో కరీంనగర్‌లో నిర్వహించనున్న మహా పాదయాత్ర ద్వారా సమాధానం చెబుతామని అన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా విశ్వాసం కోల్పోయి రాజకీయ ఉనికి కోసం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సమావేశంలో పార్టీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగానికి ఆజాద్ సేవలు చిరస్మరణీయం

కరీంనగర్, నవంబర్11(సింగిడి)
భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అల్పోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ అన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా షే సాహెబ్ కాలనీలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు.1947 నుంచి 1958 వరకు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆజాద్, ఉన్నత, సాంకేతిక విద్యాభివృద్ధికి కృషి చేశారని, ఐఐటీ ఖరగ్‌పూర్, విశ్వవిద్యాలయాల నిధుల సంఘం వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటుకు పునాదులు వేశారని కొనియాడారు. ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీల్లో విజేతలకు రాతపుస్తకాలు, కలాలు అందజేశారు. విద్యార్థుల సేవకు కృషి చేస్తున్న డా.నరేందర్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఆసియా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దిపేటలో వాకథాన్

సిద్దిపేట, నవంబర్ 11:



జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పుర స్కరించుకుని తెల ంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆ దేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ , సిద్దిపేట చైర్మన్ జి. సుదర్శన్ మార్గదర్శకత్వంలో, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. సౌజన్య వాకథాన్, న్యాయ అవగాహన , రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల వరకు వాకథాన్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాల్గొని మాట్లాడుతూ ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 25 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడే మహత్తరమైన సేవ అని పేర్కొంటూ, సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి రక్తదానం చేసిన దాతలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి వై. జయప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎన్. సంతోష్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి. సాధన, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. తరణి, బార్ అసోసియేషన్ సిద్దిపేట అధ్యక్షుడు కె. రమేష్ బాబు, సీనియర్ న్యాయవాదులు , జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యమే విద్యకు నిజమైన పునాది

ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు
వేములవాడలో ఆర్ వి కె రెండో వార్షికోత్సవం. రంగవల్లి 27 ఏళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకుంటూ సంస్మరణ సభ



రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి)
జిల్లాలో విద్య అనేది కేవలం వ్యక్తిగత వికాసానికి మాత్రమే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ, సమాజ అభివృద్ధి, మార్పులో కీలక పాత్ర పోషించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు పేర్కొన్నారు.విద్య ప్రజాస్వామికీకరణ ద్వారానే సమానత్వం, సామాజిక న్యాయం సాధ్యమవుతాయని అన్నారు. కామ్రేడ్ రంగవల్లి విజ్ఞాన కేంద్రం రెండో వార్షికోత్సవం సందర్భంగా రంగవల్లక్క 27 ఏళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకుంటూ నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమానికి రంగవల్లి విజ్ఞాన కేంద్రం అధ్యక్షురాలు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షు విమలక్క అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ విద్య అంటే కేవలం పుస్తకాల్లోని పాఠాలను చదువుకోవడం, పట్టాలు పొందడం మాత్రమే కాదని, సమాజంలోని అసమానతలను ప్రశ్నించే చైతన్యాన్ని, ప్రజల పట్ల బాధ్యతను కలిగించేదిగా ఉండాలని స్పష్టం చేశారు. నాటి సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ వంటి తత్వవేత్తలు సైతం విద్యను ప్రశ్నించే తత్వానికి, సామాజిక మార్పునకు అనుసంధానం చేశారని గుర్తుచేశారు. ఈ ముగ్గురిని ఎస్ పి ఏ గా పేర్కొంటూ వారి ఆలోచనల్లో విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు.ఒక దేశాన్ని నాశనం చేయాలంటే ముందుగా ఆ దేశ విద్యావ్యవస్థను నాశనం చేయాలనే నినాదం దక్షిణాఫ్రికాలోని ఒక ప్రాంతంలో కనిపిస్తుందని ఉదహరించారు. విద్యా వ్యవస్థను తమ ప్రయోజనాలకు అనుగుణంగా కొనసాగించేందుకు పెట్టుబడిదారీ వ్యవస్థలు ప్రయత్నిస్తాయని విమర్శించారు. విద్య ప్రజల ఆలోచనా విధానాన్ని మార్చే శక్తివంతమైన సాధనమని, అందుకే విద్యపై ఆధిపత్యం కోసం పాలక వర్గాలు ప్రయత్నిస్తుంటాయని అన్నారు. కార్ల్ మార్క్స్ సైతం తన రచనల్లో విద్య, సమాజ మార్పు అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి విద్యపై సామాజిక అంక్షలు కొనసాగాయని, వేదాలు, ఉపనిషత్తులు చదివే హక్కును కొందరికే పరిమితం చేసి మను ధర్మం పేరుతో సమాజాన్ని కులాలుగా, వృత్తులుగా విభజించారని విమర్శించారు. విద్య అందరికీ సమానంగా అందాల్సిన హక్కు అయినప్పటికీ చారిత్రకంగా అణగారిన వర్గాలకు ఆ అవకాశాలను దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.నేటి విద్యావిధానంలోనూ సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధమైన ఆలోచనా శక్తిని పెంపొందించే దిశగా లేదని విమర్శించారు. మతం, మూఢవిశ్వాసాల ఆధారంగా సమాజాన్ని విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యను ప్రజాస్వామికీకరించి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల ఉద్యమాలు కొంతకాలంగా నిర్లిప్తతకు గురైన పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా ఉవ్వెత్తున ఎగిసిపడిన జెన్ జీ ఉద్యమాలు కొత్త ఆశను, ఆక్సిజన్‌ను అందించాయని అన్నారు. నేటి యువత విద్య, వైద్యం వంటి మౌలిక హక్కులతో పాటు భారత రాజ్యాంగాన్ని నిబద్ధతతో అమలు చేయాలని కోరుతోందని తెలిపారు. యువతలో పెరుగుతున్న ప్రశ్నించే తత్వం ప్రజాస్వామ్యానికి బలమని పేర్కొన్నారు.అమరుల ఆశయాల సాధనకు ఐక్య ఉద్యమాలు నిర్మించాలి: విమలక్క రంగవల్లక్కతో తనకు ఎంతోకాలంగా ఉద్యమ అనుబంధం ఉందని రంగవల్లి విజ్ఞాన కేంద్రం అధ్యక్షురాలు అరుణోదయ సాంస్కృతిక సమైక్య గౌరవ అధ్యక్షురాలు విమలక్క అన్నారు.రంగవల్లక్కను స్మరించుకోవడం అంటే కేవలం ఆమె జ్ఞాపకాలను గుర్తుచేసుకోవడం మాత్రమే కాదని, ఆమె సాగించిన పోరాటాలను,సమాజంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిపై సమష్టిగా పోరాడాల్సిన బాధ్యతను స్వీకరించడమని పేర్కొన్నారు.నేడు దేశంలో ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగించే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ ఐ ఆర్ పేరుతో కోట్లాది మంది ప్రజల ఓట్లు గల్లంతయ్యాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలతో ప్రజలను నిత్యం ఏదో ఒక రూపంలో ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారిపై వివిధ ముద్రలు వేసి అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రజాస్వామిక శక్తులు, ప్రగతిశీల ఉద్యమకారులు అందరూ ఒకే వేదికపైకి రావాలని పిలుపునిచ్చారు. ఐక్య ఉద్యమాల ద్వారానే సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోగలమని స్పష్టం చేశారు. ఆర్వీకే సభ్యురాలు రాజేశ్వరి, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి, పీడీఎస్‌యూ విజృంభణ నాయకులు విజయ్, ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక రాష్ట్ర కన్వీనర్ వి. సంతోష్, శ్రామిక శక్తి బీడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మీ, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడీ సుదర్శన్, పూర్వ పీడీఎస్‌యూ నాయకులు స్వామిదాస్, అమరుల కుటుంబ సభ్యుడు శ్రీనివాస్, పూర్వ అరుణోదయ నాయకులు వాణి వొల్లాల, గొట్టె రుక్మిణి, మల్లారెడ్డి, అరుణోదయ రాకేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు టఫ్ పూర్వ అధ్యక్ష కార్యదర్శి బొల్లం లింగమూర్తి, బిజిగిరి నవీన్ కుమార్, జేఏసీ నాయకులు జిఎస్ ఆనంద్ గొడిశాల రమేష్ గౌడ్, అరుణోదయ పోతుల రమేష్, రాకేష్,తదితర ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాలికి తీవ్రమైన గాయం

రాజన్న సిరిసిల్ల, ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి)
జిల్లాలోరుద్రంగి మండల కేంద్రంలో నిర్వహించిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొనక పోవడం గల కారణాలను రాష్ట్ర గిరిజన, ఎస్సీ సంక

అవసరమైతేనే వాడండి

ప్రస్తుతం ఆరోగ్యం పట్ల అవగాహన పెరగడంతో చాలామంది విటమిన్ మాత్రలు, మల్టీ విటమిన్లు, కాల్షియం, ఐరన్, విటమిన్ డి వంటి ఆరోగ్య సప్లిమెంట్లను ఉపయోగిస్తున్నారు.

శరీరానికి అవసరమైన పోషకాలు అందేలా చూసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయని భావిస్తారు. అయితే ప్రతి ఒక్కరికీ సప్లిమెంట్లు అవసరం ఉండదు. శరీరంలో ఉన్న పోషకాల స్థాయి, ఆహారపు అలవాట్లు, వయసు, ఆరోగ్య పరిస్థితి వంటి అంశాలను బట్టి వాటి అవసరం మారుతుంది. అందుకే సొంతంగా మాత్రలు ప్రారంభించే ముందు కొన్ని విషయాలను తప్పక తెలుసుకోవాలి.

ఏదైనా పోషక లోపం ఉన్నప్పుడు దాన్ని సరిచేయడానికి సప్లిమెంట్లు అవసరం కావచ్చు. ఉదాహరణకు, విటమిన్ డి లోపం ఉంటే వైద్యుడి సూచన మేరకు విటమిన్ డి సప్లిమెంట్ తీసుకోవచ్చు. అలాగే ఐరన్ లోపం ఉన్నప్పుడు ఐరన్ మాత్రలు అవసరం కావచ్చు. కానీ ఎలాంటి లోపం లేకుండా కేవలం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో అన్ని రకాల విటమిన్లు తీసుకోవడం సరైన పద్ధతి కాదు.

రోజువారీ ఆహారం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు అందుతున్నాయో ముందుగా పరిశీలించాలి. అలసట, నీరసం లేదా బలహీనత కనిపించిన వెంటనే మల్టీవిటమిన్ మాత్రలు తీసుకోవడం మంచిది కాదు. నిద్రలేమి, రక్తహీనత, థైరాయిడ్ సమస్యలు తదితర అనేక కారణాల వల్ల కూడా ఇలాంటి లక్షణాలు రావచ్చు. అవసరమైతే వైద్యుడి సలహాతో పరీక్షలు చేయించుకుని అసలు కారణాన్ని గుర్తించాలి.

Disclaimer: ఆరోగ్య సప్లిమెంట్ల అవసరం వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి మారుతుంది. వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో విటమిన్ మాత్రలు తీసుకోకండి).



ఆరోగ్యానికి ఉసిరి

ఉసిరికాయలో ఉండే ఔషధ గుణాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆయుర్వేదంలో దీనిని అత్యంత ప్రయోజనకరమైన దివ్యౌషధంగా, అమృతంతో సమానంగా పరిగణిస్తారు. విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, అనేక పోషకాలు నిండి ఉన్న ఉసిరిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరం దృఢంగా మారుతుంది. అయితే, చాలామందిలో ఒక సాధారణ సందేహం ఉంటుంది.. అదేంటంటే, ఉసిరికాయ తినడానికి సరైన సమయం ఎప్పుడు? దీనిని ఖాళీ కడుపుతో తినవచ్చా లేదా? అనే విష యాలపై ఆయుర్వేద నిపుణుల సలహాలు ఇక్కడ తెలుసుకుందాం.

ఉదయం పూట ఖాళీ కడుపుతో తినడం వల్ల లాభాలు:

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఉదయం పూట ఖాళీ కడుపుతో తాజా ఉసిరికాయను లేదా దాని రసాన్ని తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఉసిరిలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపి, శరీరాన్ని పూర్తిగా డిటాక్స్ చేయడంలో సహాయపడతాయి. ఇది జీర్ణవ్యవస్థను చురుగ్గా మార్చి, జీర్ణక్రియ సజావుగా సాగేలా చేస్తుంది. మెటబాలిజం మెరుగుపడుతుంది. రోగ నిరోధక శక్తిని పెంపొందించి, సీజనల్ వ్యాధులు, జలుబు, దగ్గు వంటి సమస్యల నుంచి రక్షణ కల్పిస్తుంది. క్రమం తప్పకుండా ఉసిరి తీసుకోవడం వల్ల చర్మానికి మంచి నిగారింపు వస్తుంది. జుట్టు కుదుళ్లు బలపడి ఒత్తుగా పెరుగుతాయి.

ఉసిరిని ఎలా తీసుకోవాలి?

తాజా ఉసిరికాయను పచ్చిగా తినడం లేదా రసం రూపంలో తీసుకోవడం అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాకుండా, దీనిని మురబ్బా, చూర్ణం, లేదా క్యాండీ రూపంలో కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. మోతాదులో తీసుకుంటూ ఉంటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

అందరికీ ఖాళీ కడుపుతో మంచిదేనా?

అయితే, ఖాళీ కడుపుతో ఉసిరి తినడం అందరికీ పడకపోవచ్చు. ఎవరికైతే అసిడిటీ, గ్యాస్ సమస్యలు, కడుపులో మంట లేదా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉందో వారు ఉదయాన్నే ఖాళీ కడుపుతో తినడం మానుకోవాలి. ఇది వారిలో కడుపు అసౌకర్యాన్ని మరింత పెంచవచ్చు. అలాంటి వారు అల్పాహారం లేదా భోజనం చేసిన తర్వాత ఉసిరిని తీసుకోవడం సురక్షితం.



అతివ Athiva Singidi

12-11-2026
గురువారం

హెల్తీ బ్రేక్ ఫాస్ట్



నేటి బిజీ లైఫ్‌స్టైల్‌లో చాలామంది బరువు తగ్గడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి డైట్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. ముఖ్యంగా ఉదయం పూట తీసుకునే బ్రేక్‌ఫాస్ట్ పౌష్టికాహారంతో కూడుకుని ఉండటం చాలా అవసరం.

తక్కువ సమయంలో, ఎక్కువ పోషకాలను అందించే అల్పాహారాలలో మొలకెత్తిన గింజలు ముందు వరుసలో ఉంటాయి. కేవలం 15 నిమిషాల్లో ఎంతో రుచికరంగా, ఆరోగ్యకరంగా స్టీమ్డ్ స్ప్రౌట్స్‌ను ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

స్ప్రౌట్స్ తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు

ప్రొటీన్లు, ఫైబర్: మొలకెత్తిన పెసలు లేదా శెనగల్లో ప్రొటీన్లు, డైటరీ ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి కండరాల బలానికి, జీర్ణక్రియ మెరుగుపడటానికి ఎంతగానో సహాయపడతాయి.

బరువు నియంత్రణ: ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఉదయం పూట దీన్ని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల ఎక్కువ సేపు ఆకలి వేయదు, ఇది బరువు తగ్గడానికి అద్భుతంగా సహకరిస్తుంది.

శక్తిని ఇస్తుంది: శరీరానికి రోజంతా కావాల్సిన శక్తిని అందించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి.

తయారీ విధానం

ముందుగా మొలకెత్తిన గింజలను శుభ్రం చేసి, ఇడ్లీ పాత్రలో లేదా స్టీమర్‌లో పెట్టి 5 నుండి 7 నిమిషాల పాటు ఆవిరిపై ఉడికించాలి. ఇలా చేయడం వల్ల వాటిలోని పోషకాలు పోకుండా సులభంగా అరుగుతాయి. ఇప్పుడు బాణలిలో కొద్దిగా నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి తాలింపు పెట్టుకోవాలి.

అందులో తరిగిన ఉల్లిపాయ ముక్కలు, టమాటాలు వేసి కొద్దిగా మగ్గనివ్వాలి. ఆ తర్వాత ఆవిరిపై ఉడికించిన స్ప్రౌట్స్, రుచికి సరిపడా ఉప్పు, చిటికెడు కారం వేసి బాగా కలపాలి. చివరగా స్టవ్ ఆఫ్ చేసి పైన నిమ్మరసం పిండి, సన్నగా తరిగిన కొత్తిమీరతో అలంకరిస్తే రుచికరమైన స్టీమ్డ్ స్ప్రౌట్స్ సిద్ధం.

ఉదయం పూట సమయం తక్కువగా ఉన్నప్పుడు హడావుడిగా జంక్ ఫుడ్ తినడానికి బదులు, కేవలం 15 నిమిషాల్లో ఈ హెల్దీ స్ప్రౌట్స్ తయారు చేసుకుని తినడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. ఇది బరువు తగ్గాలనుకునేవారికి ఒక చక్కటి, సులువైన అల్పాహార ఎంపిక.

తయారీకి కావలసిన పదార్థాలు

- మొలకెత్తిన గింజలు పెసలు లేదా శెనగలు: 1 కప్పు
- సన్నగా తరిగిన ఉల్లిపాయ: 1
- టమాటా ముక్కలు: అర కప్పు
- పచ్చిమిర్చి తరుగు: 1 లేదా 2
- నిమ్మరసం: 1 స్పూన్
- తాలింపు గింజలు, కరివేపాకు, కొద్దిగా నూనె, రుచికి సరిపడా ఉప్పు, చిటికెడు కారం.





వేపాకుతో గజ్జీ, దురదకు చెక్

మీఇంట్లోనే సులభంగా మీరు వేపాకు పేస్ట్ ను చాలా ఈజీగా చేసుకోవచ్చు. ఇంకా ఈ వేపాకులలో ఉండే యాంటీ-బ్యాక్టీరియల్, యాంటీ-ఫంగల్ గుణాలు, చర్మ సమస్యలను మొటిమలను తగ్గించడంలో ఇవి మంచిగా పనిచేస్తాయి.

కావలసిన పదార్థాలు: ఫ్రెష్ వేపాకులు: ఒక చిన్న కప్పు, నీరు: దీనికి సరిపడా , పసుపు: చిటికెడు (మంచి యాంటీ సెప్టిక్‌గా పనిచేస్తుంది). వీటిని తీసుకుని మీరు పేస్ట్ లాగా చేసుకోవాలి. మరి, అస్సలు లేట్ చేయకుండా దీనిని ఎలా చేయాలి? ఎలా అప్లై చేసుకోవాలి అన్నది ఇక్కడ చదివి తెలుసుకుందాం..

ఆకులను శుభ్రం చేయడం: మీరు మొదటగా ఫ్రెష్ వేపాకులను తీసుకొని, వాటికి ఉన్న దుమ్ము, ధూళి మొత్తం పోయే వరకు వీటిని మంచి నీటితో రెండు నుంచి 3 సార్లు బాగా శుభ్ర పరచుకోవాలి. ఇంకా బాగా కడిగిన వేపాకులను తీసుకుని కొంచం గోరువెచ్చని నీటిలో 5 నుండి 10 నిమిషాల పాటు వీటిని బాగా నానబెట్టాలి. ఇలా చేయడం వలన ఆకులు మొత్తం మెత్తబడతాయి.

పేస్ట్ చేయడం: ఇప్పుడు మీరు నాలుగు ఆకులను తీసుకుని ఆ తరవాత నీటి నుండి తీసి రోలులో కానీ మిక్సీ జార్‌లో వీటిని వేసుకోవాలి. అలాగే, అవసరమైతే నాలుగు చుక్కల నీరు కూడా వేయాలి అలాగే రోజ్ కొద్దీ కొద్దిగా వాటర్ పోస్తూ, దీనిని మెత్తటి ముద్దలా నూరుకోవాలి. ఇంకా ఈ పేస్ట్‌లో తీసుకోవాలనుకుంటే దీనిలో చిటికెడు పసుపు ఇంకా కొద్దిగా పెరుగు కలుపుకోవచ్చు.

ఎలా ఉపయోగించాలి? తయారుచేసుకున్న వేపాకు పేస్ట్‌ను చర్మం పై ఎర్ర దద్దర్లు ఉన్న చోట మాత్రమే అప్లై చేయాలి. ఇది పూసిన తర్వాత 15 నుండి 20 నిమిషాలు అలాగే ఉంచాలి. ఇది రాసిన తరవాత మొత్తం ఆరిపోయే వరకు దీనిని అలాగే ఉంచాలి. కొద్దీ సేపటి తర్వాత మీరు చల్లని నీటితో మాత్రమే దీనిని మంచిగా శుభ్రపరుచుకోవాలి.

దీపావళి తర్వాత కూడా దేశీయ స్టాక్ మార్కెట్లలో బుల్ జోరు కొనసాగుతూ ఎనిమిది రోజుల్లోనే బీఎస్ఈ కంపెనీల విలువ రూ. 38 లక్షల కోట్లు పెరిగింది. నవంబర్‌లో ఎఫ్ఐఐలు రూ. 53,170 కోట్ల పెట్టుబడులు పెట్టడం, కంపెనీల లాభాలు 24 శాతం వృద్ధి చెందడం, బడ్జెట్ 2027లో పన్ను సంస్కరణల ఆశలతో సెన్సెక్స్ 82,500, నిఫ్టీ 25,400 స్థాయిలను అధిగమించాయి.

స్టాక్ మార్కెట్ Stock Market

దీపావళి జోరు

8 రోజుల్లో రూ. 38 లక్షల కోట్ల లాభాలు!



దీపావళి పండుగ ముగిసినా దలాల్ స్ట్రీట్‌లో టపాసుల మోత ఏమాత్రం తగ్గలేదు. గత 8 ట్రేడింగ్ సెషన్లలోనే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల సంపద ఏకంగా రూ. 38 లక్షల కోట్లు పెరిగి మొత్తం రూ. 512 లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరింది. సెన్సెక్స్ ఏకంగా 8,000 పాయింట్లు దూసుకెళ్లి 82,500 మైలురాయిని దాటగా, నిఫ్టీ 10 శాతం ర్యాలీతో 25,400 పైన పాగా వేసింది. ఇన్నాళ్లూ అమ్మకాలతో భయపెట్టిన విదేశీ ఇన్వెస్టర్లు ఒక్కసారిగా రూట్ మార్చడం, కంపెనీల ఆదాయాలు అంచనాలను మించి నమోదు కావడమే ఈ కనీవినీ ఎరుగని బుల్ రన్‌కు ఆజ్యం పోశాయి.

రూ. 53,170 కోట్ల ఎఫ్ఐఐల వరద

ఈ నెలలోనే విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (FIIs) ఏకంగా రూ.53,170 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. గ్లోబల్ మార్కెట్లలో కృత్రిమ మేధ (AI) ఆధారిత స్టాక్స్ తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుండటంతో, విదేశీ ఫండ్స్ ఆసియాలోనే అత్యంత స్థిరమైన మార్కెట్‌గా ఉన్న భారత్ వైపు తమ నిధులను మళ్లించాయి. జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ డాక్టర్ వి.కె. విజయకుమార్ ఈ మార్పును విశ్లేషిస్తూ.. "ప్రధానంగా ఈ నెలలో ఎఫ్ఐఐలు జరిపిన రూ. 53,170 కోట్ల భారీ కొనుగోళ్లే మార్కెట్లను ఇంతలా పరుగులు పెట్టించాయి. గ్లోబల్ మార్కెట్లలో ఏఐ ట్రేడ్ బలహీనపడటం కూడా మనకు సానుకూలంగా మారింది" అని స్పష్టం చేశారు.

12 త్రైమాసికాల రికార్డు బద్దలు: కార్పొరేట్ లాభాల జోరు

కేవలం డబ్బు ప్రవాహం మాత్రమే కాకుండా, దేశీయ కంపెనీల బలమైన మూలాలు ఈ ర్యాలీకి నిజమైన రక్షణ కవచంలా నిలిచాయి. రెండో త్రైమాసికంలో నిఫ్టీ 50 సాధించిన 24 శాతం లాభాల వృద్ధి గత 12 క్వార్టర్లలోనే అత్యుత్తమమని నిపుణులు తేల్చారు. ఫలితంగా నిఫ్టీ ఫార్వర్డ్ పీఈ నిష్పత్తి ఆకర్షణీయమైన స్థాయికి దిగివచ్చింది. కార్నెలియన్ అసెట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థాపకుడు వికాస్ ఖేమానీ మార్కెట్ తీరుపై మాట్లాడుతూ.. "రుణాలు, వినియోగం, ప్రైవేట్ రంగ క్యాపెక్స్ అన్నీ కలిసి రాబోయే కొన్నేళ్ల పాటు బలమైన ఆదాయ చక్రాన్ని నడపబోతున్నాయి. ఈ దశలో కంపెనీల లాభాలే రాబడులను నడిపిస్తాయి, ఇది మార్కెట్లకు అత్యంత ఆరోగ్యకరమైన సంకేతం" అని పేర్కొన్నారు.

బడ్జెట్ 2027 పన్ను సంస్కరణల ఆశలు

దీర్ఘకాలిక విదేశీ ఇన్వెస్టర్లు తమ వాటాల విక్రయాలను తాత్కాలికంగా పక్కన పెట్టడానికి పన్ను సంస్కరణల వార్తలే ప్రధాన కారణమని తెలుస్తోంది. రాబోయే బడ్జెట్ 2027లో విదేశీ ఇన్వెస్టర్లపై ఉన్న 12.5% ఎల్‌టీసీజీ (LTCG) పన్నును రద్దు చేస్తారని, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (STT) నియమాలను సరళీకరిస్తారన్న ప్రచారం జోరందుకుంది. బీడీఓ ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ ట్యాక్స్ లీడర్ మనోజ్ పురోహిత్ స్పందిస్తూ.. "ప్రభుత్వం పన్ను నిబంధనలను పునఃపరిశీలిస్తుందన్న విశ్వాసం విదేశీ ఇన్వెస్టర్లలో పెరిగింది. ఈ సంస్కరణలు నిజమైతే భారత్‌కు గ్లోబల్ క్యాపిటల్ వరదలా వస్తుంది" అని తెలిపారు. మరోవైపు హెచ్ఎస్‌బీసీ సైతం భారత ఈక్విటీలకు 'ఓవర్‌వెయిట్' రేటింగ్ ఇచ్చి మద్దతు పలికింది.

అయితే, అమెరికా 10 ఏళ్ల బాండ్ ఈల్డ్స్ 5 శాతాన్ని తాకడం, దేశీయ సంస్థాగత మదుపరులు ఎగువ స్థాయిల్లో లాభాలు స్వీకరించడం వంటి అంశాలు మార్కెట్‌ను కాస్త ఒత్తిడికి గురిచేసే ప్రమాదం లేకపోలేదు. అయినప్పటికీ, ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 92 డాలర్ల వద్ద స్థిరపడటం మన ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరట. బ్యాంకింగ్, ఫైనాన్స్, క్యాపిటల్ గూడ్స్, ఫార్మా రంగాల్లోని లార్జ్ క్యాప్ షేర్లు ఈ ర్యాలీని మరింత ముందుకు నడిపించే అవకాశముంది.

అశోకా బిల్డ్‌కాన్ కు రూ. 865.90 కోట్ల భారీ ఆర్డర్

భారీ రోడ్డు కన్స్ట్రక్షన్ ఆర్డర్ సొంతం చేసుకోవడంతో అశోకా బిల్డ్ కాన్ లిమిటెడ్ షేర్లు నిన్న దూసుకుపోతున్నాయి. NHAI నుంచి మొత్తం రూ. 865.90 కోట్ల భారీ ఆర్డర్ ని సొంతం చేసుకోవడం జరిగింది. గత ఏడాది కాలంలో 42 శాతం నష్టాన్ని అందించిన ఈ కంపెనీ స్టాక్, గత ఐదేళ్లలో 5 శాతం లాభాన్ని తమ షేర్ హోల్డర్స్ కి అందించింది. ప్రస్తుతం రూ. 113.40 వద్ద ట్రేడ్ అవుతున్న ఈ షేరు భవిష్యత్తులో ఎలాంటి పనితీరుని కనపరుస్తుందో చూడాలి.

తగ్గిన ఈక్విటీ పెట్టుబడులు, స్మాల్‌క్యాప్స్

అక్టోబర్ నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి వచ్చే పెట్టుబడుల ప్రవాహం (ఇన్‌ఫ్లో) కాస్త నెమ్మదించింది. గత నెలతో పోలిస్తే 14% క్షీణించి రూ. 32,994 కోట్లకు పడిపోయింది. ముఖ్యంగా స్మాల్‌క్యాప్ ఫండ్ల పెట్టుబడుల్లో 29% తగ్గుదల కనిపించింది. అయితే, ఇదే సమయంలో సురక్షితమైన రాబడినిచ్చే డెట్ ఫండ్లలోకి పెట్టుబడులు భారీగా వెల్లువెత్తాయి. యాంఫీ (AMFI) విడుదల చేసిన తాజా గణాంకాల పూర్తి వివరాలు తెలుసుకుందాం. భారతీయ స్టాక్ మార్కెట్లో అక్టోబర్ నెలలో జరిగిన ఒడుదొడుకులు, కరెక్షన్ ప్రభావం మ్యూచువల్ ఫండ్ల పెట్టుబడులపై స్పష్టంగా కనిపించింది. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (AMFI) విడుదల చేసిన తాజా నెలవారీ డేటా ప్రకారం, అక్టోబర్‌లో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి నిధుల ప్రవాహం నెలవారీ ప్రాతిపదికన 14 శాతం మేర తగ్గి రూ.32,994 కోట్లకు పడిపోయింది. సెప్టెంబర్ నెలలో ఈక్విటీ ఫండ్లలోకి ఏకంగా రూ. 38,306 కోట్ల నిధులు రాగా, అక్టోబర్‌లో ఆ జోరు కాస్త తగ్గింది. ముఖ్యంగా హై-రిస్క్, హై-రిటర్న్ ఇచ్చే స్మాల్‌క్యాప్ ఫండ్లలోకి వచ్చే పెట్టుబడులు ఈ నెలలో గణనీయంగా 29 శాతం తగ్గుముఖం పట్టాయి. అయితే అక్టోబర్ నెలలో మొత్తం ఓపెన్-ఎండెడ్ మ్యూచువల్ ఫండ్స్ విభాగం మాత్రం సమష్టిగా ఏకంగా రూ.1.73 లక్షల కోట్ల నిధులను ఆకర్షించడం విశేషం.

లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్లకు భారీ గిరాకీఒకవైపు స్మాల్‌క్యాప్ ఫండ్ల పెట్టుబడులు తగ్గుముఖం పట్టగా, మరోవైపు లార్జ్, మిడ్‌క్యాప్ ఫండ్లలోకి మాత్రం ఆశ్చర్యకరంగా నిధుల ప్రవాహం వచ్చింది. నెలవారీగా చూస్తే, లార్జ్ అండ్ మిడ్ క్యాప్ విభాగంలోకి వచ్చే నిధుల ప్రవాహం సెప్టెంబర్‌లోని రూ. 4,271 కోట్ల నుండి ఏకంగా 99 శాతం పెరిగి రూ. 8,484 కోట్లకు చేరింది. దీని తర్వాత స్థానంలో లార్జ్ క్యాప్ విభాగంలో నిధుల ప్రవాహం 20 శాతం పెరిగింది. 17 రకాల సబ్ కేటగిరీలలో అత్యధిక నిధుల ప్రవాహాన్ని పొందిన జాబితాలో స్మాల్‌క్యాప్ ఫండ్‌లు రెండో స్థానంలో నిలిచినప్పటికీ, సెప్టెంబర్‌లోని రూ. 9,038 కోట్ల ఇన్‌ఫ్లోతో పోలిస్తే అక్టోబర్‌లో 29 శాతం క్షీణతతో రూ. 6,407 కోట్లకు పడిపోయాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌లు రూ. 4,979 కోట్లతో మూడవ స్థానంలో నిలవగా, మిడ్‌క్యాప్ రూ. 4,892 కోట్ల నిధులను అందుకున్నాయి.

భారీగా పుంజుకున్న డెట్ ఫండ్స్...

గత రెండు నెలలుగా (ఆగస్టు, సెప్టెంబర్) డెట్ ఫండ్ల నుంచి భారీగా పెట్టుబడులు బయటకు వెళ్లగా, అక్టోబర్ నెలలో మాత్రం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వరుసగా రెండు నెలల నిధుల విత్ డ్రా తర్వాత, అక్టోబర్‌లో డెట్ ఫండ్లలోకి ఏకంగా రూ. 1.13 లక్షల కోట్ల పెట్టుబడులు పోటెత్తాయి. సెప్టెంబర్ , ఆగస్టు నెలల్లో ఈ కేటగిరీ నుండి వరుసగా రూ. 1.83 లక్షల కోట్లు , రూ. 8,127 కోట్ల నిధులు విత్ డ్రా అయ్యాయి. డెట్ ఫండ్స్‌లోని 17 సబ్ కేటగిరీలలో అక్టోబర్‌లో కేవలం నాలుగు కేటగిరీలలో మాత్రమే నిధులు వచ్చాయి. ముఖ్యంగా లిక్విడ్ ఫండ్స్ అత్యధికంగా రూ. 70,533 కోట్ల నిధులను ఆకర్షించగా, ఓవర్‌నైట్ ఫండ్స్ లోకి రూ. 54,893 కోట్ల నిధులు వచ్చాయి.

స్టాక్ మార్కెట్ పరుగులు

772 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో భారీ ర్యాలీ.. సెన్సెక్స్ 772 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ 25,250 మార్కును దాటింది. విదేశీ పెట్టుబడుల ప్రవాహం, క్రూడ్ ఆయిల్ ధరల తగ్గుదల మార్కెట్లకు ఎలా ఊతమిచ్చాయంటే..

బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లు గత 8 నెలల గరిష్ఠ స్థాయిల వద్ద ప్రారంభమై, విదేశీ ఇన్వెస్టర్ల (FII/FPI) భారీ కొనుగోళ్లు, క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా తగ్గడంతో రికార్డు లాభాలతో ముగిశాయి. నవంబర్ నెలలో ఇప్పటివరకు చూస్తే క్రూడ్ ఆయిల్ పతనం, విదేశీ నిధుల ప్రవాహంతో సెన్సెక్స్, నిఫ్టీలు ఏకంగా 10% వరకు లాభపడటం విశేషం.

ఫార్మా రంగాన్ని మినహాయిస్తే నిఫ్టీలోని దాదాపు అన్ని రంగాలు లాభాల్లో ముగిశాయి. ఆటో, బ్యాంకింగ్ షేర్లకు ఊపురాగా, బ్రాడర్ మార్కెట్‌లో నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీ 1.73శాతం, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ 1.11శాతం మేర ర్యాలీ చేశాయి.

వడోదర-ముంబై ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్ట్ నిమిత్తం నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) నుంచి రూ. 866 కోట్ల కాంట్రాక్ట్ లభించడంతో అశోకా బిల్డ్‌కాన్ (Ashoka Buildcon) షేరు ఏకంగా 14శాతం ఎగబాకింది.

మార్కెట్ భారీ ర్యాలీకి 4 కీలక కారణాలు

1. విదేశీ ఇన్వెస్టర్ల (FII/FPI) ఊహించని కొనుగోళ్లు: నవంబర్ 2 నుంచి నవంబర్ 9 మధ్య (కేవలం 6 ట్రేడింగ్ సెషన్లలో) విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారతీయ ఈక్విటీలలో ఏకంగా రూ. 53,739 కోట్ల నికర పెట్టుబడులు పెట్టారు. (2026 సంవత్సరంలో ఇప్పటివరకు FPIలు మొత్తం రూ. 2.41 లక్షల కోట్లను వెనక్కి తీసుకున్నప్పటికీ, ఈ నవంబర్ ప్రవాహం మార్కెట్‌కు పెద్ద కొండంత మద్దతునిచ్చింది).

గ్లోబల్ AI స్టాక్స్ పతనం - భారత్‌కు కలిసివచ్చిన 'Non-AI' హోదా: అమెరికాలో డేటా సెంటర్ల వ్యయంపై కాంగ్రెస్ నిబంధనల ఆందోళనలతో యుఎస్, దక్షిణ కొరియా, తైవాన్, జపాన్ వంటి మార్కెట్లలో 'AI స్టాక్స్' భారీగా అమ్ముడయ్యాయి. ఈ క్రమంలో AI యేతర దేశంగా భావించే భారత్ విదేశీ ఇన్వెస్టర్లకు సురక్షితమైన, ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా మారింది.

2. **క్రూడ్ ఆయిల్ (ముడిచమురు) ధరల పతనం:**

అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 92.44 డాలర్లకు పడిపోయింది. ఇరాన్‌పై సైనిక చర్యలు ఉండబోవని అమెరికా అధికారులు స్పష్టం చేయడంతో సరఫరా అంతరాయ భయాలు తొలగి, మంగళవారం బ్రెంట్ క్రూడ్ గత రెండు నెలల కనిష్ఠ స్థాయి అయిన 89.16 డాలర్లను కూడా తాకింది. ఇది భారత్ వంటి చమురు దిగుమతి దేశానికి ఆర్థికంగా పెద్ద ఉపశమనం.

3. **సానుకూల గ్లోబల్ మార్కెట్ సంకేతాలు:**

ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా (Kospi), జపాన్ (Nikkei 225) సూచీలు లాభపడటం, అలాగే అమెరికా స్టాక్ ఫ్యూచర్స్ 1.3శాతం వరకు లాభాల్లో ట్రేడ్ కావడం భారత ఇన్వెస్టర్లలో సెంటిమెంట్‌ను మరింత బలపరిచింది.

గడ్డివాము దగ్ధం



సూర్యాపేట ప్రతినిధి (సింగిడి):
దీపావళి పండుగ సందర్భంగా పిల్లలు టపాసులు కాల్చడంతో వెలువడిన నిప్పురవ్వలు పడి సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రానికి చెందిన రైతులు భీమ్‌పంగు ఉపేందర్, భీమ్‌పంగు శంకర్‌ల గడ్డివాము దగ్ధమైంది. రెండు రోజుల క్రితం నిప్పురవ్వలు పడి కొంత గడ్డి కాలిపోవడంతో సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఇంజన్‌తో వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే గడ్డివాములోని మిగిలిన గడ్డిని పూర్తిగా తొలగించకపోవడంతో ఈరోజు ఎండ వేడికి లోపల ఉన్న నిప్పురవ్వలు మళ్లీ రగిలి మంటలు వ్యాపించాయి. దీంతో గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు రైతులకు చెందిన గడ్డి మేపులు దగ్ధమై సుమారు రూ.1.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

అసంపూర్ణ పనులపై మంత్రి ఆగ్రహం!

- రెడ్లకుంట, శాంతినగర్ పనులపై అసంతృప్తి
- డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశం

సూర్యాపేట జిల్లా ప్రతినిధి (సింగిడి) :
లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణ పనుల్లో జాప్యంపై రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కోదాడ మండలం రెడ్లకుంటతో పాటు అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో చేపడుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నత్తనడకన సాగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం రెడ్లకుంట వద్ద పాలేరు వాగుపై నిర్మిస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత కాలువల నిర్మాణం, భూగర్భ



మోటార్లు, విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను తనిఖీ చేసి వాటి పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యానికి గల కారణాలను పరిశీలించి మిగిలిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని రూ.47.64 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా కోదాడ మండలంలోని ఆరు గ్రామాలకు చెందిన 4,460 ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్లలో సాగునీరు అందించనున్నట్లు వివరించారు. ద్వారకుంట గ్రామంలో 66 ఎకరాలు, నల్లబండగూడెంలో 1,400 ఎకరాలు, కాపుగల్లులో 1,608 ఎకరాలు, కూచిపూడిలో 400 ఎకరాలు, రెడ్లకుంటలో 576 ఎకరాలు, చిమిరాలలో 410 ఎకరాలకు సాగునీరు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. 430 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు వీఐటీ మోటార్ల సహాయంతో నీటిని పంపింగ్ చేసి ఆయా గ్రామాల్లోని ఆయకట్టుకు అందించనున్నట్లు తెలిపారు.ఈ పథకం ద్వారా ఓసీ వర్గానికి చెందిన 290, బీసీ వర్గానికి చెందిన 720, ఎస్టీ వర్గానికి చెందిన 30, ఎస్సీ వర్గానికి చెందిన 446 కుటుంబాలు కలిపి మొత్తం 1,486 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని మంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు 70 శాతం మాత్రమే పూర్తయ్యాయని అధికారులు వెల్లడించడంతో మిగిలిన పనులపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు అందించే కీలకమైన ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. రెడ్లకుంటతో పాటు అనంతగిరి మండలం శాంతినగర్‌లో కొనసాగుతున్న లిఫ్ట్ ఇరిగేషన్ పనులను కూడా వేగవంతం చేయాలని స్పష్టం



చేశారు. డిసెంబర్ చివరి నాటికి పనులన్నీ పూర్తి చేయడంతో పాటు నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా లోపాలు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎస్పీ నరసింహ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, మార్కెట్ కమిటీ చైర్మన్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువకుల బీభత్సం

ఆర్మూర్ , నవంబర్ 11 (సింగిడి):
ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో గంజాయి బ్యాచ్ అరాచకాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. తాజాగా గంజాయి మత్తులో ఉన్న ముగ్గురు యువకులు స్పోర్ట్స్ బైక్‌తో వీరంగం సృష్టించి, బైక్‌పై వెళ్తున్న ఇద్దరు దస్తావేజు లేఖరులను వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడమే కాకుండా, వారిపై విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆర్మూర్ పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులుగా పనిచేస్తున్న బాబా, రవిలు బైక్‌పై జిరాయత్ నగర్ నుండి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైపు వెళ్తున్నారు. ఆ సమయంలో సుర్బిర్యాల్ గ్రామానికి చెందిన రోహన్, విష్ణు, వంశీ అనే ముగ్గురు యువకులు ట్రిపుల్ రైడింగ్ చేస్తూ, స్పోర్ట్స్ బైక్‌పై వెనుక నుండి అతివేగంగా వచ్చి వారిని ఢీకొట్టారు ఈ ప్రమాదంలో బాబా, రవి రోడ్డుపై ఎగిరిపడగా.. బాబా పాదానికి తీవ్ర గాయమై కాలు విరిగిపోయింది. రవి కుడికాలు మోకాలి కింద విరిగింది. అంతేకాకుండా వీరిద్దరి తల, భుజాలపై బలమైన గాయాలయ్యాయి. ప్రమాదం తరువాత మానవత్వం లేకుండా వ్యవహరించిన ఆ ముగ్గురు యువకులు, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించాల్సింది పోగా గంజాయి మత్తులో వారిపై విచక్షణారహితంగా దాడి చేసి చితకబాదారు. ఈ తీవ్ర దాడిలో దస్తావేజు లేఖరి రవి అక్కడికక్కడే స్పృహతప్పి పడిపోయాడు. అక్కడి నుండి నిందితులు పరారైన తర్వాత, బాబా తన ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాబా పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, రవిని మామిడిపల్లిలోని గంగ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సుర్బిర్యాల్ గ్రామానికి చెందిన రోహన్, విష్ణు, వంశీలు గతంలోనూ పలుమార్లు గంజాయి సేవించి పక్క గ్రామస్తులతో ఘర్షణలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఘటనపై బాబా మేనల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌ఓ కొండి చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం తెలిపారు. నిందితులు ముగ్గురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

ఉర్దూ జర్నలిజంలో ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు



నాగర్‌కర్నూల్ నవంబర్ 11 (సింగిడి):
జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ షేక్ ఫరీద్ అహ్మద్‌కు రాష్ట్రస్థాయిలో ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు లభించింది. మూడు దశాబ్దాలుగా ఉర్దూ పత్రికా రంగంలో విశేష సేవలందిస్తూ, వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేస్తున్న ఆయనకు తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఈ అవార్డును ప్రకటించింది.
బుధవారం హైదరాబాద్‌లోని వేట్స్ గార్డెన్‌లో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ చేతుల మీదుగా షేక్ ఫరీద్ అహ్మద్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, టీఆర్ఎస్ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఉర్దూ పత్రికా రంగాన్ని అభివృద్ధి చేస్తూ, ప్రతిభావంతులైన జర్నలిస్టులను గుర్తించి ప్రోత్సహిస్తున్న తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ నిర్వాహకులను వారు అభినందించారు. షేక్ ఫరీద్ అహ్మద్ గత మూడు దశాబ్దాలుగా రాష్ట్రీయ సహారా, అహం ఇతల్లా తదితర ఉర్దూ దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో తనదైన పాత్ర పోషిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర కమిటీ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డుకు ఎంపిక చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఉర్దూ జర్నలిస్టుకు రాష్ట్రస్థాయి పురస్కారం లభించడంతో జిల్లా జర్నలిస్టు వర్గాల్లో హర్షం వ్యక్తమైంది. ఈ సందర్భంగా అవార్డు అందించిన యూనియన్ రాష్ట్ర కమిటీకి ఫరీద్ అహ్మద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సాజిద్ మెహరాజ్, డాక్టర్ సుజావుద్దీన్, మున్సిఫ్ ఉర్దూ దినపత్రిక ఎడిటర్ అత్తర్ మొయినుద్దీన్, ఎంఐఎం యువజన విభాగం రాష్ట్ర నాయకుడు ముకర్రం అలీతో పాటు నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

అయ్యో దేవుడా...

- బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్
- భర్త కళ్లెదుటే భార్య మృత్యువాత

సూర్యాపేట ప్రతినిధి (సింగిడి):
రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మహిళను టిప్పర్ రూపంలో మృత్యువు కబళించింది. నేరేడుచర్ల పట్టణంలోని చౌరస్తా వద్ద జరిగిన ప్రమాదంలో ఖమ్మం జిల్లా పల్లిగూడెం గ్రామానికి చెందిన గుర్వమ్మ (40) అక్కడికక్కడే మృతిచెందింది. కళ్లెదుటే భార్య ప్రాణాలు కోల్పోవడంతో భర్త వెంకన్న కన్నీరుమున్నీరయ్యాడు.వెంకన్న, గుర్వమ్మ దంపతులు చిలక జ్యోతిష్యం చెబుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడ నుంచి హుజూర్‌నగర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో గుర్వమ్మ రోడ్డుపై పడిపోగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే



ప్రాణాలు విడిచింది. ప్రమాదం అనంతరం టిప్పర్ డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భర్త వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా యూనియన్ బ్యాంక్ వార్షికోత్సవం

గద్వాల ప్రతినిధి నవంబర్అ 11 (సింగిడి) :
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్యి నియోజక వర్గం అయిజ పట్టణంలో స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో బ్యాంక్ 108వ వార్షికోత్సవ వేడుకలను మేనేజర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బ్యాంకు సిబ్బందితో కలసి కేక్ కట్ చేసి ఒకరికొకరు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు శ్రీనాథ్ రెడ్డి డిప్యూటీ మేనేజర్, సురేందర్ అసిస్టెంట్ మేనేజర్, చంద్ర, ప్రవీణ్ కుమార్, చందన, రాజశేఖర్, నరసింహచారి సిబ్బంది మరియు ఖాతాదారులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిని వెంటనే బాగు చేయండి

సిఎంసి కమిషనర్ సృజన..



అమీన్ పూర్ నవంబర్ 11 (సింగిడి):
అమీన్ పూర్ జిహెచ్ఎంసి డివిజన్ పరిధిలోనీ ప్రధాన రహదారి ఎంతోకాలంగా ఎదురవుతున్న రావాన, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పాలన యంత్రాంగం వేగంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా స్థానిక ప్రధాన రహదారిని సిఎంసి కమిషనర్ జి. సృజన స్వయంగా బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాహనదారుల తిప్పలు, ట్రాఫిక్ నివారణ పై దృష్టి అమీన్పూర్ ప్రధాన రహదారి రోజు రోజుకు పెరుగుతున్న వాహన రద్దీకి సరి పోకపోవడం కొన్ని ప్రాంతాల్లో రోడ్లు దెబ్బ తినడం మరియు అక్రమనుల వల్ల తీవ్ర ట్రాఫిక్ జాములు ఏర్పడుతున్నాయని స్థానికుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. ఈ సమస్యలపై తక్షమే స్పందించిన సిఎంసి కమిషనర్ సుజన పాదాచార్యులు వాహనదారులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గుర్తించారు. రోడ్డు పనులను త్వరి తగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఎన్నారై అండ



సూర్యాపేట ప్రతినిధి (సింగిడి):
పేదరికంతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ప్రవాస భారతీయుడు పానుగంటి ఋషిరాజా 50 మంది నిరుపేద ఇంటర్ విద్యార్థులకు రూ.47 వేల పరీక్ష ఫీజులు చెల్లించడం అభినందనీయమని జిల్లా ఇంటర్ విద్యాధికారి బి.సులోచన రాణి అన్నారు. బుధవారం కోదాడ కేఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అభినందన సభకు ప్రిన్సిపల్ నారు రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సులోచన రాణి మాట్లాడుతూ ఆస్తులు సంపాదించడం కంటే ఆపదలో ఉన్నవారికి సాయం చేయడం గొప్ప సేవ అన్నారు. విద్యార్థుల కలలకు రెక్కలు తొడిగి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపల్ రమణారెడ్డి మాట్లాడుతూ ఋషిరాజా దాతృత్వం ఇతర ప్రవాస భారతీయులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమానికి కృషి చేసిన భౌతికశాస్త్ర అధ్యాపకుడు పానుగంటి రాజేష్‌ను అభినందించారు. కళాశాలలో వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్, నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు, పిచ్చిరెడ్డి, యాదగిరి, బలభీమారావు, రమేష్, వెంకన్న, గోపికృష్ణ, ముస్తఫా, జ్యోతిలక్ష్మి , మమత తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ స్కీంను పటిష్టంగా అమలు చేయాలి

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 11(సింగిడి) :
ప్రభుత్వం తో తరచుగా చర్చలు జరుగుతున్నప్పటికీ ఉన్నతాధికారుల అలసత్వంతో నూతన హెల్త్ స్కీమ్ పటిష్టంగా అమలు కాలేకపోతున్నదని, దీన్ని సమన్వయం చేసుకొని ఉద్యోగులకు కొత్త హెల్త్ విధానాన్ని సమర్థవంతంగా అమలుకు కృషి చేయాలని నిజామాబాద్ టీఎన్జీవో అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ అన్నారు.బుధవారం టిఎన్జీవో కేంద్ర కార్యాలయంలో ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు శ్రీమారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మేసని (ముజీబ్) అధ్యక్షతన ఏర్పాటుచేసిన టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి టీఎన్జీవో నిజామాబాద్ జిల్లా పక్షాన ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్,టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ హాజరై ఎజెండా అంశాలపై మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 2 డీఏలు విడుదల చేసేందుకు కృషిచేసిన టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే ఉద్యమ పటిమతో ఉద్యోగులకు రావాల్సిన పీఆర్ సీ, పెండింగ్ డీఏలు, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారని ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను పటిష్టంగా అమలు చేయటకు ఆశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా2004 తర్వాత నియామకమైన ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానాన్నితొలగించి, పాత పెన్షన్ విధానాన్ని అమలుపరచాలని డిమాండ్ చేశారు.టీఎన్జీవో కేంద్ర సంఘం తీసుకోబోతున్న ప్రతి నిర్ణయానికి నిజామాబాద్ జిల్లా పక్షాన సంపూర్ణ మద్దతును ఉంటుందని తెలియజేశారు. ఈ సమావేశంలో టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలు అందించాలి

జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 11(సింగిడి) :
ప్రజలకు రవాణా శాఖ సేవలను వేగవంతంగా,పారదర్శకంగా అందించడంతో పాటు పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం,ఆదాయ వసూళ్ల మెరుగుదల,రహదారి భద్రత ,సమర్థవంతమైన ఎన్‌ఫోర్స్ మెంట్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ రెండు జిల్లాల అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం నిజామాబాద్ ఉప రవాణా కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించి కార్యాలయంలోని వివిధ విభాగాల పనితీరును తనిఖీ చేశారు. అనంతరం నిజామాబాద్,కామారెడ్డి ఉమ్మడి జిల్లాల రవాణా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆయా కార్యాలయాల పనితీరు,ప్రజలకు అందిస్తున్న సేవలు, ఆదాయ వసూళ్లు,ఎన్‌ఫోర్స్ మెంట్ కార్యకలాపాలపై సమగ్రంగా సమీక్షించారు.
ఈ సందర్భంగా కౌంటర్ వారీగా, క్లర్క్ వారీగా నిర్వహిస్తున్న లావాదేవీలను పరిశీలించారు. లెర్నర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ రెన్యువల్ విభాగాల పనితీరును సమీక్షించి, ప్రజలకు సేవలందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. వాహన్, సారథి, సీఎఫ్ఎస్ టీ పోర్టళ్లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు.
స్మార్ట్ కార్డుల ప్రింటింగ్, డిస్పాచ్ ప్రక్రియను పరిశీలించి, ప్రజలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ వారీగా రెవెన్యూ వసూళ్లను సమీక్షించి, ప్రభుత్వ ఆదాయ లక్ష్యాల సాధనకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పన్నులు చెల్లించని వాహనాలపై ప్రత్యేక ఎన్‌ఫోర్స్ మెంట్ డ్రైవ్‌లు నిర్వహించాలని,అధిక లోడుతో నడిచే వాహనాలపై తనిఖీలు ముమ్మరం చేసి,నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా కార్యాలయ ప్రాంగణంలో అనధికార వ్యక్తులు, మధ్యవర్తుల ప్రవేశాన్ని పూర్తిగా నిరోధించాలని,కార్యాలయ కార్యకలాపాల్లో పారదర్శకత,క్రమశిక్షణ, జవాబుదారీతనాన్ని పాటించాలని స్పష్టం చేశారు.
అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, ఇతర అధికారులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. పచ్చదనం పెంపొందించడం,పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప రవాణా కమిషనర్ దుర్గ ప్రమీల, డీటీవో రమేష్ రాథోడ్, ఆర్టీవో సంతోష్ కుమార్, కామారెడ్డి ఆర్టీవో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రహ్లాద్, ఎంవిఐలు అశ్వంత్ కుమార్, రాహుల్, ప్రదీప్, ఏఎంవిఐ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



ఆసానికుంటను కాపాడాలని ఇరిగేషన్ ఎస్సీకి వినతి



బొల్లారం నవంబర్ 11 (సింగిడి):
బొల్లారం డివిజన్ పరిధిలోని ఆసానికుంట అక్రమార్కుల చేతుల్లో క్రమంగా కనుమరుగవుతుంది. ఒకప్పుడు ఎకరాల విస్తీర్ణంలో అలరారుతూ, భూగర్భ జలాలకు ప్రధాన ఆధారంగా ఉన్న, ఈ గుంటను రియల్ మాఫియా, పరిశ్రమల పేరుతో కబ్జాదారులు గుట్టుచప్పుడు కాకుండా మింగేస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా మట్టి నింపి ఎఫ్ టీ ఎల్ బఫర్ జోన్ పరిధులను అక్రమిస్తున్నారని స్థానికులు పర్యావరణ వేత్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా చెరువుల పరిరక్షణను, పర్యవేక్షించాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులు, తమ విధుల్లో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. వెంటనే ఆసానికుంటను సర్వే చేసి అక్రమణాలను తొలగించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

బియ్యం ధరల నియంత్రణకు ప్రత్యేక బృందాలు
కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్‌కర్నూల్ నవంబర్ 11 (సింగిడి):
జిల్లాలో బియ్యం ధరల నియంత్రణకు జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరల (ఎంఆర్‌పీ) కంటే ఒక్క రూపాయి అధికంగా విక్రయించినా నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ హెచ్చరించారు. వినియోగదారులకు నాణ్యమైన బియ్యం నిర్ణీత ధరలకే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా ధరల పర్యవేక్షణ కమిటీ (డీపీఎంసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో బియ్యం ధరలు, మార్కెట్‌లో నిల్వలు, నిత్యావసర వస్తువుల ధరలు, వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణపై సమీక్షించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వివిధ రకాల బియ్యానికి గరిష్ట చిల్లర ధరలను కమిటీ నిర్ణయించింది. బీపీటీ, కేఎన్‌ఎం రకం బియ్యం కిలో రూ.66, ఆర్‌ఎన్‌ఆర్, తెలంగాణ సోనా కిలో రూ.74, హెచ్‌ఎంటీ, జేఎస్‌ఆర్ రకం బియ్యం కిలో రూ.79గా ఖరారు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ ధరలనే రైస్ మిల్లర్లు, వ్యాపారులు గరిష్ట విక్రయ ధరలుగా పాటించాలని ఆదేశించారు.హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు, సూపర్ మార్కెట్లలో నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేయరాదని స్పష్టం చేశారు. బ్రాండ్ పేరుతో ఒకే రకం బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించేందుకు అనుమతి లేదన్నారు. ప్యాకెట్ బస్తాలపై నిర్దేశిత ధరలను తప్పనిసరిగా ముద్రించాలని, ధరల వివరాలు వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు.
ధరల నియంత్రణ నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు పౌర సరఫరాలు, లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లులు, ప్యాకింగ్ యూనిట్లు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎంఆర్‌పీని ఉల్లంఘించినా, ప్యాకెట్లపై ధరల వివరాల్లో అక్రమాలకు పాల్పడినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైస్ మిల్లర్లు కొనుగోలు, అమ్మకాల వివరాలతో పాటు సంబంధిత రిజిస్టర్లు, బిల్లులను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, ప్రతి నెలా కొనుగోలు రిటర్నులు సమర్పించాలని ఆదేశించారు. వ్యాపారులు జీఎస్టీ, తూనికలు, కొలతలకు సంబంధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు సరఫరా చేసే బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అక్రమ నిల్వలు, రవాణా, ఇతర ప్రాంతాలకు తరలింపును అడ్డుకోవాలన్నారు. జిల్లాలో స్థానిక అవసరాలకు సరిపడా బియ్యం, ధాన్యం నిల్వలు ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేందుకు ప్రయత్నించినా, వినియోగదారుల ప్రయోజనాలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదన్నారు. అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

త్రాగు నీటికి ఇబ్బందులు రావద్దు



ఖమ్మం, నవంబర్ - 11(సింగిడి):
ఎల్నినో ప్రభావం దృష్ట్యా జిల్లాలో రానున్న కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, తాగునీటి సరఫరా, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పంటల సాగు, తాగునీటి సరఫరా, ప్రత్యామ్నాయ ప్రణాళికలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పాలేరు రిజర్వాయర్ లో 3 నెలలకు, వైరా రిజర్వాయర్ లో 5 నెలలకు నీటి నిల్వలు ఉన్నాయన్నారు. నీటి లభ్యత తగ్గనున్న దృష్ట్యా, ఉన్న నీటిని తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వరి, మొక్కజొన్న వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలను వేయకుండా రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. పురందర్, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఆర్డబ్ల్యూఎస్ ఇఇ వాణిశ్రీ, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి



గద్వాల బ్యూరో నవంబర్ 11(సింగిడి)
మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయాలు,ఆదర్శాలను భావితరాలు స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు అన్నారు. బుధవారం భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకుంటున్న నేపథ్యంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గద్వాల ఐడిఓసి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా, స్వాతంత్ర్య సమర యోధుడిగా,గొప్ప విద్యావేత్తగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.విద్య ద్వారానే వ్యక్తి వికాసం, సమాజ పురోగతి, దేశాభివృద్ధి సాధ్యమవుతాయని బలంగా విశ్వసించిన మహనీయుడు ఆజాద్ అని కొనియాడారు.మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి అయిన నవంబర్ 11ను ఆయన విద్యా రంగానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా 11 ఏళ్ల పాటు పనిచేసిన మౌలానాకు మరణాంతరం 1992లో భారతరత్న పురస్కారం లభించిందన్నారు.మౌలానా అరబిక్,ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ తదితర అనేక భాషల్లో ప్రావీణ్యత పొందారన్నారు. హిందూ,ముస్లిం ఐక్యత ఆధారంగా ఆల్ బలగ్ అనే పత్రికను ప్రారంభించి భారత జాతీయ వాదిగా పేరుగాంచారన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సయ్యద్ అక్బర్ పాషా,జిల్లా అధికారులు,పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మైనారిటీ సంఘాల నేతలు,తదితరులు పాల్గొన్నారు.

వాహన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పలు సేవలు

నాగర్‌కర్నూల్ నవంబర్ 11 (సింగిడి):
వాహనదారులు ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి నుంచే పలు రవాణా శాఖ సేవలను పొందేలా ప్రభుత్వం డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని నాగర్‌కర్నూల్ జిల్లా రవాణా శాఖ అధికారి (DTO) ఇమ్రాన్ అహ్మద్ తెలిపారు. వాహన్ పోర్టల్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన అనేక సేవలకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.
డ్రైవింగ్ లైసెన్స్‌కు సంబంధించిన పలు సేవలను ఇంటి నుంచే పొందవచ్చని, ఈ-కేవైసీ విధానం ద్వారా దరఖాస్తు ప్రక్రియ మరింత సులభతరమైందని వివరించారు. వాహనాల అద్దెకు సంబంధించిన సేవలు, యాజమాన్య బదిలీ, వాహన రిజిస్ట్రేషన్‌లో చిరునామా మార్పు వంటి సేవలను కూడా ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. ఆధార్ ఓటీపీ, ఫేస్ రికగ్నిషన్ సదుపాయాల ద్వారా దరఖాస్తుదారులు తమ వివరాలను ధ్రువీకరించుకుని ఇంటి నుంచే సేవలు పొందవచ్చని తెలిపారు. అయితే కొన్ని ప్రత్యేక సేవలు, భౌతిక ధ్రువీకరణ అవసరమైన సందర్భాల్లో మాత్రమే ఆర్టీఏ కార్యాలయానికి రావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. డిజిటల్ సేవల వినియోగంతో వాహనదారులకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కావడంతో పాటు కార్యాలయాల వద్ద అనవసర నిరీక్షణ తగ్గుతుందని DTO పేర్కొన్నారు. జిల్లాలోని వాహనదారులందరూ వాహన్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని DTO ఇమ్రాన్ అహ్మద్ సూచించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

డీఎంహెచ్ఓ డాక్టర్ డి. రామారావు



ఖమ్మం, నవంబర్ 10(సింగిడి):
ఖమ్మం జిల్లాలో భ్రూణ లింగ నిర్ధారణ పరీక్షలను కచ్చితంగా అరికట్టాలని, ఇందుకోసం చట్ట నిబంధనలను జిల్లావ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేయాలని పి ని పి ఎన్ డి టి యాక్ట్ జిల్లా అడ్వైజరీ కమిటీ చైర్మన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు ఆదేశించారు.
బుధవారం స్థానిక కలెక్టరేట్ ప్రగతి మీటింగ్ హాల్‌లో ఆయన అధ్యక్షతన పి ని పి ఎన్ డి టి యాక్ట్ జిల్లా సలహా కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లు స్కానింగ్ సెంటర్లు తప్పనిసరిగా పి ని పి ఎన్ డి టి యాక్ట్ , నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు.
సమావేశంలోని ముఖ్య ముఖ్యాంశాలు:
పకడ్బందీ రికార్డులు: ప్రతీ స్కానింగ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్లతో పాటు గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని, ఈ సమావేశ oలో కొత్త అప్లికేషన్లు ఆరు రాగా వాటిలో రెండు ఇన్స్పెక్షన్ పూర్తి చేయడం జరిగిందని మిగతా నాలుగు రెండు నోటీసులు ఇచ్చిన వాళ్ళు రెస్పాండ్ కాలేదని ఒక సెంటర్ కి పెనాల్టీ వేయడం జరిగిందని ఒకటి ఆన్లైన్ అప్లికేషన్ సబ్మిట్ చేయటం జరగలేదని ఇంకా రెన్యువల్స్ కి ఆరు దరఖాస్తులు వచ్చాయని తెలియజేశారు,
నిరంతర తనిఖీలు: జిల్లా వ్యాప్తంగా రిజిస్టర్ అయిన స్కానింగ్ కేంద్రాలను కమిటీ సభ్యులు, వైద్యాధికారులు నిరంతరం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించాలని,
కఠిన చర్యలు: లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే కేంద్రాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, వాటి రిజిస్ట్రేషన్లను రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.
"బేటీ బచావో – బేటీ పడావో" స్ఫూర్తితో ఆడపిల్లల పరిరక్షణ మరియు బాలికా లింగ నిష్పత్తి మెరుగుపరిచేందుకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని,
ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ వేణు మాధవరావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణాదేవి , అసోసియేట్ ప్రొఫెసర్ జిజిహెచ్ డాక్టర్ రాధిక ,ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ హరిప్రసాద్, జాగృతి ఎన్జీవో ప్రెసిడెంట్ కుము దిని ,జిల్లా సలహా కమిటీ సభ్యులు, ప్రోగ్రామ్ అధికారులు, సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్, ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై సమావేశం

వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ చర్చలు
అభ్యంతరాలు స్వీకరణ

ఖమ్మం, నవంబర్ -11(సింగిడి):
రాజకీయ పార్టీల పూర్తి భాగస్వామ్యం, సమన్వయంతోనే పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమగ్ర ఓటర్ల సవరణ (సర్-2026), పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ శరవేగంగా సాగుతోందన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో నివాసంలో లేనివారు, స్థలం మారినవారు, మృతి చెందినవారు, నకిలీ/రెండోసారి నమోదైన ఓటర్ల పేరుతో ఏఎస్ డిడి కేటగిరీ కింద తొలగించిన ఓటర్లకు తుది జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తెలిపారు. జిల్లాలోని 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి వ్యాప్తంగా మొత్తం 1,57,854 మందిని ఏఎస్ డిడి కేటగిరీ కింద గుర్తించినట్లు తెలిపారు. ఇందులో శాశ్వతంగా వేరే ప్రాంతాలకు మారినవారు 1,01,549 మంది, మరణించినవారు 33,380 మంది, ఇతర నియోజకవర్గాల్లో ముందే ఓటు నమోదు పొందినవారు 11,004 మంది, గైర్హాజరైనవారు 11,371 మంది ఉన్నారన్నారు. వీరందరికీ సవరణ ప్రక్రియ కింద నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు జారీ చేసిన 1,75,840 నోటీసులలో 1,75,753 నోటీసులను పంపిణీ చేసి విచారణ నిర్వహించినట్లు స్పష్టం చేశారు. నోటీసుల విచారణ ప్రక్రియను నవంబర్ 26 నాటికి పూర్తి చేసి, నవంబర్ 30న ఓటర్ల తుది జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు.
వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు (ఫారమ్-18) పురోగతిపై కలెక్టర్ మాట్లాడుతూ, నవంబర్ 6 నాటికి దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసిందని, జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,09,942 ఫారమ్-18 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అందులో ఇప్పటివరకు 52,163 దరఖాస్తులను ఆమోదించామని, 2,353 దరఖాస్తులను నిబంధనల ప్రకారం తిరస్కరించామని, మిగిలిన 55,426 దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ఈఆర్ఓ/ ఏఈఆర్ఓ/బీఎల్ఓల స్థాయిలో వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల డీటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బిఎస్పి పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, టీడీపీ పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బి. వేణుగోపాల్, మంకెన రమేష్, సిపిఎం పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, సీపీఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఏ. విప్లవ కుమార్, ఐఎన్సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలికి ఘన సన్మానం



ఖమ్మం, నవంబర్ 11(సింగిడి):
ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా రెండోసారి ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన దొబ్బల సౌజన్య కి మహిళా కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. బుధవారం స్థానిక సంజీవరెడ్డి భవన్లో మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దొబ్బల సౌజన్య కి పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, సుడా చైర్మన్ పువ్వాల దుర్గాప్రసాద్, పోట్ల నాగేశ్వరావు కొండబాల కోటేశ్వరరావు జిల్లా సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండోసారి జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టడం ఆమె నాయకత్వంపై పార్టీకి ఉన్న నమ్మకానికి నిదర్శనం. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంలో, మహిళా కార్యకర్తలను సమన్వయం చేయడంలో ఆమె చేసిన కృషి అభినందనీయం. అని అన్నారు.పదవి అనేది కేవలం హోదా మాత్రమే కాదు... అది బాధ్యత. మహిళల హక్కుల కోసం, మహిళా కార్యకర్తల గౌరవం కోసం, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం మరింత పట్టుదలతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.దొబ్బల సౌజన్య నాయకత్వంలో ఖమ్మం జిల్లా మహిళా కాంగ్రెస్ మరింత బలోపేతం కావాలని, రాబోయే రోజుల్లో మహిళా శక్తి కాంగ్రెస్ పార్టీకి మరింత అండగా నిలవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దామ స్వరూప, రేఖ భార్గవి రమాదేవి అన్నపూర్ణ చంద్రిక నివేణి దివ్య రజిని స్రవంతి జరీనా పద్మ పాల్గొన్నారు

పెడింగ్ ప్రాజెక్టులపై చర్చ

గద్వాల బ్యూరో నవంబర్ 11(సింగిడి):
జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి డిగ్రీ కాలేజీ లో అలంపూర్ పెండింగ్ ప్రాజెక్టు ల సాధన జేఏసి చైర్మన్ నాయకులు రాం మోహన్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు.ముందుగా ఉండవెల్లి మండలంలో చురకుగా పాల్గొని,రైతు సమస్యలపై గలం విప్పిన జేఏసీ నాయకులు సురవరం లోకేశ్వరరెడ్డి మాజి సర్పంచుల సంఘం అధ్యక్షుల మరణంపై రెండునిమిషాలు మౌనం పాటించి నివాళులు ఆర్పించి ఆయన సేవలు గుర్తు చేసుకున్నారు. అనంతరం ఆర్డిఎస్ సమస్యలపై చర్చకొనసాగించారు. ఇందులో ముఖ్యంగా
ఆర్డీఎస్ కాలువ నీల్లు చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలి. తుమ్మిళ్ల కాలువ వెడల్పు పెంచి అలంపూరు చివరి ఆయకట్టు వరకు నీరు పారించాలి.మారమునగాల లిఫ్ట్ ఏర్పాటు చేసి ఉండవెల్లి, అలంపూర్ మండలంలోని 27 వేల ఎకరాలకు నీరందిచి చివరి ఆయకట్టు ను సస్యశ్యామలం చేయాలి.
ఆర్డీఎస్ కాలువ డిస్ట్రిబ్యూషన్ వారిగా రిపెర్లు చేయించాలని, డిస్ట్రిబ్యూషన్ వారిగా కమిటీ లు ఏర్పచి వారి సమక్షంలో వీటిలో ఉండే సమస్యలపై ఆర్డీఓకు వినతిపత్రం అందజేసే కార్యక్రమం 10వ తారిఖు నుండి 25 వరకు అందజేయలని జేఏసీ నాయకులు ప్రతిపాదించారు. ఎలినీనో కారణంగా అలంపూర్ నియోజకవర్గం లోని మండలాలకు తక్షణమే కరువు సాయం ఎకరాకు 50వేల రూపాయలు,కౌలురైతులకు 70వేల రూపాయలు అందజేయాలని, బ్యాంక్ లలో తీసుకున్న పంట పై తీసుకొన్న అప్పు పై వడ్డి రుణ మాఫి చెయాలని ప్రభుత్వానికి జేఏసీ నాయకులు డిమాండ్ చేసారు.ఈకార్యక్రమంలో తాలుకా జేఏసి నాయకులు గోపాల్ రెడ్డి,గౌరవ జేఏసీ నాయకులు నగేష్ ఆచారి,అలంపూర్ నియోజకవర్గం సంయుక్త జేఏసీ నాయకులు శేషన్ గౌడ్,అలంపూర్ మండల జేఏసీ చైర్మన్(సర్పంచ్)గొంగళ్ల ఈశ్వర్, ఉండవెల్లి జేఏసీ చైర్మన్ సుంకన్న, ఉండవెల్లి మండల సంయుక్త జేఏసి నాయకులు గొల్ల రాఘవేంద్ర ,సరేషు యాదవ్ మానవపాడు జేఏసి నాయకులు, రఘు, ,ఈశ్వర్ బోస్,పత్రికా విలేకరులు శేషు,నాయకంటికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



మహనీయుల విగ్రహాలపై పట్టింపేది

సూర్యాపేట జిల్లా ప్రతినిధి (సింగిడి):
అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామంలో మహనీయుల విగ్రహాలు నిరాదరణకు గురవుతున్నాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాలను గతంలో గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేశారు. ఖమ్మం–కోదాడ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా వాటిని తొలగించి గ్రామపంచాయతీ వద్ద పక్కన పెట్టారు. వీటితోపాటు వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని కూడా తయారు చేయించినప్పటికీ నేటికీ ప్రారంభించకుండా అలాగే వదిలేశారు. రహదారి విస్తరణ పనులు పూర్తయినా విగ్రహాల పునఃప్రతిష్ఠపై అధికారులు దృష్టి సారించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహనీయుల విగ్రహాలను ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం తగదని, అధికారులు స్పందించి తగిన స్థలంలో గౌరవప్రదంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది

• స్పీకర్ ప్రసాద్ కుమార్



వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 11(సింగిడి): జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. సంక్షేమం, అందరి అభివృద్ధే ప్రధానమని అన్నారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే) వికారాబాద్ జిల్లా తృతీయ మహాసభను మంగళవారం వికారాబాద్ లోని సత్య భారతి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల బాధలు విధితమేనని వాటి పరిస్కారం కోసం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఎండనకా, వాననకా, రాత్రనకా, పగలనకా జర్నలిస్టులు ప్రజల కోసం పని చేస్తున్నారని, ప్రజలకు వారదిగా ఉంటూ సేవలం దిస్తున్నారని అన్నారు. నిజాన్ని నిర్భయంగా ప్రజల ముందుకు తీసువస్తూ అపారమైన సేవలు చేస్తున్నారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని చెప్పారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలనే దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ఉన్నదని అన్నారు. జర్నలిస్టులకు అండగా ఉంటానని ఆయన చెప్పారు. జర్నలిస్టుల కోసం ప్రజాభవన్ లో కార్యాలయం సిబ్బంది అందుబాటులో ఉంటారని, హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లోనూ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఆయన గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా తెలపాలని ప్రసాద్ కుమార్ ఇంటి తలపులు ఎల్లపుడు తెరిచి ఉంటాయాని అన్నారు. వ్యక్తిగత సమస్యలైనా, అనారోగ్య సమస్యలు ఉన్నా మారెమైనా ఏదైనా సమస్యలు ఉన్నా సరే తప్పకుండా పరిష్కరిస్తానని అన్నారు. సీనియర్లు 20 ఏళ్లకు పైగా నేటికి వృత్తిలో కొనసాగుతున్నారని వారందరు సు పరిచయస్తులేనని ఆయన అన్నారు. వారి అనుభవమే మార్గదర్శకమని కలం బలమే ప్రజాస్వామ్యానికి కొండంత బలమని ఆయన కొనియాడారు. తొమ్మిది వేల ఐదు వందల కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. మీడియా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే నాలుగోవ స్తంభంగా విరాజిల్లాలని అన్నారు. ముఖ్యంగా నకిలీ వార్తలు, తప్పుడు సమాచారం వేగంగా వ్యాపిస్తోందని ఈ నేపథ్యంలో నిజమైన మీడియాపై చాలా బాధ్యత ఉందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల కోసం టీయూడబ్ల్యూజే చేస్తున్న నిరంతర పోరాటం నిజంగా అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ ఎం పీ కొండా తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, తాండూర్ శాసనసభ్యుడు బుయ్యని మనోహర్ రెడ్డి, తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రంగా రాజు, వికారాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, ఎ ఎం సీ చైర్మన్ శ్రీనివాస్, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలి

ఆర్.మధుసూదన్ యాదవ్ మాజీ కౌన్సిలర్



కొడంగల్, నవంబర్ 11(సింగిడి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ అభివృద్ధి పనులన్నింటినీ హకీంపేటకే తరలించారనీ, కనీసం కొడంగల్ ను రెవెన్యూ డివిజన్ గానైన ప్రకటించాలని కొడంగల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆర్.మధుసూదన్ యాదవ్ డిమాండ్ చేశారు.మంగళవారం కొడంగల్ ఆయన మాట్లాడుతూ, కొడంగల్ రెవెన్యూ డివిజన్ ను చేయడం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలని,గతంలో రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే గా ఉన్న తరుణంలో కూడా కొడంగల్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు పై ప్రస్తావించారని, మాటను ఇప్పటికీ అమలు చేయకపోవడంతో, రెవెన్యూ డివిజన్ కూడా హకీంపేటకే తరలిస్తారనే ఊహాగానాలు కొడంగల్ ప్రజల్లో వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.కొడంగల్ ను రెవెన్యూ డివిజన్ గా చేయకపోతే అసెంబ్లీ నియోజక వర్గంగా ఉన్న కొడంగల్ ప్రాంతం సాధారణ మండల కేంద్రంగా మిగిలిపోతదనీ, కొడంగల్ కేంద్రంగా కొనసాగించాల్సిన అభివృద్ధి పనులన్నీ ఇప్పటికే హకీంపేటకు తరలించారని అసహనం వ్యక్తం చేశారు.కొడంగల్ ను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించకపోతే త్వరలో భారీ ఎత్తున ఆందోళనలు మొదలు పెడతామని హెచ్చరించారు. రైతుమేళా పేరిట ముఖ్యమంత్రి మూడు రోజుల పర్యటనతో కొడంగల్ ప్రజలకు ఒనగూరిందేమీ లేదని,అంతేగాక ప్రజాధనం వృధా చేశారని , బర్త్ డే వేడుకలకు ఇంత హంగూ ఆర్భాటాలు అవసరమా అని అన్నారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ, బిఆర్ ఎస్ పార్టీ నాయకుడు వెంకట్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కైసర్‌నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలు అందజేసిన హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, నవంబర్ 11(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం కైసర్‌నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు సంబంధించి గతంలోనే మంజూరైనప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న ఇండ్ల పట్టాలను మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కొర్వి లక్ష్మి, మమతా, గౌసియా బేగమ్‌లకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను అందజేశారు. అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, డీసీసీ మైనారిటీ జనరల్ సెక్రటరీ షఫీ, వలీభాయ్, సరితా యాదవ్, యాద్గిరి తదితరులు పాల్గొన్నారు.



ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే టీజీఎస్ ఆర్టీసీ ధ్యేయం

రాష్ట్రవ్యాప్తంగా 86 ప్రధాన బస్ స్టేషన్లను మోడల్ బస్ స్టేషన్లుగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం

5000 కంటే ఎక్కువ రుద్ది ఉన్న బస్ స్టేషన్ల గుర్తింపు

సమాచార వ్యవస్థ పటిష్టం అన్ని బస్‌స్టేషన్లలో సిసిటీవీలో ఏర్పాటుకు సన్నాహాలు



కుత్బుల్లాపూర్, నవంబర్ 11(సింగిడి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బస్సుల్లో ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా 'తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ' (టీజీఎస్ఆర్టిసి) కీలక నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. బస్ స్టేషన్లలో రద్దీ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టడంతో పాటు, ప్రయాణికులకు అవసరమైన సదుపాయాలను మరింత బలోపేతం చేసేందుకు సంస్థ సరికొత్త కార్యాచరణ సిద్ధం చేసింది.ప్రయాణీకులకు సౌకర్యాలను మెరుగుపరచడం, బస్ స్టేషన్ల నిర్వహణను బలోపేతం చేయడం, ప్రయాణీకుల రాకపోకలు సజావుగా సాగేలా చూడటంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రధాన బస్ స్టేషన్లలో వసతులను మరింత విస్తరించడం కోసం యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా ప్రతిరోజూ 5,000 మందికి పైగా ప్రయాణికుల రద్దీ ఉండే 86 ప్రధాన బస్ స్టేషన్లను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే ప్రత్యేకంగా గుర్తించి, ఆ ప్రదేశాలలో మెరుగైన ప్రయాణికుల సమాచార, ప్రసార సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ 86 బస్ స్టేషన్లన్నింటిలోనూ ప్రయాణికుల అవసరం కోసం ఒక కంట్రోలర్ ను నియించడంతో పాటూ ప్రత్యేక విచారణ, సంప్రదింపు నంబర్లను ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రయాణికులు తమకు కావలసిన బస్సు సర్వీసులు, సమయాలకు సంబంధించిన వివరాలను ఎలాంటి ఆటంకం లేకుండా తెలుసుకోగలుగుతారు. బస్సు కార్యకలాపాలపై స్పష్టమైన, తాజా సమాచారాన్ని అందించేందుకు వీలుగా కొత్త బస్సు టైమ్ టేబుల్ బోర్డులను కూడా అన్ని బస్ స్టేషన్లలో త్వరలోనే ప్రదర్శించనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం బస్సు సర్వీసులకు సంబంధించి ముఖ్యంగా మొదటి బస్సులు ప్రారంభం నుండి చివరి బస్సు సమయాల గురించి క్రమం తప్పకుండా సమాచారం అందించేందుకు బస్ స్టేషన్లలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ (పి ఏ ఎస్) ఏర్పాటు చేశారు. ప్రయాణీకుల భద్రత, బస్ స్టాండ్లలో రద్దీ నిర్వహణ, కార్యకలాపాల పర్యవేక్షణను మరింత పటిష్టం చేసేందుకు త్వరలో అన్ని బస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. ఈ ప్రతిపాదిత సీసీటీవీ వ్యవస్థలను సంబంధిత ప్రాంతీయ కార్యాలయాలు, ప్రధాన కార్యాలయానికి నేరుగా అనుసంధానిస్తారు. దీనివల్ల ప్రయాణీకుల రాకపోకలు, బస్ స్టాండ్లలో రద్దీ పరిస్థితులు, బస్ స్టేషన్ కార్యకలాపాలను కేంద్రీకృత పర్యవేక్షణ ద్వారా నిరంతరం సమర్థవంతంగా పరిశీలించడానికి వీలవుతుంది. టీజీఎస్ఆర్టీసీ బస్ స్టేషన్లలో ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడం, రద్దీ నిర్వహణను నిర్ధారించడం, సురక్షితమైన, మరింత సౌకర్యవంతమైన, మెరుగైన వ్యవస్థీకృత ప్రయాణాన్ని అందించడమే యాజమాన్యం ప్రధాన ఉద్దేశ్యం. తెలంగాణ వ్యాప్తంగా ప్రయాణీకుల సౌకర్యాలను నిరంతరం మెరుగుపరచడానికి, ప్రజా రవాణా సేవలను మరింత బలోపేతం చేయడానికి టీజీఎస్ఆర్టీసీ ఎల్లవేళలా కట్టుబడి ఉందని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి వివరించారు.

పేద కుటుంబానికి అండగా కేటీఆర్ అభయం

వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 11(సింగిడి): జిల్లా పరిధిలోని పరిగి మండలం గోవిందా పూర్ గ్రామానికి చెందిన బాధిత బాలుడు గౌతమ్ వైద్యం కోసం బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె టి ఆర్ అభ్యయం ఇచ్చారు. ఉచితంగా కంటి క్యాన్సర్ చికిత్సకోసం తగిన సహాయం అందించడానికి హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి కె టి ఆర్ దృష్టికి తీసుకు వెళ్ళిన నేపథ్యంలో ఆయన పై విధంగా స్పందించారు. గొల్ల గౌతమ్ గత కొద్ది రోజులుగా కంటి క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి గౌతమ్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని గుర్తించి వారికి అండగా నిలిచారు. ఈ నేపథ్యంలో గౌతమ్‌ను బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు వద్దకు తీసుకెళ్లి పరిస్థితిని వివరించగా, గౌతమ్‌కు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, చికిత్స కోసం సహాయం అందించనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న పేద కుటుంబానికి అండగా నిలిచి, మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేసిన కొప్పుల మహేష్ రెడ్డికి భరోసా ఇచ్చిన కె టి ఆర్ కు గౌతమ్ కుటుంబసభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు.



ముఖ్యమంత్రి పర్యటన బందోబస్తును సమర్థవంతంగా నిర్వహించారు

పోలీసు అధికారులు, సిబ్బందికి మల్టీ జోన్ ఐజీపీ షా నావాజ్ ఖాసీం అభినందనలు

వికారాబాద్ ప్రతినిధి,నవంబర్ 11(సింగిడి): జిల్లా పరుధిలోని సీ ఎం రేవంత్ రెడ్డి ప్రాతినిద్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ఈ నెల 7నుండి 9వరకు సీ ఎం ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటించిన నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్త్ ను సమర్థవంతంగా నిర్వహించిన నందుకుగాను మల్టీ జోన్ ఐజీపీ షా నావాజ్ ఖాసీం ప్రసంశించారు. కార్యక్రమాలు శాంతియుతంగా జరిగేందుకు ఎస్పీ స్నేహ మెహ్రా, తదితర పోలీసు అధికారులు కృషి చేశారని కితాబు అభినందించారు. ముఖ్యమంత్రి నియోజకవర్గ పర్యటన సందర్భంగా నిర్వహించిన బందోబస్తు మరియు వివిధ కార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగియడం పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. మల్టీ జోన్ 2, ఐపీజీ షా నవాజ్ ఖాసీం నాయకత్వం లో చార్మినార్ జోన్ డీఐజీ చందన దీప్తి, ఆధ్వర్యంలో, వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,



నారాయణపేట ఎస్పీ డాక్టర్ జి వినీత్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్,ల సమన్వయంతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, తదితర పోలీస్ అధికారులు బందోబస్తు విధుల్లో పాల్గొని సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీపీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ముందస్తు ప్రణాళిక, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, విధుల కేటాయింపు, వివిధ విభాగాల మధ్య సమన్వయం వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయడం వల్లపర్యటనలోని అన్నికార్యక్రమాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా పూర్తయ్యాయని తెలిపారు. బందోబస్తు విధుల్లో పాల్గొన్న ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావం, క్రమశిక్షణ, సమన్వయం బాధ్యతాయుతమైన విధి నిర్వహణను ఐజీపీ ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అదేవిధంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, బందోబస్తు నిర్వహణలో సమన్వయంతో పనిచేసిన పోలీస్ అధికారులందరికీ, సిబ్బందికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ఇదే విధమైన అంకితభావం, క్రమశిక్షణ, సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఐజీపీ సూచించారు.

బ్రాహ్మణవాడలో తాగునీటి సమస్యకు త్వరలో పరిష్కారం

- చెడిపోయిన బోరుకు రెండు, మూడు రోజుల్లో మరమ్మతులు
- ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కొనసాగిస్తాం
- కౌన్సిలర్ కొండాపురం జగన్ (జగదీశ్వర్)

సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 11(సింగిడి): సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు బ్రాహ్మణవాడలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టినట్లు కౌన్సిలర్ కొండాపురం జగన్ (జగదీశ్వర్) తెలిపారు. వార్డులో బోరు చెడిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. బోరులోని పైపులు కూరుకుపోవడంతో మరమ్మతు పనుల్లో జాప్యం జరుగుతోందని వివరించారు. మరో రెండు, మూడు రోజుల్లో బోరుకు మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. అప్పటివరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా స్పోక్ పర్సన్ సొంటి రెడ్డి పున్నారెడ్డి జన్మదిన వేడుకలు

కుత్బుల్లాపూర్, నవంబర్ 11(సింగిడి): తెలంగాణ రాష్ట్ర మాజీ పిసిసి కార్యదర్శి, ప్రభుత్వం చే నూతనంగా నియమించబడిన స్పోక్ పర్సన్ సొంటి రెడ్డి పున్నారెడ్డి జన్మదిన వేడుకలు కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, అభిమానులు స్థానిక పార్టీ నేతల సమక్షంలో, విద్యార్థుల ప్రేమాభిమానాలు, ఉపాధ్యాయుల ఆత్మీయత, ఘన సత్కారాల నడుమ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్‌లో జన్మదిన వేడుకలు ఎంతో వైభవంగా జరిగాయి. సొంటి రెడ్డి పున్నారెడ్డి జన్మదిన వేడుకలకు హాజరైన పలువురు శాలువాలతో సత్కరిస్తూ, పుష్పగుచ్ఛాలు అందజేసి, పూలమాలలు వేసి, కేకులు కట్ చేసి, తినిపించి, మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుతున్నారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి జన్మదిన వేడుకలకు హాజరైన పలువురు రాబోయే కాలంలో మరిన్ని ఉన్నత పదవులను పొంది, ప్రజాసేవలో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, అందుకు సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం సొంటి రెడ్డి పున్నారెడ్డి మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలకు ప్రత్యక్షంగా హాజరైన ఆత్మీయులు అభిమానులు స్నేహితులకు పరోక్షంగా జన్మదిన వేడుకలు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారుల ఆప్యాయత, ఉపాధ్యాయుల అభిమానం, ఆశీస్సులు, చిరునవ్వులతో ఈ వేడుక మరపురాని మధుర జ్ఞాపకంగా నిలిచిందన్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా మమేకమైన ఆనందకర క్షణాలు తన జీవితంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, ప్రేమాభిమానాలే జీవితంలో లభించే గొప్ప బహుమతులని పున్నారెడ్డి ఆనందం వ్యక్తం చేశారు.





60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, నవంబర్ 11(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీలో రూ. 60 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. హెచ్ఏఎల్ ఈస్ట్, హెచ్ఏఎల్ వెస్ట్ కాలనీలలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు హెచ్ఏఎల్ కాలనీ నుంచి ఆదర్శ్ నగర్ వరకు లింక్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ భారీ స్థాయిలో నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు కు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జి. సృజన కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందని, కనీసం సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గవ్యాప్తంగా అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తూ, ఇప్పటివరకు సుమారు రూ. 30 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఖఖవీ ట్రస్ట్ అధినేత డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ గారితో పాటు హెచ్ఏఎల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆంజనేయులు,వేణుగోపాల్ రెడ్డి, జగన్ గౌడ్, అలీ భాయ్, యాదగిరి, జేబీఎస్ మూర్తి, వేణు ప్రసాద్, వెంకటసుబ్బయ్య, రాంబాబు మరియు స్థానిక డివిజన్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చిరెడ్డి , ఇంద్ర సేన రెడ్డి, కూన రాఘవేంద్ర గౌడ్,యం సాగర్, సుజిత్ రెడ్డి పాల్గొన్నారు.





సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ స్థలం కోసం పలు ప్రాంతాలను పరిశీలించిన మంత్రులు

సిద్దిపేట ప్రతినిధి నవంబర్ 11(సింగిడి): ఈనెల 19 వ తేదీన సిద్దిపేట లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ నేపథ్యంలో సిద్దిపేట లో సభ స్థలం కోసం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు మంత్రులు వివేక్ వెంకట్ స్వామి,పొన్నం ప్రభాకర్, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ జిల్లా కలెక్టర్ హైమవతి ,వివిధ నియోజకవర్గాల ఇంచార్జి లు పూజల హరికృష్ణ , చెరుకు శ్రీనివాస్ రెడ్డి,కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ లు ,తదితరులు పాల్గొన్నారు



మున్సిపల్ కార్యాలయంలో అధికారుల పర్యవేక్షణ కరువు!

వనపర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారుల తీరు మారడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయంలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉద్యోగులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని సమన్వయం చేస్తూ విధులు సక్రమంగా నిర్వహించేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్‌పై ఉంది.

ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉద్యోగుల తీరు

విధులకు డుమ్మా.. ఖాళీ కుర్చీలే దర్శనం.. ప్రజలకు తప్పని ఇబ్బందులు

సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడిందా? కమిషనర్, చైర్‌పర్సన్ బాధ్యత ఏమిటి?



వనపర్తి ప్రతినిధి, నవంబర్ 11(సింగిడి): వనపర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారుల తీరు మారడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్యాలయంలో ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా ఉద్యోగులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిని సమన్వయం చేస్తూ విధులు సక్రమంగా నిర్వహించేలా పర్యవేక్షించాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్‌పై ఉంది. పాలకవర్గం తరఫున చైర్‌పర్సన్ కూడా ప్రజలకు అందాల్సిన సేవలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అయితే మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కనిపించిన పరిస్థితులు ఉద్యోగుల విధి నిర్వహణపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. పలు విభాగాల్లో ఉద్యోగులు తమ చాంబర్లలో అందుబాటులో లేకపోవడం, కార్యాలయంలో ఎక్కువ శాతం కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వడం గమనార్హం. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన కార్యాలయంలోనే సిబ్బంది అందుబాటులో లేకపోతే సామాన్య ప్రజలు తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలన్న ప్రశ్న తలెత్తుతోంది. పట్టణ ప్రజలు పన్నులు చెల్లిస్తూ ప్రభుత్వ కార్యాలయాల ద్వారా మెరుగైన సేవలు పొందాలని ఆశిస్తున్నారు. కానీ కార్యాలయానికి వచ్చిన ప్రజలకు సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడం, పనుల కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం ఇబ్బందికరంగా మారుతోంది. ఉద్యోగుల విధులపై పర్యవేక్షణ లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమా? ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ స్పందించి కార్యాలయంలో ఉద్యోగుల హాజరు, విధుల సమయపాలన, ప్రతి విభాగంలో సిబ్బంది అందుబాటులో ఉండేలా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఖాళీ కుర్చీలతో కాకుండా ప్రజలకు అందించే సేవలతో మున్సిపల్ కార్యాలయం గుర్తింపు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్ స్పందించి అధికారులు సక్రమంగా విధులకు హాజరయ్యే విధంగా చూడాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్ వివరణ:
చాలా మంది అధికారులు విధులకు హాజరు కాలేదని తెలిసిందని మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్ చెప్పారు. కొందరు సెలవు పెట్టారని, మరికొందరు ఆఫీసుకు రాలేదని చెప్పారు. వారు ఎందుకు రాలేదో తెలుసుకుంటామని, వారిపై చర్యలు తీసుకొని ఇకముందు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని ఆమె చెప్పారు.

వేయి స్తంభాల దేవాలయంలో కార్తీక మాసోత్సవాలు

ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ,నవంబర్ 11(సింగిడి): హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల దేవాలయం ఆలయంలో మంగళవారం కార్తీక మాసోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పక్షాన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక మాసోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. తెల్లవారుజామున బ్రాహ్మీ ముహూర్తంలో మంగళ వాయిద్యాల నడుమ ఉత్తిష్ఠ గణపతి ఆరాధనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం రుద్రేశ్వర స్వామివారికి 11 లీటర్ల ఆవుపాలతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించడంతో పాటు సామూహిక రుద్రాభిషేకాలు జరిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసం భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని, భక్తిభావాన్ని పెంపొందించే అత్యంత పవిత్రమైన మాసమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు కులమతాలకు అతీతంగా సామూహికంగా దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించడం ఈ మాసం ప్రత్యేకత అని తెలిపారు. ఎంతో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన వేయి స్తంభాల దేవాలయంలో పరమశివుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పుప్పాల ప్రభాకర్, నాగరాజు, తోట వెంకటేశ్వర్లు, బోడ డిన్న తదితరులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి. అనిల్ కుమార్, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి ఆశీర్వచనం చేశారు.



తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులను పూర్తి చేయాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

వరంగల్, నవంబర్ 11(సింగిడి): దేశాయిపేట ప్రధాన ఫిల్టర్ బెడ్ నుంచి ఎంజీఎం ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్బీ కళాశాల, వరంగల్ డెయిరీతో పాటు కాకతీయ కాలనీ తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ మరమ్మతు, మార్పిడి పనులను వేగవంతంగా పూర్తి చేసి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం ములుగు రోడ్డు వద్ద కొనసాగుతున్న ప్రధాన పైపులైన్ మార్పిడి పనులను కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజాం కాలం నాటి సుదీర్ఘకాలంగా వినియోగంలో ఉన్న పాత పైపులైన్‌లో ఏర్పడిన లీకేజీల కారణంగా మరమ్మతు పనుల్లో భాగంగా కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తున్న తీరును పరిశీలించి, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేకించి ఎంజీఎం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వంటి ప్రధాన వైద్య సంస్థలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎల్బీ కళాశాల, వరంగల్ డెయిరీ, కాకతీయ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలకు సైతం నీరు అందేలా త్వరతగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పైపులైన్ పనులు పూర్తయిన వెంటనే పరీక్షలు నిర్వహించి, తాగునీటి సరఫరాను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. నగర ప్రజలకు, ముఖ్యంగా ఆసుపత్రులకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించడంలో అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ పర్యటనలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ శరత్ చంద్ర పవార్



నల్గొండ ప్రతినిధి నవంబర్ 11 (సింగిడి): సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు. సైబర్ నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను మంగళవారం ఆయన అదనపు ఎస్పీ జి. రమేష్, సైబర్ క్రైమ్స్ డీఎస్పీ టి. లక్ష్మీనారాయణతో కలిసి ఆవిష్కరించారు. మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బ్యాంకు అధికారులు, కస్టమర్ కేర్ సిబ్బంది, ప్రభుత్వ అధికారులమని చెప్పి ఫోన్ చేసే గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించవద్దని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా సమాచారం వచ్చినప్పుడు ఆగి, ఆలోచించి, ధృవీకరించుకున్న తర్వాతే స్పందించాలని కోరారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ ఫ్రాడ్ రిజిస్ట్రీ వాట్సాప్ నంబర్ 8712672222ను కూడా వినియోగించుకోవచ్చన్నారు. డీ4సీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అప్రమత్తతే సైబర్ నేరాల నివారణకు తొలి రక్షణ అని ఎస్పీ పేర్కొన్నారు.

మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- **జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



నల్లగొండ ప్రతినిధి నవంబర్ 11(సింగిడి): మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్, గోదాముల నిర్మాణానికి వారంలో శంకుస్థాపన జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్మంగళవారం ఆయన అనుముల మండలం, శ్రీనాధపురం గ్రామంలో పంట పొలాల వద్ద రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా నీటి లభ్యత తక్కువగా ఉన్నందున ఆరుతడి పంటలు,తక్కువనీరు అవసరమయ్యే పంటలు,మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు పండించాలని కలెక్టర్ అన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులను కోల్డ్ స్టోరేజ్ లలో భద్రపరిచి మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకోవడం ద్వారా వారి ఉత్పత్తులకు అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. ఇందుకు రైతులందరూ కలిసి ముందుకు వస్తే మహిళా సంఘాల ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజ్ లు, గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విబీజీ రామ్ జీ పథకం కింద గోదాముల నిర్మాణం చేపట్టేలా ప్రణాళిక రూపొందిస్తామని, మహిళా సంఘాలకు అనువైన భూమి అందుబాటులో ఉంటే వారం రోజుల్లోనే శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కోల్డ్ స్టోరేజ్, గోదాముల సదుపాయం అందుబాటులోకి వస్తే రైతులు తమ పంట ఉత్పత్తులను నిల్వ చేసుకొని మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం రైతులందరితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గోదాముల నిర్మాణం, పంటల సాగు, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా అందిస్తుందని, అయితే రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేసుకోవాలని తెలిపారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలను మార్చుకుంటూ, నీటిని పొదుపుగా వినియోగించుకొని అధిక ఆదాయం వచ్చే పంటల సాగుపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. ఎల్ నినో కారణంగా ప్రస్తుతం అందుబాటులో ఉన్నంత నీరు కూడా రానున్న రోజుల్లో ఉండకపోవచ్చని, దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు తక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయాలని . మార్కెట్లో డిమాండ్, ధరలు ఉన్న పంటలను గుర్తించి సాగు చేయాలని, పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్ పరిస్థితులు ఎలా ఉంటాయో ముందుగానే పరిశీలించాలని సూచించారు. 100 రోజుల్లో చేతికి వచ్చే పంటలకు మార్కెట్లో ఎంత మేరకు గిరాకీ ఉందో తెలుసుకొని సాగు నిర్ణయాలు తీసుకోవాలని, శ్రీరామనవమి వరకు పరిస్థితులను గమనించి తదుపరి సాగుపై నిర్ణయం తీసుకోవాలని రైతులకు సూచించారు. చిక్కుడు, మినుములు, కందులు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. రైతుల్లో డిగ్రీలు చదువుకున్న వారు కూడా ఉన్నారని, వారు వ్యవసాయంలో నూతన ఆలోచనలతో ముందుకు రావాలని కలెక్టర్ వినోద్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ మల్రెడ్డి సీతమ్మ . ఉన్నారు .

అయ్యప్ప సన్నిధిలో అన్నప్రసాద వితరణ..



కోదాడ, నవంబర్ 11(సింగిడి): తెలంగాణ శబరిమలగా ప్రసిద్ధిగాంచిన అనంతగిరి శ్రీ అయ్యప్ప సన్నిధిలో నిరంతర అన్నప్రసాద వితరణ భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఇందులో భాగంగా 35వ రోజు సుమారు 750 మంది అయ్యప్ప స్వాములు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ రోజు అన్నప్రసాద వితరణకు బుర్రా పుల్లారెడ్డి--సుధారాణి దంపతులు, బుర్రా ప్రమోద్ రెడ్డి దంపతులు, పసుమర్తి హరిప్రకాష్--ప్రత్యూష దంపతులు దాతలుగా వ్యవహరించారు. అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని భక్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పందిరి వీరయ్య, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, ఈదుల యాదగిరి, దండు రమేష్, చిర్రా ఉపేందర్, బాలకృష్ణ, సిద్దేపల్లి లక్ష్మయ్య, ఆశీర్వాదంతో పాటు పలువురు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

తెలంగాణకు గర్వకారణంగా అక్షిత

భారత జట్టుకు ఎంపికైన క్రీడాకారిణికి కేటీఆర్ అభినందనలు

అక్షితకు ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్



చింతపల్లి, నవంబర్ 11(సింగిడి): గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించి, భారత జట్టుకు ఎంపిక కావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. మండలంలోని చాకలి శేరిపల్లి గ్రామానికి చెందిన అక్షిత తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో నిర్వహించిన జాతీయ స్థాయి త్రోబాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరఫున పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచింది. తన ప్రతిభతో స్వర్ణ పతకం సాధించడంతో పాటు భారత జట్టుకు ఎంపిక కావడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. అక్షితను ప్రత్యేకంగా అభినందించి, అంతర్జాతీయ స్థాయిలోనూ మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అక్షిత క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు కూడా అక్షితకు ఆర్థిక చేయూతనందించారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్న అక్షితను నాయకులు అభినందించారు. ఈ నెల నవంబర్ 19 నుంచి 23 వరకు శ్రీలంకలో నిర్వహించనున్న ఆసియన్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో అక్షిత భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఈ పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, పీఏసీఎస్ వైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మాచర్ల శ్రీశైలం, అండేకర్ అశోక్, ఉప సర్పంచ్ పగడాల వెంకటయ్య, అక్షిత తండ్రి జగతయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణలో న్యాయవాదుల పాత్ర కీలకం

ఐఎల్‌పిఎ రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరించిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



హన్మకొండ, నవంబర్ 11(సింగిడి): ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ లో ప్రజాస్వామ్య రక్షణ ద్వారానే ప్రజలు రక్షించబడతారని, ప్రజాస్వామ్య రక్షణలో న్యాయవాదులు కీలకపాత్ర పోషించాలని వరంగల్ పచ్చిమ ఎమ్మెల్యే నాయిని రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కేంద్రం పచ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ 6వ రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాజకీయ విలువలు, రాజ్యాంగ హక్కులు, మానవీయ విలువల గూర్చి సామాన్య ప్రజలకు తెలియాల్సిన అవసరముందని, రాజకీయ పార్టీలతో అన్ని పనులు కావని, విలువలు, హక్కుల బోధనలో న్యాయవాదులు ముందుంటే ఆ సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం తొందరగా వస్తుందని అన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్కతో సహా హై కోర్టు మాజీ న్యాయమూర్తి, సీనియర్ సిటిజన్స్ కమీషన్ కమీషనర్ ఈద తిరుమలదేవి, వరంగల్ జిల్లా జడ్జి వి.బి నిర్మలా గీతాంబ, హనుమకొండ జిల్లా జడ్జి ఎం.ఆర్ సునీతతో పాటు వివిధ రంగాల మేధావులు హాజరయ్యే ఐ ఎల్ పి ఎ రాష్ట్ర సదస్సును ఈ నెల 14 న హనుమకొండ హంటర్ రోడ్ 'డి' కన్వెన్షన్ లో నిర్వహించడం గొప్ప విషయమని, ఈ రాష్ట్ర సదస్సుకు న్యాయవాదులు పెద్ద ఎత్తున్న హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సదస్సు కన్వీనర్ చిల్ల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక న్యాయం ప్రధాన ఎజెండాగా కార్యక్రమాలు చేస్తున్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర సదస్సులో ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని బార్ ల నుండి న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, రాష్ట్ర కమిటి సభ్యులు జన్ను పద్మ, జిల్లా నాయకులు పూసపల్లి శ్రీనివాస్, నమ్మనీ చంద్రశేఖర్, జంగా స్వప్న, గురిమిల్ల రాజు, ఎలమాద్రి రవి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య సేవలు

అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం



కోదాడ, నవంబర్ 11(సింగిడి): ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రోత్సాహంతో 30వ వార్డు కౌన్సిలర్ కారింగుల ఉమ అంజన్ గౌడ్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 200 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా, 35 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించిన వైద్యులు వారికి చికిత్స అందించారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ముందుకొచ్చిన అంజన్ గౌడ్ కృషిని పలువురు అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు భవిష్యత్తులోనూ కొనసాగాలని స్థానికులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చలిగంటి ప్రసాద్, పంది తిరపయ్య, ఎన్‌సీహెచ్ రాము, రాపోలు శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్, పంగవీటి శేఖర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మిట్టకోలు కమలాకర్, చలిగంటి రంగా, తంగెళ్లపల్లి లక్ష్మణ్, మల్లయ్య, స్టాలిన్, నర్సి, శివ, శేషు, నజీర్, రవి తదితరులు పాల్గొన్నారు.

స్పృహ కోల్పోలేదని నిర్లక్ష్యం చేయొద్దు..

- **అత్యవసర శస్త్రచికిత్సతో చింతపల్లి మహిళకు పునర్జన్మ ప్రసాదించిన యశోదా ఆసుపత్రి వైద్యులు**



చింతపల్లి, నవంబర్ 11(సింగిడి): రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైనప్పటికీ స్పృహ కోల్పోకుండా సాధారణంగానే కనిపించిన ఓ మహిళ మెదడులో రక్తపు గడ్డ ఏర్పడి ప్రాణాపాయ స్థితికి చేరుకుంది. హైదరాబాద్‌లోని మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సకాలంలో అత్యవసర మెదడు శస్త్రచికిత్స నిర్వహించి ఆమె ప్రాణాలను కాపాడారు.మండలంలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన జల్లాల మల్లమ్మ (49) సెప్టెంబర్ 16న ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా చింతపల్లి సమీపంలో మరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తల, ముఖం, కుడిచేతికి గాయాలయ్యాయి. తొలుత స్థానిక ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించగా, మెదడు సీటీ స్కాన్‌లో ఎడమవైపు పురైకు, మెదడుకు మధ్య రక్తపు గడ్డ ఏర్పడినట్లు గుర్తించారు. దీంతో ఆమెను మలక్‌పేట్ యశోదా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో రక్తపు గడ్డ మెదడుపై తీవ్ర ఒత్తిడి కలిగిస్తూ, మెదడును మధ్య రేఖ నుంచి పక్కకు నెట్టినట్లు గుర్తించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన న్యూరోసర్జరీ నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ బోట్ల సెప్టెంబర్ 17న అత్యవసరంగా శస్త్రచికిత్స నిర్వహించి రక్తపు గడ్డను తొలగించారు. అనంతరం పురై ఎముక భాగాన్నిటైటానియం ప్లేట్లు, స్క్రూలతో తిరిగి అమర్చారు. శస్త్రచికిత్స అనంతరం ఐసీయూలో ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో చికిత్స అందించారు. తదుపరి పరీక్షల్లో మెదడుపై ఒత్తిడి పూర్తిగా తగ్గినట్లు నిర్ధారణ అయింది. సెప్టెంబర్ 22న మల్లమ్మ పూర్తి స్పృహతో, స్థిరమైన ఆరోగ్య పరిస్థితిలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ శ్రీనివాస్ బొట్ల మాట్లాడుతూ తలకు గాయమైనప్పుడు బాధితులు స్పృహ కోల్పోకపోయినా మెదడులో రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంటుందని యశోదా ఆసుపత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాస్ రెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర సూచించారు.

వాయిదా పడిన మరో తెలుగు సినిమా



తెలుగు సినీ పరిశ్రమలో సినిమాల వాయిదా పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా మరో చిత్రం రిలీజ్ కూడా పోస్ట్‌పోన్ అయింది. అదే శర్వానంద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'భోగి సంపత్ నంది తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. నా రొమాంటిక్ డేట్ ఎలా ఉండాలంటే..: మనసు విప్పిన అనశ్వరఈ సినిమాను నవంబరు 12న విడుదల చేయాలని ముందుగా నిర్ణయించారు. కానీ సెన్సార్ విషయంలో సందిగ్ధత నెలకొన్నట్లు తెలుస్తోంది. సెన్సార్ బోర్డు వద్ద సమస్య తలెత్తడంతో ఈ చిత్రాన్ని రివైజింగ్ కమిటీ ముందుకు తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇటీవల సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని కూడా చివరి నిమిషంలో రద్దు చేసుకున్నారు. సెన్సార్ సర్టిఫికెట్ పొందేందుకు మరింత సమయం పట్టే పరిస్థితి ఉండటంతో, సినిమా విడుదలను వాయిదా వేయాలని చిత్రబృందం భావించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సినిమా రిలీజ్‌ను పోస్ట్‌పోన్ చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. కొత్త విడుదల తేదీని త్వరలోనే తెలియజేస్తామని వెల్లడించింది.

నరకానికి కౌంట్‌డౌన్..

'ఇరుముడి' సినిమాలో గ్లామర్‌కి సహజమైన నటనని జోడించి సినీ ప్రేమికుల్ని ఆకట్టుకున్నారు అందాల తార ప్రియా భవానీ శంకర్. ఇప్పుడామె తమిళంలో వరుస చిత్రాలలో నటిస్తూ జోరుమీదున్నారు. ప్రియా.. నటుడు అరుళ్ ప్రధాన పాత్రల్లో హారర్ చిత్రం 'డిమోంటీ కాలనీ 3' తెరకెక్కుతోంది. ది ఎండ్ ఈజ్ టూ ఫార్ అనేది ఉపశీర్షిక. దీపావళి సందర్భంగా ఈ సినిమాని వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. 'నరకానికి కౌంట్‌డౌన్ మొదలైంది.. మీ కోసం ఈ సంక్రాంతికి ఓ పీడకల ఎదురు చూస్తోంది' అనే వ్యాఖ్యతో ఎక్స్‌లో పోస్టర్‌ని ఆవిష్కరించింది. అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ముత్తు కుమార్, మీనాక్షి, అర్చన తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. డిమోంటీ కాలనీ' ఫ్రాంచైజీలో భాగంగా రూపొందుతున్న హారర్ థ్రిల్లర్ ఇది. ఇప్పటికే ఈ ఫ్రాంచైజీ నుంచి విడుదలైన రెండు భాగాలు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించాయి.



ప్రభాతనవ సింగిడి | SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం

వివాహ బంధంతో ఒక్కటైన అనిరుధ్ - కావ్యా మారన్



సంగీత దర్శకుడు అనిరుధ్ , కావ్యా మారన్ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. గ్రీస్‌లో బుధవారం (నవంబరు 11) అంగరంగ వైభవంగా వీరి వివాహ వేడుక జరిగింది. అగ్ర నటుడు రజనీకాంత్, తమిళనాడు మాజీ సీఎం స్టాలిన్ సహా తమిళనాడుకు చెందిన సినీ, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. తమ వివాహానికి సంబంధించిన ఫొటోలను అనిరుధ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. 'జీవితంలో ఒక్కసారే వచ్చే సందర్భం, జీవితాంతం. 11.11' అని క్యాప్షన్ జోడించారు. నవంబరు 21న చెన్నైలో రిసెప్షన్ వేడుకను నిర్వహించనున్నట్లు సమాచారం.



Priya Bhavani Shankar

Samantha Ruth Prabhu

సినిమా సింగిడి Cinma Singidi

గురువారం
12-11-2026

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం ప్రెగ్నెన్సీ కారణంగా సినిమాలకు కొద్దిగా గ్యాప్ ఇచ్చినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. చివరగా 'మా ఇంటి బంగారం' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న ఆమె, ప్రస్తుతం తమిళంలో పాపులర్ కుకింగ్ షో అయిన 'సెలబ్రిటీ మాస్టర్ షెఫ్ తమిళ్'కు హోస్ట్‌గా వ్యవహరిస్తూ అలరిస్తున్నారు. అంతేకాకుండా వివిధ ఇంటర్వ్యూలు, టాక్ షోలలో పాల్గొంటూ నిత్యం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతున్నారు. తాజాగా, ఓ షోలో సమంత పాల్గొని తన వృత్తిపరమైన జీవితం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తన జీవితంలో ఎదురైన వైఫల్యాల గురించి మాట్లాడుతూ ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. తన జీవితంలో మొదటి వ్యాపార భాగస్వామ్యం అనుకున్న విధంగా జరగలేదని, ప్రతి చిన్న విషయాన్ని చాలా వివరంగా తెలుసుకోవాలనుకున్నానని.. కానీ అనుకోని విధంగా ఆ ప్రాజెక్ట్ విఫలమైందని తెలిపారు. అయితే జీవితంలో ఎదురయ్యే మొదటి వైఫల్యం నిజానికి ఒక మంచి విషయమే కావచ్చునని సమంత అభ్రాయపడ్డారు. విజయం కంటే వైఫల్యాలే మనుషులకు ఎక్కువ పాఠాలు నేర్పుతాయని స్పష్టం చేశారు. తన జీవిత ప్రయాణం కేవలం తాను సాధించిన విజయాల నుండి మాత్రమే కాకుండా, తాను ఎదుర్కొన్న ఓటములు, వైఫల్యాల నుండి నేర్చుకున్న అనుభవాలతోనే ముడిపడి ఉందని సమంత చెప్పుకొచ్చారు.

జీవితంలో ఎన్నో పాఠాలు నేర్చుకున్నా
-సమంత

నన్ను తీసుకోలేదు కాబట్టి ఆ సినిమా ఫ్లాప్ అయింది..
బాబు మోహన్

నేచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వచ్చిన 'ది ప్యారడైజ్' మూవీ మరోసారి వార్తల్లో నిలిచింది. ఇందులో నటించే అవకాశం కోసం తనకు గెటప్ వేయించి, లుక్ టెస్ట్ కూడా చేసి, షూటింగ్ సమయంలో పిలుస్తామని చెప్పి తర్వాత పట్టించుకోలేదంటూ షాకింగ్ కామెంట్స్ చేశారు సీనియర్ నటుడు బాబు మోహన్. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన ది ప్యారడైజ్ మూవీ గురించి మాట్లాడుతూ.. 'ఈ సినిమా కోసం నాకు గెటప్ వేశారు, లుక్ టెస్ట్ చేశారు. బ్రహ్మాండంగా ఉంది అన్నారు. కానీ ఏమైందో తెలియదు. షూటింగ్‌కు నన్ను పిలవలేదు. మరి ఈ సినిమాకు నేను పనికిరాను అనుకున్నారేమో.. నాకంటే బెస్ట్ యాక్టర్లు వస్తారు అనుకున్నారేమో నన్ను పక్కన పెట్టారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737